శుక్రవారం 27-10-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 216

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



ఫ్యాషన్





ఓవర్ స్టైల్

ఎవర్‌గ్రీన్ డ్రెస్‌గా ఎప్పటికీ
శారీ ముందు వరసలో ఉంటుందని తెలిసిందే.
అయితే, చీరకట్టు అందం గురించి రొటీన్ మాటలు కాదు
ఇంకాస్త సృజనను జోడించి స్టైలిష్ లుక్ తీసుకురావాల్సిందే
అనుకునేవారిని ఇట్టే ఆకట్టుకుంటోంది శారీ ఓవర్ కోట్.
పట్టు చీరల మీదకు ఎంబ్రాయిడరీ లాంగ్ జాకెట్స్ ధరించడం తెలిసిందే.
కానీ, అవి సంప్రదాయ వేడుకలకే పరిమితం.
వెస్టర్న్ పార్టీలకూ శారీ స్టైల్‌ను పరిచయం చేయాలనుకుంటే
ఈ ఇండోవెస్టర్న్ స్టైల్‌ని హ్యాపీగా ట్రై చేయచ్చు.
శారీ మీదకు ఓవర్‌కోట్‌ను ధరించి కాన్ఫిడెంట్ లుక్స్‌తో కలర్‌ఫుల్‌గా వెలిగిపోవచ్చు.

సేమ్ టు సేమ్
శారీ–ఓవర్ కోట్ ఒకే కలర్ ప్యాటర్న్‌లో ఉంటే ఆ స్టైల్ సూపర్బ్ అనిపించకుండా ఉండదు. ఆభరణాల జిలుగులు అవసరం లేని ఈ ప్యాటర్న్ స్టైల్ పార్టీలో ప్రత్యేకంగా వెలిగిపోతుంది.

ధోతీ శారీ
సాధారణంగానే ధోతీ శారీ ఓ ప్రత్యేకమైన లుక్స్‌తో ఆకట్టుకుంటుంది. ఇక దాని మీదకు ఫ్లోరల్ ఓవర్ కోట్ ధరిస్తే ఎక్కడ ఉన్నా మరింత స్పెషల్‌గా కనిపిస్తారు.

ఎంబ్రాయిడరీ కోట్స్
సిల్క్ ప్లెయిన్ శారీస్‌కి ఎంబ్రాయిడరీ ఓవర్ కోట్ హుందాతనాన్ని తీసుకువస్తుంది. ఈ స్టైల్ ధోతీ శారీస్‌కు కూడా వర్తిస్తుంది.

నీ లెంగ్త్ కోట్స్
మోకాళ్ల దిగువ భాగం వరకు ఉండే ట్రాన్స్‌పరెంట్ ఓవర్ కోట్స్ లేదా కేప్స్ నేటి యువతరపు మదిని మరింత ఆత్మవిశ్వాసంగా మార్చేస్తుంది.

న్యూస్‌మేకర్

బామ్మ పవర్



53 ఏళ్ల వయసులో ఆమె జిమ్‌లో చేరింది ఫిట్‌నెస్ కోసం. పదేళ్లు తిరిగేసరికి 63 ఏళ్ల వయసులో పవర్ లిఫ్టింగ్ చాంపియన్ అయ్యింది. ఇటీవల మంగోలియాలో నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించింది. ఏ వయసులోనైనా ఆరోగ్యంగా... దృఢంగా శరీరాన్ని మలుచుకునేందుకు స్త్రీలు శ్రద్ధ పెడితే సాధ్యం కానిది లేదని కొచ్చికి చెందిన రీని తారకన్ సందేశం ఇస్తోంది.



మంగోలియా రాజధాని ఉలాన్ బటోర్‌లో ఇటీవల 'ఇంటర్‌నేషనల్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్' (ఐ.పి.ఎఫ్) చాంపియన్ షిప్స్ జరిగాయి. మన దేశం నుంచి 25 మంది పాల్గొంటే వారిలో 15 మంది స్త్రీలే. వారిలో కొచ్చిన్‌కు చెందిన రీని తారకన్ నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించింది. 63 ఏళ్ల వయసులో ఆమె ఇలా దేశం తరఫున పతకాలు గెలుస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. కాని అలా జరిగింది. అందుకు ఆమె చేసిన పరిశ్రమ, చూపిన శ్రద్ధే కారణం.

భారీ పోటీ
మంగోలియాలో జరిగిన ఐ.పి.ఎఫ్‌కు 44 దేశాల నుంచి 145 మంది పవర్‌లిఫ్టర్లు హాజరయ్యారు. వీరిని 40, 50, 60, 70 ఏళ్లుగా నాలుగు కేటగిరీల్లో విభజించి పోటీలు నిర్వహించారు. మళ్లీ ఈ కేటగిరీల్లో బరువును బట్టి పోటీదార్లు ఉంటారు. స్త్రీ, పరుషులు వేరువేరుగా పాల్గొంటారు. రీని తారకన్ అరవై ఏళ్ల కేటగిరిలో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించింది. డెడ్‌లిఫ్టింగ్‌లో 112.5 కిలోల బరువు ఎత్తగలిగింది. ప్రశంసలు అందుకుంది. 'ఈ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్‌లో నాకు బాగా నచ్చిన అంశం స్త్రీలు ఎక్కువగా పాల్గొనడం. మన దేశం నుంచి స్త్రీలే ఎక్కువ మంది ఉన్నాం. అంటే నేటికాలంలో స్త్రీలు తమ సామర్థ్యాలను ఏ వయసులోనైనా మెరుగు పరుచుకోవడానికి వెనుకాడటం లేదని తెలుసుకోవాలి' అంది రీని తారకన్.

బరువు తగ్గడానికి వెళ్లి
రీని తారకన్ కొచ్చిన్ శివార్లలోని తైకట్టుశ్శేరి అనే గ్రామంలో ఉంటుంది. భర్త ఆంటోని తారకన్ రైల్వేలో పని చేసి రిటైర్ అయ్యాడు. ఇద్దరు కుమార్తెల్లో ఒకరు అమెరికాలో స్థిరపడితే మరొకరు చెన్నైలో రెస్టరెంట్‌ను నడుపుతున్నారు. ఇంట్లో విశ్రాంతిగా ఉండటం వల్ల తాను బరువు పెరుగుతున్నానని రీని తారకన్‌కు అనిపించింది. దాంతో కొచ్చిన్ సిటీలోని వైట్టిలా ప్రాంతంలో ఒక జిమ్‌లో చేరింది. ఇంటినుంచి జిమ్ పాతిక కిలోమీటర్ల దూరమైనా బరువు తగ్గాలనే కోరికతో రోజూ వచ్చేది. భర్త ఆమెను తీసుకొచ్చి దిగబెట్టేవాడు. అయితే ఆ జిమ్‌లోని ట్రైనర్ ఆమెలో బరువులెత్తే సామర్థ్యం ఉందని ఆ దారిలో ప్రోత్సహించాడు. పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌గా మారొచ్చని చెప్పాడు. అందుకు తర్ఫీదు ఇస్తానన్నాడు. 2021 నుంచి ఆమెను పోటీలకు హాజరయ్యేలా చూస్తున్నాడు. అప్పటి నుంచి రీని మెడల్స్ సాధిస్తూనే ఉంది. 'పదేళ్ల క్రితం నాకు జిమ్ అంటేనే తెలియదు. కాని క్రమం తప్పకుండా జిమ్ చేస్తూ నా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఇప్పుడు పవర్‌లిఫ్టర్‌ని అయ్యాను. ఈ గుర్తింపు సంతృప్తినిస్తోంది' అంది రీని తారకన్.

సమర్థింపులు, సూటిపోట్లు
'నేను పవర్‌లిఫ్టర్ కావాలని ప్రయత్నించినప్పుడు నా కుటుంబం పూర్తి సహకారం ప్రకటించింది. నా పిల్లలు "ట్రై చెయ్యమ్మా" అన్నారు. కాని బంధువుల్లో కొందరు సూటిపోటి మాటలు అన్నారు. ఈ వయసులో ఇదంతా అవసరమా అని ప్రశ్నించారు. ప్రశ్నించేవారికి పని చేస్తూనే సమాధానం చెప్పాలనుకున్నాను. అప్పుడు అలా అన్నవాళ్లు ఇవాళ నన్ను చూసి ఆశ్చర్యపోతున్నారు. జిమ్ స్త్రీలకు చాలామంచిది. పవర్‌లిఫ్టింగ్ లాంటివి మన ఎముకలకు బలాన్నిస్తాయి. నేను నా బరువును అదుపులో ఉంచుకుని ఆరోగ్యంగా ఉంటున్నాను. వారంలో నాలుగు రోజులు జిమ్‌కు వచ్చి రెండు గంటలు వర్కవుట్ చేస్తాను. రెండు రోజులు ఇంట్లో వ్యాయామం చేస్తాను. ఒక రోజు విశ్రాంతి తీసుకుంటాను. వ్యాయామం ఉత్సాహాన్నిస్తుంది. తప్పక చేయండి' అంటోంది రీని తారకన్.

బ్యూటిప్స్

ముఖానికి ఫేస్ యోగా!

ఫేస్ యోగాతో మొటిమలు, మచ్చలు పోయి ముఖం మరింత కాంతిమంతంగా మెరిసిపోతుంది. ఫేస్ యోగా ఎలా చేయాలో చూద్దాం.



- ఉదయం నిద్ర లేచిన వెంటనే ఫేస్ యోగా చేయాలి.
- ముందుగా నిటారుగా కూర్చోవాలి. బుగ్గలను బూరా ఊదినట్టుగా ఊది రెండు వేళ్లతో నోటిని మూసేయాలి.
- బూరలాగా ఉబ్బిన బుగ్గలపై చేతితో కొట్టాలి. ఒక్కో బుగ్గను ముప్పై సెకన్ల పాటు కొట్టాలి.
- రెండు బుగ్గలను కొట్టడం పూర్తయిన తరువాత చల్లటి నీటితో ముఖాన్ని కడగాలి. ఇలా రోజూ చేయడం వల్ల ముఖం మెరుస్తుంది.

వంటిల్లు

అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి విందు ఏదైనా సరే... ఒకటీ, రెండు కాదు అన్నీ ఆరగించాలనిపించే ఘుమఘుమలతో వచ్చేసింది ఈ వారం వంటిల్లు...

ఫిష్ కేక్



కావలసినవి: శుభ్రం చేసిన చేప ముక్కలు – మూడు కప్పులు(చర్మం, ముల్లు తొలగించి చిన్న ముక్కలు చేయాలి); బ్రెడ్ ముక్కల పొడి – అరకప్పు; నూనె – టేబుల్ స్పూను; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – కప్పు; బంగాళ దుంపలు – రెండు; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; నిమ్మరసం – రెండు టేబుల్ స్పూన్లు; కొత్తిమీర తరుగు – అర కప్పు; పచ్చిమిర్చి – రెండు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● బంగాళదుంపలను ఉడికించి, తొక్కతీసి చిదుముకోవాలి ● చేప ముక్కలను గిన్నెలో వేసి, పచ్చిమిర్చిని తరిగి వేయాలి ● స్ప్రింగ్ ఆనియన్, కొత్తిమీర తరుగు, చిదుముకున్న బంగాళ దుంపల మిశ్రమం, ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం వేసి ముక్కలు పట్టేలా కలిపి అరగంట పక్కన పెట్టుకోవాలి ● అరగంట తరువాత మిశ్రమాన్ని టిక్కీల్లా తయారు చేసుకోవాలి ● బ్రెడ్ ముక్కల పొడిలో ఈ టిక్కీలను అద్దాలి ● ఇప్పుడు బేకింగ్ ట్రేకు నూనె రాసి, బ్రెడ్ ముక్కల పొడిలో అద్దిన ఫిష్ కేక్స్‌ను బేకింగ్ ట్రేలో పెట్టి అరగంటపాటు బేక్ చేస్తే ఎంతో రుచికరమైన ఫిష్ కేక్ రెడీ.

బ్రేక్‌ఫాస్ట్... లంచ్... డిన్నర్ కాసింత కొత్తగా..!

గ్రిల్డ్ మలై ప్రాన్ ర్యాప్స్



కావలసినవి: శుభ్రం చేసిన రొయ్యలు – ముప్పై ఆరు; చపాతీలు – నాలుగు; కసూరీ మేథి పొడి – ముప్పావు టీస్పూను; సోంపు పొడి – ముప్పావు టీస్పూను; ఉప్పు – రుచికి తగినంత; కారం – టీస్పూను; మిరియాల పొడి – రుచికి సరిపడా; అల్లం వెల్లుల్లి పేస్టు – ముప్పావు టేబుల్ స్పూను; మీగడ పెరుగు – ముప్పావు కప్పు; నిమ్మరసం – టేబుల్ స్పూను; నూనె – గ్రిల్ చేయడానికి సరిపడా; టొమాటో కెచప్ – నాలుగు టేబుల్ స్పూన్లు; ఆవ సాస్ – నాలుగు టేబుల్ స్పూన్లు; క్యాబేజీ తురుము – నాలుగు టేబుల్ స్పూన్లు; క్యారట్ తురుము – నాలుగు టేబుల స్పూన్లు; స్ప్రింగ్ ఆనియన్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ: ● ఒక గిన్నెలో కసూరీ మేథీ, సోంపు, మిరియాల పొడులు, కారం, పెరుగు, అల్లం వెల్లుల్లి పేస్టు, రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి ● ఇప్పుడు రొయ్యలు, నిమ్మరసం కూడా వేసి కలిపి అరగంటపాటు నానబెట్టుకోవాలి ● అరగంట తరువాత గ్రిల్ పాన్‌పై కొద్దిగా నూనె చల్లాలి. ఇది వేడెక్కిన తరువాత నానిన రొయ్యలను వేసి రెండువైపులా చక్కగా గ్రిల్ చేసుకోవాలి ● ఇప్పుడు ఒక్కో చపాతీని తీసుకుని ముందుగా టేబుల్ స్పూను టొమాటో కెచప్, తరువాత ఆవ కెచప్ రాయాలి ● కెచప్‌లపైన క్యాబేజీ, క్యారట్ తరుగు, స్ప్రింగ్ ఆనియన్స్ వేయాలి ● వీటన్నింటి పైన గ్రిల్ చేసిన రొయ్యలు వేసి చపాతీని విడిపోకుండా గట్టిగా రోల్‌లా చుట్టాలి ● గ్రిల్‌పైన కొద్దిగా నూనె వేసి రోల్ చేసిన చపాతీ ర్యాప్‌లను వేసి రెండు వైపులా కాల్చుకుని సర్వ్ చేసుకోవాలి.

లేసీ మటన్ కట్‌లెట్



కావలసినవి: మటన్ ఖీమా – రెండు కప్పులు; వైట్ బ్రెడ్ స్లైసులు – నాలుగు; వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను; అల్లం పేస్టు – అరటేబుల్ స్పూను; పచ్చిమిర్చి – మూడు; వేయించిన జీలకర్ర పొడి – టేబుల్ స్పూను; ధనియా పొడి – టేబుల్ స్పూను; కారం – రెండు టీస్పూన్లు; పసుపు – అరటీస్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; ఉప్పు – రుచికి సరిపడా; గుడ్లు – రెండు; నూనె – టేబుల్ స్పూను; బ్రెడ్ ముక్కల పొడి – కప్పు; నూనె – కట్‌లెట్ వేయించడానికి తగినంత; ఉల్లిపాయ, పలచగా... చక్రాల్లా తరిగిన నిమ్మకాయ ముక్కలు – గార్నిష్‌కు సరిపడా.

తయారీ: ● ఒక గిన్నెలో బ్రెడ్‌స్లైసులను వేసి, కొద్దిగా నీళ్లు చల్లుకుని మెత్తగా చిదుముకోవాలి ● ఈ చిదుములోనే మటన్ ఖీమా, అల్లం, వెల్లుల్లి పేస్టు, పచ్చిమిర్చిని తరిగి వేయాలి ● జీలకర్ర పొడి, కారం, పసుపు, ధనియాల పొడి, కొత్తిమీర, పుదీనా తరుగు, రుచికి సరిపడా ఉప్పువేసి చక్కగా కలుపుకోవాలి ● ఇప్పుడు బాణలిలో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి వేడెక్కనివ్వాలి ● గుడ్లసొనను గిన్నెలో వేసి, చిటికెడు ఉప్పు వేసి కలిపి పక్కనపెట్టుకోవాలి ● ఇప్పుడు ఖీమా మిశ్రమాన్ని ఉండలుగా చుట్టుకోవాలి ● ఉండలన్నీ తయారయ్యాక.. ఒక్కో ఉండను బ్రెడ్‌ముక్కల పొడిలో వేసి కట్‌లెట్‌లా వత్తుకోవాలి ● తర్వాత కట్‌లెట్‌ను గుడ్ల సొనలో ముంచి, కాగిన నూనెలో వేసి ఫ్రై చేయాలి ● రెండు వైపులా గోల్డెన్ కలర్, క్రిస్పీగా మారేంత వరకు సన్నని మంటమీద వేయించి తీస్తే లేసీ మటన్ కట్‌లెట్ రెడీ ● ఉల్లిపాయ, నిమ్మకాయ రింగు ముక్కలు, కొత్తిమీరతో గార్నిష్ చేసి సర్వ్‌చేసుకోవాలి.

ఇంటిప్స్









● గ్లాసు నీళ్లల్లో బిర్యానీ ఆకు, దాల్చిన చెక్కను ముక్కలుగా తుంచి వేయాలి. దీనిలో బోరిక్ యాసిడ్ రెండు టీ స్పూన్లు వేసి మూడు గంటలపాటు నానబెట్టాలి. తరువాత ఈ నీటిని సింక్‌లో పోస్తే బొద్దింకలు రావు.

● నిమ్మకాయలను శుభ్రంగా కడిగి తుడవాలి. వీటికి కొద్దిగా నూనె రాసి టిష్యూ పేపర్ వేసిన బాక్స్‌లో పెట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.

● గ్లాసు నీళ్లలో కొద్దిగా వెనిగర్ వేసి టూత్‌బ్రష్‌లను నానబెట్టాలి. అరగంట తరువాత గోరువెచ్చని నీటితో కడిగితే టూత్ బ్రష్‌లు శుభ్రపడతాయి.

● నిమ్మకాయ ముక్కలు, పుదీనా ఆకులు, వెనిగర్‌ను సమపాళ్లల్లో తీసుకుని ఐస్‌క్యూబ్ ట్రేలో పోసి రాత్రంతా రిఫ్రిజిరేటర్ లో పెట్టాలి. ఉదయం ఈ ఐస్ క్యూబ్‌ను తీసి దుర్వాసన వస్తోన్న సింక్‌లో వేస్తే దుర్వాసన తొలగిపోతుంది.

● టొమాటో చుట్టూ గాటు పెట్టి మరుగుతున్న నీటిలో వేయాలి. నిమిషం తరువాత తీసేసి ఐస్‌వాటర్‌లో వేయాలి. తరువాత టొమాటోను పట్టుకుని లాగితే తొక్క సులభంగా వచ్చేస్తుంది.

భుర్జి మఫిన్స్



కావలసినవి: గుడ్లు – నాలుగు; ఉల్లిపాయ – ఒకటి; బంగాళదుంప – ఒకటి; పచ్చిమిర్చి – రెండు; మిరియాల పొడి – టీస్పూను; పసుపు – పావు టీస్పూను; కారం – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; చీజ్ తరుగు – రెండు టేబుల్ స్పూన్లు; టొమాటో – ఒకటి.

తయారీ: ● ఉల్లి, పచ్చిమిర్చి, టొమాటోలను సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి ● బంగాళదుంపను ఉడికించి, తొక్కతీసి చిన్న ముక్కలుగా తరగాలి ● గుడ్లను పగులగొట్టి సొనను గిన్నెలో వేయాలి ● ఈ సొనలో బంగాళదుంప ముక్కలు, మిర్చి, ఉల్లి ముక్కలు వేయాలి ● మిరియాలపొడి, పసుపు, కారం, చీజ్, కొత్తిమీర తరుగులు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపాలి ● ఈ మిశ్రమాన్ని సిలికాన్ మౌల్డ్స్‌లో పోసి పైన టొమాటో ముక్కలతో గార్నిష్ చేయాలి ● ఈ మౌల్డ్స్‌ను అవెన్‌లో పెట్టి ఇరవై నిమిషాలు బేక్ చేస్తే భుర్జి మఫిన్స్ రెడీ ● ఇవి చల్లారిన తరువాత బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌బాక్స్‌లో పెట్టుకోవచ్చు.

చికెన్ ఆమ్లెట్



కావలసినవి: గుడ్లు – మూడు; ఉడికించి తురిమిన చికెన్ – కప్పు (కూరలో మిగిలిపోయిన చికెన్ ముక్కలను వాడుకోవచ్చు); ఉల్లిపాయ – ఒకటి; కరివేపాకు –ఒక రెమ్మ; ఉప్పు – రుచికి సరిపడా; మిరియాల పొడి – రెండు టీస్పూన్లు; కొత్తిమీర తరుగు – పావు కప్పు; నూనె – ఆమ్లెట్ వేగడానికి సరిపడా.

తయారీ: ● ఉల్లిపాయను సన్నగా తరిగి ఒక గిన్నెలో వేయాలి ● ఇదే గిన్నెలో కరివేపాకు, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు, గుడ్లసొన, చికెన్ తరుగు వేయాలి ● చివరిగా రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలిపి పావుగంట పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు వేడెక్కిన పెనంపై కొద్దిగా నూనె వేసి ఆమ్లెట్ మిశ్రమాన్ని పోయాలి ● రెండువైపులా చక్కగా కాల్చుకుంటే చికెన్ ఆమ్లెట్ రెడీ.


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 216

శుక్రవారం 27-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇంగ్లండ్ మళ్లీ బోల్తా

శ్రీలంక చేతిలో 8 వికెట్లతో ఓడిన డిఫెండింగ్ చాంపియన్. - 13లో



ఆరో రోజూ 'బేర్ కల్లోలం'

64 వేల దిగువకు సెన్సెక్స్.. 4 నెలల కనిష్టానికి సూచీలు. - 13లో

నా వంతు చేశా.. ఇక మీదే బాధ్యత



మునుగోడులో జరిగిన ప్రజా ఆశీర్వాదసభకు హాజరైన ప్రజలు

రాదనుకున్న తెలంగాణను తెచ్చి, పేదలను కాపాడుకున్నా

బహురూపుల వేషాల్లో వచ్చే వారిని నమ్మి ఆగం కావొద్దు

అచ్చంపేట, వనపర్తి, మునుగోడు ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



అచ్చంపేట సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

- దండం పెట్టి చెబుతున్నా.. ఆగమైతే పాములా మింగుతరు
- కాంగ్రెస్‌కు ప్రజల బాగోగులు కాదు.. తెలంగాణపై పెత్తనం కావాలి
- పైరవీకారుల పార్టీ కాంగ్రెస్.. వాళ్లు వస్తే కరెంటు కోతలు, వలసల బతుకులే..
- మేం ఓట్ల కోసం తప్పుడు హామీలు ఇవ్వట్లేదు.. క్రమపద్ధతిలో అమలు చేసేలా బీఆర్ఎస్ మేనిఫెస్టో రూపొందించాం
- కొందరు కేసీఆర్‌కు దమ్ముందా అని సవాల్ చేస్తున్నారు.. నా దమ్మేంటో దేశమంతా ఇప్పటికే చూసింది
- డబ్బు, అహంకారంతో ప్రజలను కొందామని చూస్తున్నారు
- పూటకో పార్టీ మార్చే వారికి బుద్ధి చెప్పాలని పిలుపు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్/ సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో పేదలతో పాటు అన్ని వర్గాలను కాపాడుకునేందుకు తన వంతు పనిచేశానని.. ఇప్పుడు ప్రజలే పోరాటం చేయాలని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. గత పదేళ్లలో చోటుచేసుకున్న మార్పును గుర్తించి, ఆలోచించాలని సూచించారు. ఎన్నికల కోసం బహురూపుల వేషాలతో వచ్చే వాళ్లను నమ్మి ఆగమైతే వైకుంఠపాళిలో పాములా మింగేస్తారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు కోతలు, వలసల బతుకులే మిగులుతాయని.. రైతులు గోసపడతారని పేర్కొన్నారు. తాము ఓట్ల కోసం తప్పుడు హామీలు ఇవ్వబోమని, సాధ్యాసాధ్యాలపై ఆలోచించి క్రమపద్ధతిలో అమలు చేసేలా బీఆర్ఎస్ మేనిఫెస్టో రూపొందించామని చెప్పారు. పూటకో పార్టీ మార్చుతూ, డబ్బు మదం, అహంకారంతో వచ్చేవారిని ఓడించాలని పిలుపునిచ్చారు. గురువారం ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలోని అచ్చంపేట, వనపర్తి, నల్లగొండ జిల్లా మునుగోడులలో నిర్వహించిన బీఆర్ఎస్

మిగతా 2వ పేజీలో ▶

జంగ్ తెలంగాణ

సామాన్యుడి సమయం 'సోదా'హరణం

గనులు తెచ్చి ఉపాధినిచ్చే ఘనులెవరో?

- వివరాలు 7, 8లో

యువర్స్

● సక్సెస్ స్టోరీ



ఆసక్తే అతడి శక్తి

తెలుసుకోవాలనే ఆసక్తి ఆ తరువాత శక్తిగా మారుతుంది. శక్తిమంతులు ఊరకే ఉంటారా! కొత్త ద్వారాలు తెరుస్తారు. గర్వ పడేలా ఘన విజయాలు సాధిస్తారు. ఢిల్లీకి చెందిన జే కపూర్ టెక్నో యూనివర్శిటీలలో చదువుకోలేదు. 'ఎందుకు? ఏమిటి? ఎలా?' అంటూ గ్యాడ్జెట్‌ల పుట్టుపూర్వోత్తరాల గురించి ఆసక్తి చూపించేవాడు. ఆ ఆసక్తి అంతులేని శక్తిని ఇచ్చింది. 'డిజిటల్ స్టార్' హోదాలో హుందాగా కూర్చోబెట్టింది. తాజాగా... ఫోర్బ్స్ ఇండియా 'టాప్ డిజిటల్ స్టార్స్' జాబితాలో చోటు సంపాదించాడు జే కపూర్...

మొబైల్, ల్యాప్‌టాప్, కంప్యూటర్‌లకు సంబంధించి సాంకేతిక సమస్య తలెత్తితే జే కపూర్‌ను వెదుక్కుంటూ వచ్చే వాళ్లు ఫ్రెండ్స్. నిమిషాల వ్యవధిలోనే వాళ్లు పట్టుకొచ్చిన సమస్యకు పరిష్కారం చూపేవాడు కపూర్. కొంతకాలం తరువాత సుపరిచితులే కాదు అపరిచితులు కూడా కపూర్‌ను వెదుక్కుంటూ రావడం మొదలైంది. ఈ నేపథ్యంలోనే 'తరచుగా ఎదురయ్యే కొన్ని సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు' పేరుతో ఒక వీడియో చేసి యూట్యూబ్‌లో పెట్టాడు.

అలా డిజిటల్ ప్రపంచంలో తొలి అడుగు వేశాడు.

2011లో తన పేరుతోనే యూట్యూబ్ చానల్ ప్రారంభించాడు. అయితే చాలా మంది యూట్యూబర్‌లకు ఎదురైనట్లే ఖరీదైన కెమెరా ఎక్విప్‌మెంట్స్ కొనడానికి ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి. అయినా సరే వెనక్కి తగ్గలేదు. ఎలాగో కష్టపడి తనకు కావాల్సిన సాంకేతిక పరికరాలు సమకూర్చుకున్నాడు.

లేటెస్ట్ టిప్స్, ట్రిక్స్, ట్యుటోరియల్స్, ట్రెండింగ్ టాపిక్స్‌తో తన యూట్యూబ్ చానల్ దూసుకుపోయింది.

సక్సెస్‌కు 'ఐడియా అండ్ రిసెర్చ్' ముఖ్యమైనవి అంటాడు కపూర్. ట్విట్టర్ నుంచి దినపత్రికలలో వచ్చే ఆర్టికల్స్ వరకు ఎక్కడో ఒక చోట తనకు ఐడియా దొరుకుతుంది. ఆ తరువాత అన్ని కోణాల్లో దాని మీద రిసెర్చి మొదలుపెడతాడు.

'కొన్నిసార్లు మూడు గంటల్లో చేసిన వీడియోలకు లక్షలాది వ్యూస్ వస్తాయి. కొన్నిసార్లు రోజుల తరబడి చేసిన వీడియోలు ఫ్లాప్ అవుతుంటాయి' నవ్వుతూ అంటాడు కపూర్.

19 సంవత్సరాల వయసులోనే మన దేశంలోని 'టాప్ 6 టెక్ యూట్యూబర్స్'లో ఒకరిగా నిలిచిన జే కపూర్ ఆండ్రాయిడ్ డెవలపర్ కూడా. 'ఫ్లాష్ సేల్ హెల్పర్' అతడి తొలి యాప్. ఆ తరువాత స్మార్ట్‌ఫోన్ యూజర్‌లకు ఉపయోగపడే 'వోల్ట్ చెకర్' యాప్ క్రియేట్ చేశాడు.

'విజయం సాధించాలనే దృష్టితో పెద్ద వాళ్ళ ఇంటర్వ్యూలు అదేపనిగా చదవడం నుంచి కాన్ఫరెన్స్‌లకు హాజరు కావడం వరకు ఎన్నో చేస్తుంటాం. అయితే మన జయాపజయాలను నిర్ణయించేది మాత్రం మన కష్టమే' అంటాడు జే కపూర్.

టెక్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా సుపరిచితుడైన కపూర్ 'మనీ మిసెక్స్' పేరుతో చేసే వీడియోలతో ఫైనాన్స్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా కూడా మంచి మార్కులు కొట్టేశాడు.



కష్టం కనిపిస్తేనే విజయం కనిపిస్తుంది

స్ఫూర్తి అనేది ఎక్కడి నుంచి, ఎవరి నుంచి అయినా తీసుకోవచ్చు. స్ఫూర్తి తీసుకోవడానికి పెద్దగా కష్టం అక్కర్లేదు. అయితే ఆ స్ఫూర్తిని మన విజయంగా మలుచుకోవడానికి మాత్రం బాగా కష్టపడాలి. కష్టం కనబడని చోట విజయం కూడా కనిపించదు.

– జే కపూర్

● టెక్.. టాక్



కిండిల్ వోయాసిస్ ఈ-బుక్ రీడర్

- స్టైల్ నేమ్: షాంపైన్ గోల్డ్
- వాటర్ ప్రూఫ్ ● 32 జీబి స్టోరేజ్
- ప్రైమ్ మెంబర్స్ ఉచితంగా ఎన్నో పుస్తకాలు చదువుకోవచ్చు.
- కొత్త రిలీజ్‌లతో ఇన్‌స్టంట్ యాక్సెస్ కావచ్చు.

లాంగ్ పీడీఎఫ్‌లను క్లాడ్ ఏఐతో క్విక్‌గా సమరైజ్ చేయడానికి...

1. క్లాడ్ ఏఐలో ఇమెయిల్ అడ్రస్ ఎంటర్ చేయాలి
2. వెరిఫికేషన్ కోడ్‌ను ఎంటర్ చేయాలి.
3. పేరు ఎంటర్ చేయాలి 4. యూజ్ అండ్ ప్రైవసీ పాలసీ అంగీకరించిన తరువాత...ఫోన్ నెంబర్ మరో వెరిఫికేషన్ కోడ్ ఎంటర్ చేయాలి
5. ఫైల్ అప్‌లోడ్ చేయడానికి చాట్‌బాక్స్‌కు కుడివైపున ఉన్న పేపర్ క్లిక్ ఐకాన్‌ను నొక్కాలి 6. అప్‌లోడ్ చేయదల్చుకున్న ఫైల్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
7. 'సమరైజ్ పీడీఎఫ్' అని టైప్ చేసి ఎంటర్ నొక్కాలి. సెర్చ్‌బార్ పైన ఉన్న ఏరోప్లేన్ ఐకాన్‌ను కూడా నొక్కవచ్చు.



వన్ ప్లస్ ఓపెన్



డిస్‌ప్లే: 7.82 అంగుళాలు
రిజల్యూషన్: 2,440×2,268 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 4,800 ఎంఏహెచ్; కనెక్టివిటీ: 5జీ

గూగుల్ పిక్సెల్ 8



డిస్‌ప్లే: 6.20 అంగుళాలు; వోఎస్: ఆండ్రాయిడ్ 14; మెమోరీ: 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్;
బ్యాటరీ: 4,575 ఎంఏహెచ్

● అవును... ఇది నిజమే!

- టోలెడో మ్యూజియం ఆఫ్ ఆర్ట్ గ్యాలరీ(యూఎస్)లో కనిపించే ఇండోర్ రెయిన్‌బో ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణ. ఇది సహజమైనది కాదు. వేలాది కలర్ థ్రెడ్స్‌తో సృష్టించారు.
- మెయిల్ అడ్రస్ ఉన్న ప్రపంచంలోని ఏకైక చెట్టు జర్మనీలో ఉంది. వైటిన్ పట్టణానికి సమీపంలో ఉన్న అడవిలోని బ్రైడ్‌గ్రూమ్ ఓక్‌కు ప్రతి సంవత్సరం వెయ్యి ఉత్తరాలు వస్తాయి. ఈ ఉత్తరాలను ఎవరైనా తీసుకొని బదులు ఇవ్వవచ్చు.



● ఇంగ్లిష్ ఇడియమ్స్

డ్రెస్‌డ్ అప్ టు ది నైన్స్

ఉత్సవాలు, వేడుకలు... మొదలైన ప్రత్యేక సందర్భాలలో స్మార్ట్, ఫ్యాషనబుల్‌గా కనిపించే దుస్తులను ధరించినప్పుడు ఉపయోగించే మాట...డ్రెస్‌డ్ అప్ టు ది నైన్స్.

ఉదా: ఎవ్రీవన్ వాజ్ డ్రెస్‌డ్ అప్ టు ది నైన్స్ ఫర్ ది అకాడమీ అవార్డ్స్

ఆఫ్ ది కఫ్

ప్రిపరేషన్ లేకుండా ఒక పని చేయడం, ఉపన్యాసం ఇవ్వడం... మొదలైన సందర్భాలలో ఉపయోగించే మాట... ఆఫ్ ది కఫ్

ఉదా: ఐ హ్యాడ్ నాట్ ప్రిపేర్‌డ్ ఏ స్పీచ్ సో ఐ జస్ట్ సెడ్ ఏ ఫ్యూ వర్డ్స్ ఆఫ్ ది కఫ్

● గేమింగ్



దూసుకుపోవాల్సిందే!

యాక్షన్ వీడియో గేమ్ 'ఘోస్ట్ రన్నర్-2' విడుదలైంది. 2020లో వచ్చిన 'ఘోస్ట్ రన్నర్'కు సీక్వెల్‌గా వచ్చిన గేమ్ ఇది. ఫస్ట్-పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే ఈ గేమ్‌లో జాక్ అనే ప్లేబుల్ క్యారెక్టర్ చురుకుదనానికి మరో పేరు. డాషింగ్, జంపింగ్, వాల్-రన్నింగ్...మొదలైన వాటిలో అతడికి ఎదురులేదు.

'గ్రాప్లింగ్ హుక్' 'సెన్సరీబూస్ట్' అతడి ఆయుధాలు. వెహిక్యులర్ కంబాట్, స్టమిన మీటర్‌లను ఈ గేమ్‌లో కొత్తగా చూడవచ్చు. కొత్త ప్లేయర్స్‌ను కూడా ఆకట్టుకునే అంశాలను ఈ గేమ్‌లోకి తీసుకువచ్చారు. గేమ్ ఫాస్ట్ మూమెంట్ సిస్టమ్‌తో స్ట్రగుల్ అయ్యే ప్లేయర్స్ కోసం 'యాక్టివ్ బ్లాకింగ్ మెకానిక్'ను తీసుకువచ్చారు.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5/ విండోస్/ ఎక్స్ బాక్స్ సిరిస్ ఎక్స్/ఎస్
మోడ్స్: సింగిల్-ప్లేయర్
జానర్స్: యాక్షన్

● మ్యూజిక్ వరల్డ్

మెలోడి మెరుపు

బెంగళూరుకు చెందిన సింగర్, సాంగ్ రైటర్ ఫ్రిజెల్ డిసోజా. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో రకరకాల పాటల గురించి పోస్ట్‌లు, వీడియోలు పెట్టడం ద్వారా ఇండియన్ ఇండీ మ్యూజిక్ ప్రపంచంలోకి వచ్చింది.

లాక్‌డౌన్ కాలంలో ఫ్రెండ్‌తో మాట్లాడుతున్నప్పుడు 'సమ్‌థింగ్ న్యూ' పాట ఐడియా వచ్చింది. ఈ డెబ్యూ సాంగ్ ద్వారా డిసోజా మెలోడియస్ వాయిస్‌కు మంచి పేరు వచ్చింది.

సోషల్ మీడియాలో కనిపించి, వినిపించే డిసోజా లైవ్ ప్రోగ్రామ్స్‌లో కూడా పాల్గొంది. ఫస్ట్ టూర్‌లో వచ్చిన పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ ఆమెకు ఎంతో బలాన్ని ఇచ్చింది. ఇక రచన విషయానికి వస్తే...లవ్, హార్ట్‌బ్రేక్‌కు సంబంధించిన అంశాలపై పాటలు రాయడం డిసోజాకు ఇష్టం.

'వ్యక్తిగత అనుభవాల నుంచి చూసిన, విన్న విషయాల ఆధారంగా పాటలు రాయడం నాకు సులభం' అంటుంది.

మొదట్లో తన పాటల్లో ఎలక్ట్రిక్ గిటార్, డ్రమ్‌ల శబ్దం లిరిక్స్‌ను డామినేట్ చేసేది. ఇప్పుడు మాత్రం లిరిక్స్ కూడా స్పష్టంగా వినబడే ఈజీ-టు-లిజెన్ వైబ్‌కు ప్రాధాన్యత ఇస్తోంది. ఆర్కిటెక్చర్‌లో గ్రాడ్యుయేట్ అయిన డిసోజా ఫుల్-టైమ్ మ్యూజిషియన్‌గా ఉండడమే తనకు ఇష్టం అంటుంది.


ఫ్రిజెల్ డిసోజా

సినిమా

హిట్ కాంబినేషన్ రిపీట్


● సూర్య


● సుధా కొంగర

'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా!') వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధా కొంగర కాంబినేషన్‌లో తెరకెక్కనున్న కొత్త సినిమా ప్రకటన గురువారం వెల్లడైంది. సూర్య కెరీర్‌లో 43వ సినిమాగా తెరకెక్కనున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, నటి నజ్రియా ఫాహద్, నటుడు విజయ్ వర్మ కీలక పాత్రల్లో నటించనున్నారు. 2డీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై జ్యోతిక, సూర్య, రాజశేఖర్, కర్పూర సుందరపాండియన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనుంది. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ స్వరకర్త. అతనికి సంగీత దర్శకుడిగా ఇది నూరవ చిత్రం కావడం విశేషం. ఇదిలా ఉంటే.. 68వ జాతీయ అవార్డ్స్‌లో ఉత్తమ నటుడు, ఉత్తమ నేపథ్య సంగీతం, ఉత్తమ నటి, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ చిత్రం విభాగాల్లో 'సూరరై పోట్రు' సినిమా అవార్డులు సాధించింది. తాజా చిత్రంతో సూర్య-సుధల హిట్ కాంబో రిపీట్ అవుతోంది.

కొత్త క్యారెక్టర్‌కి క్లాప్


● ఇందూజ రవిచంద్రన్, సెల్వ రాఘవన్, రవితేజ, వీవీ వినాయక్

హీరో రవితేజ కెరీర్‌లో కొత్త చిత్రం ప్రారంభమైంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి అన్మోల్ శర్మ కెమెరా స్విచాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు కె. రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ మేకర్స్‌కు స్క్రిప్ట్‌ను అందించారు. ''ఒక పవర్‌ఫుల్ కథాంశంతో రూపొందించనున్న ఈ చిత్రంలో ఇప్పటివరకూ చూడని ఒక కొత్త పాత్రలో ప్రేక్షకులు రవితేజను చూస్తారు'' అని యూనిట్ పేర్కొంది. సెల్వ రాఘవన్, ఇందూజ రవిచంద్రన్ కీ రోల్స్ చేయనున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: జీకే విష్ణు.

పెళ్లికి ఎస్

హీరోయిన్ అమలా పాల్ తన జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈవెంట్ మేనేజర్ జగత్ దేశాయ్‌ను పెళ్లాడనున్నారు అమలా పాల్. గురువారం (అక్టోబరు 26) ఆమె బర్త్ డే. ఈ సందర్భంగా అమలా పాల్‌కు తాను ప్రపోజ్ చేసిన వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ''నా కలల రాణి నాకు 'ఎస్' చెప్పింది. వెడ్డింగ్ బెల్స్, హ్యాపీ బర్త్ డే మై లవ్' అని పేర్కొన్నారు జగత్ దేశాయ్. సో.. జగత్ దేశాయ్, అమలా పాల్ ఒకింటివారు కానున్నారని స్పష్టమవుతోంది. ఇక 2014లో తమిళ దర్శక-నిర్మాత ఏఎల్ విజయ్‌తో అమలా పాల్ వివాహం జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే ఈ ఇద్దరూ 2017లో విడాకులు తీసుకున్నారు.


● అమలాపాల్, జగత్ దేశాయ్


● నితిన్

నితిన్, శ్రీ లీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మేన్'. సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 8న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు వెల్లడించి, కొత్త పోస్టర్స్‌ను విడుదల చేశారు మేకర్స్.

భావోద్వేగ దీపావళి

తాతా-మనవడి అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'కీడా'. పూ రాము, కాళీ వెంకట్ ముఖ్య తారలుగా దీపన్, పాండియమ్మ, విజయ, కమలి కీలక పాత్రల్లో నటించారు. 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన ఈ తమిళ చిత్రం తెలుగులో 'దీపావళి'గా రిలీజ్ కానుంది. పలు జాతీయ, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రశంసలు అందుకుంది. తెలుగు, తమిళ భాషల్లో నవంబరు 11న రిలీజ్ కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్ షేర్ చేశారు. దీపావళి పండక్కి మనవడికి కొత్త డ్రెస్ కొనాలని ఓ మేకను అమ్మకానికి పెడతాడు తాత. కానీ అది మొక్కుబడి మేక కావడంతో ఊర్లో ఎవరూ కొనరు. చివరికి మటన్‌షాప్ పెట్టుకోవాలనుకునే వీరబాబు కొంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అన్నదే ఈ చిత్రం ప్రధానాంశం. మేక పాత్ర అబ్బులుకు నటుడు సప్తగిరి వాయిస్ ఓవర్ ఇచ్చారు. ''ఈ చిత్రంలో తాత-మనవడు-మేక మధ్య అనుబంధం, వారి భావోద్వేగాలు ప్రేక్షకుల హృదయాలను కదిలిస్తాయి'' అని యూనిట్ పేర్కొంది.


● పూ రాము

అడవి అందంగా ఉంటుంది

– రామ్‌గోపాల్ వర్మ


● రామ్‌గోపాల్ వర్మ, అప్సరా రాణి, శ్రీధర్ రెడ్డి, నగేశ్ నారదాసి

అప్సరా రాణి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో స్వప్నా శ్రీధర్ రెడ్డి సమర్పణలో దేవర శ్రీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నవంబరు రెండో వారంలో విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు దర్శక-నిర్మాత రామ్‌గోపాల్ వర్మ, నటుడు శివాజీ రాజా, నిర్మాత రామారావు అతిథులుగా హాజరై పాటలు, ట్రైలర్‌ను విడుదల చేశారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''నాకు అందమంటే చాలా ఇష్టం. అడవి కూడా చాలా అందంగా ఉంటుంది. అందమైన అడవిలో అప్సరా రాణి డ్యాన్స్, ఫైట్లు చేస్తుంటే చూడటానికి అద్భుతంగా ఉంటుంది. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''నటనకు స్కోప్ ఉన్న 'తలకోన'లాంటి సినిమా చేయడం నా అదృష్టం'' అన్నారు అప్సరా రాణి. ''ప్రకృతిలో ఏం జరుగుతుందో ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేశాం'' అన్నారు నగేశ్. ''చాలా రిస్క్ చేసి, ఈ సినిమా చిత్రీకరణను పూర్తి చేశాం'' అన్నారు దేవర శ్రీధర్ రెడ్డి.

మెలోడీ మోగెనా...

''ఉన్నట్టుండి మదిలోన ఏదో మెలోడీ మోగెనా..' అంటూ మొదలయ్యే 'ప్లాంట్ మ్యాన్' చిత్రంలోని 'కన్నమ్మ' పాట లిరికల్ వీడియో విడుదలైంది. పన్నా రాయల్ నిర్మించిన చిత్రం ఇది. ఆనంద బాలాజీ స్వరపరచిన ఈ పాటకు ఈశ్వర్ హేమ కాంత్ సాహిత్యం అందించగా, రోహిత్ శ్రీనివాసన్, కుమార వాగ్దేవి పాడారు. పన్నా రాయల్ దర్శకత్వ పర్యవేక్షణలో సంతోషి బాబు తెరకెక్కించిన ఈ చిత్రంలో చంద్రశేఖర్, సోనాలి పాణిగ్రాహి, అశోక్ వర్ధన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది.


● సోనాలి

ప్రయోగాత్మక ప్లాట్


● భాను భవతారక, వేణు ఊడుగుల, గాయత్రి, వికాస్

వికాస్ ముప్పాల, గాయత్రీ గుప్తా, సాజ్వి పసల, సంతోష్ నందివాడ, కిశోర్ ప్రధాన పాత్రధారులుగా భాను భవతారక దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్లాట్'. కార్తీక్ సేపురు, తరుణ్ విఘ్నేశ్వర్ సేరుపు, భాను భవ తారక ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి అతిథిగా హాజరై, ట్రైలర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ– ''ట్రైలర్ చూస్తే కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లినట్టుగా అనిపిస్తోంది. ఇదొక ప్రయోగాత్మక చిత్రం. దర్శక-నిర్మాతలు ఈ తరహా సినిమాలను తీయాలంటే ప్రేక్షకులు ఇలాంటి చిత్రాలను ప్రోత్సహించాలి'' అన్నారు. ''నా కెరీర్‌కు ఈ సినిమా టర్నింగ్ పాయింట్ అవుతుందనుకుంటున్నాను'' అన్నారు వికాస్ ముప్పల. ''ఈ సినిమాను చూసి ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు'' అన్నారు భాను భవతారక, తరుణ్ విఘ్నేశ్వర్.

అమ్మాయిల అంతరాత్మ



● మనోజ్, రాంభూపాల్ రెడ్డి, అలీ, నాగ రాజశేఖర్, సురేందర్

ఎలీనా, లాస్య స్మైలీ, తన్వీ, శశిరేఖ ముఖ్య తారలుగా, జయక్రిష్, సమీర్, అర్జున్, మల్లిక్ బాబు కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అంతరాత్మ'. ఎమ్. నాగ రాజశేఖర్ రెడ్డి దర్శకత్వంలో తుమ్మల మనోజ్ యాదవ్, రావూరు సురేందర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. తొలి సన్నివేశానికి ఏసీపీ బాలకృష్ణా రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి క్లాప్ ఇచ్చారు. నటుడు అలీ స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''నలుగురు అమ్మాయిల మధ్య సాగే సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేస్తాం'' అన్నారు నాగ రాజశేఖర్. ఐఏఎస్ ఆఫీసర్ మురళీ మోహన్ ఓ అతిథిగా పాల్గొన్న ఈ చిత్రానికి సంగీతం: జీఎమ్ సతీష్, కెమెరా: నాగరాజు.

యాక్షన్.. థ్రిల్

రజత్ రాఘవ్, ఐశ్వర్యా రాజ్ బకుని జంటగా రాజు గుడిగుంట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషల్ థ్రిల్లర్ అండ్ ఫ్యాంటసీ యాక్షన్ ఫిల్మ్ 'మహర్ యోధ్ 1818'. సువర్ణ రాజు దాసరి నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ గురువారం హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో మొదలైంది. భద్రకాళీ పీఠం పీఠాధీశ్వరి డా. సింధు మాతాజీ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీయస్‌సీ సెల్ కమీషనర్ విక్టర్ ప్రసాద్ క్లాప్ కొట్టారు. దర్శకుడు నక్కిన త్రినాథ రావు గౌరవ దర్శకత్వం వహించారు. ''చక్కని కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. అన్ని వర్గాలవారికీ నచ్చే విధంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.


● రజత్, ఐశ్వర్యా రాజ్


'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 216

శుక్రవారం 27-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

- ఏపీలో జగన్నినాదాల మధ్య 'సామాజిక సాధికార యాత్ర'కు శ్రీకారం
- ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమలలో ఘనంగా ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర
- తొలి రోజు యాత్రకు వేలాదిగా తరలి వచ్చిన పేదలు.. సీఎం జగన్‌కు జేజేలు

-12లో



గెహ్లోత్ కుమారుడికి ఈడీ సమన్లు

విదేశీ కరెన్సీ నిబంధనల ఉల్లంఘన కేసులో రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్ కుమారుడు వైభవ్‌కు ఈడీ సమన్లు జారీచేసింది.

- వివరాలు 8లో



బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ను ఎండగట్టండి

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల తీరును బలంగా ఎండగట్టాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేశారు.

- వివరాలు 5లో



నేను పార్టీ మారడం లేదు: అరుణ

తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు బీజేపీ నాయకురాలు డీకే అరుణ స్పష్టం చేశారు.

- వివరాలు 5లో



గాజాపై భూతల దాడులు

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం మలుపు తీసుకుంది. ఇజ్రాయెల్ సైన్యం ఉత్తర గాజాపై భూతల దాడులు ప్రారంభించింది.

- వివరాలు 6లో



అమెరికాలో నరమేధం..

18 మందిని కాల్చి చంపిన ఉన్మాది

హంతకుడు సైనికుడు, మానసిక రోగి!

పట్టుకునేందుకు పోలీసుల ముమ్మర వేట

- అమెరికాలో మళ్లీ తుపాకీ పేలింది. మానసిక స్థితి సరిగా లేదని భావిస్తున్న ఓ సైనికుడు ఆడుకుంటున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం పారిపోతూ దార్లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌పైనా కాల్పులకు పాల్పడ్డాడు. ఈ దారుణాల్లో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. కనీసం 13 మందికిపైగా గాయపడ్డారు. మైనే రాష్ట్రంలోని లెవిస్టన్‌లో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి వేళ ఈ ఘోరం జరిగింది. కాల్పులకు పాల్పడిన హంతకున్ని రాబర్ట్ కార్డ్‌గా ప్రాథమికంగా గుర్తించారు. కొంతకాలంగా అతను మాన సిక సమస్యలతో కూడా బాధ పడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

- వివరాలు 6లో

కేసీఆర్ రైతుబంధు తీసుకుంటున్నారు

గజ్వేల్ 'విజయ శంఖారావం' సభలో ఈటల

బీజేపీ అధికారంలోకొస్తే ధనికులకు రైతుబంధు రద్దు

ధర్మయుద్ధం చేస్తా.. ఆశీర్వదించండి

గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఆయనకున్న 150 ఎకరాలకు రైతుబంధు కింద ఏటా రూ.15 లక్షలు తీసుకుంటున్నారని బీజేపీ నేత, గజ్వేల్ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ధనికులకు, ఐటీ కట్టేవారికి రైతుబంధు రద్దు చేస్తామని ప్రకటించారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో 'విజయ శంఖారావం' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు పక్కన 5,800 ఎకరాల పేదల భూములను లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం



సభలో ప్రసంగిస్తున్న ఈటల రాజేందర్

చేస్తున్నారని ఆరోపించారు. తాను ఆర్థిక మంత్రిగా పనిచేసిన కాలంలో మద్యంపై వచ్చే ఆదాయం రూ.10 వేల కోట్లు ఉండగా.. ఇప్పుడు దాన్ని రూ.45 వేల కోట్లకు పైగా పెంచడం ద్వారా రాష్ట్రాన్ని మద్యం సేవించడంలో నంబర్ వన్‌గా మార్చారని

మిగతా 12వ పేజీలో ▶

మంచినీళ్లు, కరెంటూ ఆపమంటారేమో?

కాంగ్రెస్ పార్టీ తీరుపై మంత్రి కేటీఆర్ ధ్వజం

- రైతుబంధు పథకాన్ని ఆపాలని ఈసీని కోరడంపై మండిపాటు
- కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కోడ్ పేరిట తెలంగాణ ప్రభుత్వం ఇంటింటికీ అందిస్తున్న మంచినీళ్లు, 24 గంటల కరెంటును కూడా ఆపేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటోందా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె. తారక రామారావు ప్రశ్నించారు. అన్ని సంక్షేమ పథకాల్లోనూ ప్రజలకు కేసీఆర్ కనిపిస్తారని, ఆ పథకాలన్నీ నిలుపుదల చేయాలని కాంగ్రెస్ కోరుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతులను దగా చేసేలా రైతుబంధు పథకాన్ని ఆపాలని ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదును ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ నాయకులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక వైఖరిని ఎండగట్టేలా గ్రామ స్థాయి నుంచి

మిగతా 12వ పేజీలో ▶

సంక్షేమ పథకాలు ఆపుతారా? రైతుల జోలికొస్తే ఖబడ్దార్

కాంగ్రెస్ నేతలకు మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

- సంక్షేమ పథకాలు ఆపేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని ధ్వజం
- రైతుబంధు ఆపాలని ఈసీకి లేఖ రాసి రైతు వ్యతిరేకతను చాటుకుందని మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న హరీశ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రైతుబంధు పథకాన్ని ఆపాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ పార్టీ లేఖ రాయడం ద్వారా రైతులపట్ల ఉన్న వ్యతిరేకతను మరోమారు చాటుకుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. రైతుల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు చేస్తామన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు వి.భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుబంధు కొత్త పథకం కాదని, ఈ పథకం ద్వారా ఇప్పటికే రూ.75 వేల కోట్లను ప్రభుత్వం రైతులకు అందజేసిందన్నారు. గత ప్రభుత్వాలు రైతుల నుంచి పన్నులు

మిగతా 12వ పేజీలో ▶

త్రిపుర గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి బాధ్యతల స్వీకరణ

- ప్రమాణ స్వీకారం చేయించిన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

- వివరాలు 5లో



లారీని ఢీకొట్టిన సుమో 13 మంది దుర్మరణం

- కర్ణాటకలోని చిక్కబళ్లాపుర వద్ద ఘటన
- మృతుల్లో ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 10 మంది.. కర్ణాటక వాసులు ముగ్గురు

- వివరాలు 12లో

నవంబర్ 2లోపు రైతుబంధు ఇవ్వు

కేటీఆర్‌కు రేవంత్ కౌంటర్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: రైతుబంధును నిలిపివేయాలని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసిందని, పథకాలన్నింటినీ రద్దు చేయడమే కాంగ్రెస్ ఉద్దేశమని మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి 'ఎక్స్'లో కౌంటర్ ఇచ్చారు. 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్టుగా కేటీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైతులపై ప్రేమ ఉంటే నవంబర్ 2 లోపు రైతుబంధు డబ్బులు

మిగతా 12వ పేజీలో ▶



అచ్చంపేట సభకు భారీగా హాజరైన జనం



వనపర్తిలో జరిగిన బహిరంగసభకు హాజరైన జనం

నావంతు చేశా.. | ఇక మీదే బాధ్యత

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ మాట్లాడారు. ప్రసంగం వివరాలు ఆయన మాటల్లోనే..

"24 ఏళ్ల కింద తెలంగాణ కోసం బయలుదేరిన.. నాడు ఎవడూ లేడు. పక్షిలా ఒక్కడినే తిరిగా. అదే ఇప్పుడు లేసినోడు, లేవనోడు అంతా వచ్చి కేసీఆర్ నీకు దమ్ముందా? అంటున్నారు. కొడంగల్ వస్తవా, గాంధీ బొమ్మకాడికి వస్తవా అంటున్నరు. ఇదేనా రాజకీయం? ఎన్నికలు వస్తయ్, పోతాయ్. కానీ ఎన్నికల్లో ప్రజలు గెలిచే పరిస్థితి రావాలి. అప్పుడే బతుకులు బాగుపడతాయి. తెలంగాణకు ముందు ఈ సన్నాసులు ఎక్కడున్నరో, ఎవరి బూట్లు తుడిచారో చెప్పాలి. పదేళ్ల కింద పరిస్థితి ఎలా ఉందో, ఇప్పుడెలా ఉందో ప్రజలే గమనించాలి.

కేసీఆర్ దమ్మేంటో దేశమంతా చూసింది

ఎన్నికలు వస్తున్నాయని అంతా వస్తరు. ఉపన్యాసాలు ఇస్తరు. దేశంలో ఏ సీఎం, పీఎం కూడా మన దాంట్లో పది శాతం కూడా లేరు. కేసీఆర్ దమ్మేంటో ఇండియా చూసింది. నవంబర్ 30న దుమ్ము రేగాలి. నల్లమలలోని అప్పర్ ప్లాటు అమ్రాబాద్‌కు నీళ్లిచ్చే బాధ్యత నాది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు 192 కేసులు వేసి అడ్డంపడ్డది కాంగ్రెస్ వాళ్లే. 1969 ఉద్యమంలో 400 మందిని పిట్టల్లా కాల్చింది, లక్ష మందిని జైల్లో పెట్టింది కాంగ్రెస్ పార్టీనే. 2004లో మన పొత్తుతో గెలిచి 2014 దాకా పదేళ్లు ఏడిపించారు. వాళ్ల ప్రేమతో తెలంగాణ ఇవ్వలేదు. తప్పనిసరై ఇచ్చారు. వాళ్లకు కావాల్సింది తెలంగాణ బాగోగులు కాదు, ఇక్కడి ప్రజలపై పెత్తనం కావాలి.

పైరవీకారుల పార్టీ కాంగ్రెస్



గురువారం వనపర్తి సభలో అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో నిరంజన్‌రెడ్డి

కాంగ్రెస్ పైరవీకారుల పార్టీ. వాళ్లకు పాత దళారీలు కావాలి. రైతు బంధుకు సంవత్సరానికి రూ.15 వేల కోట్లు ఇస్తుంటే వాళ్లకు కడుపు మంటగా ఉంది. అందులో రెండు వేల కోట్లయినా తినొద్దా అని ఆలోచిస్తున్నారు. ఆ దుర్మార్గులను రానిస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. రైతు బంధు రాంరాం అవుతుంది. దళితబంధు జైభీం అయిపోతది. కరెంటు కాటగలుస్తది. మళ్లీ మొదటికే వస్తది. కర్ణాటకలో 20 గంటలు కరెంటు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినా.. 5 గంటలు కూడా ఇవ్వలేకపోతోంది. రైతులు రోడ్లు ఎక్కి ధర్నాలు చేస్తున్నారు. రాహుల్‌గాంధీ నుంచి

119 నియోజకవర్గాల అభ్యర్థులంతా కేసీఆర్‌లే..

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పోటీచేసే బీఆర్ఎస్ అభ్యర్థులు అందరూ కేసీఆర్‌లే. లేచినోడు, లేవలేనోడూ నాపై పోటీ చేస్తామంటూ బీరాలు పలకటం ఏమిటి? మా పార్టీ నుంచి ఎన్నికల బరిలో ఉన్న ప్రతి అభ్యర్థి కేసీఆర్‌తో సమానులే.

రేవంత్‌రెడ్డి దాకా అందరూ ధరణిని తీసేస్తాం అంటున్నరు. దీన్ని తమాషాగా తీసుకోవద్దు. రైతుకు అధికారం ఇస్తామంటోంది బీఆర్ఎస్ పార్టీ అయితే.. లాక్కుంటామంటోంది కాంగ్రెస్ పార్టీ.. మీకు ఏ పార్టీ కావాలి? ఇప్పటిదాకా నావంతు పనిచేశా.. ఇప్పుడు మీదే బాధ్యత.

నష్టపోయేది ప్రజలే..

దళితబంధుతో దళితుల బతుకులు బాగుపడుతున్నాయి. మమ్మల్ని గెలిపించకపోతే వ్యక్తిగతంగా పోయేదేం ఉండదు. రెస్ట్ తీసుకుంటాం. కానీ నష్టపోయేది ప్రజలే. తెలంగాణ తెచ్చినవాడిగా చెప్తున్నా. రాష్ట్రం బాగుండాలంటే ఎవరు ఉండాలో ఆలోచించాలి. మేం ఎన్నికల కోసం అడ్డగోలుగా అబద్ధాలు చెప్పడం లేదు. రూ.70, వంద అంటూ అర్థంపర్థం లేకుండా ఇచ్చిన పెన్షన్‌ను బీఆర్ఎస్ వచ్చాక రూ.వెయ్యికి, తర్వాత రూ.2 వేలకు పెంచుకున్నాం. మళ్లీ గెలవగానే రూ.మూడు వేలలకు పెంచి.. తర్వాత దశలవారీగా రూ.5 వేలకు పెంచుతాం. రాష్ట్రంలోని 93 కోట్ల రేషన్‌కార్డు దారులకు రైతు బీమా తరహాలో బీమా సౌకర్యం కల్పిస్తాం. రేషన్‌పై సన్నబియ్యం ఇస్తాం. అన్నింటినీ బేరీజు వేసుకొని ఆలోచన చేయాలి" అని కేసీఆర్ పేర్కొన్నారు. కాగా.. అచ్చంపేట, వనపర్తి సభల్లో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్.. మునుగోడు సభలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పల్లె రవికుమార్, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా.. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలో జరిగిన అచ్చంపేట, వనపర్తి సభల్లో స్థానిక ఎంపీ పి.రాములు పాల్గొనలేదు. దీనితోపాటు వనపర్తి సభలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి కూడా పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది.

డబ్బు మదంతో వచ్చేవారిని ఓడించాలి

"నల్లగొండ, మునుగోడు రాజకీయ చైతన్యం ఉన్న ప్రాంతాలు. మీ చైతన్యం మూగబోవద్దు. పైసలు పట్టుకొని వచ్చేవాళ్లను, పూటకోపార్టీ మార్చేవాళ్లను నమ్మొద్దు. వాళ్లకో నియమం లేదు. సిద్ధాంతం, నిబద్ధత లేవు. నిన్నొక పార్టీ, ఇవాళ ఒక పార్టీ, రేపు ఇంకో పార్టీ. డబ్బు మదం, అహంకారంతో ప్రజలను కొనగలుతాం అనుకుంటున్నారు. అలాంటి వారికి నల్లగొండ, మునుగోడు చైతన్యం చూపించి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి. అప్పుడే రాజకీయ ప్రక్షాళన జరుగుతుంది. మునుగోడు ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90శాతం నెరవేర్చాం. చండూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశాం. 100 పడకల ఆస్పత్రి పనులు జరుగుతున్నాయి. మిగతా అభివృద్ధి పనులన్నీ పూర్తి కాబోతున్నాయి. అంతకుముందు కాంగ్రెస్ 50–60 ఏళ్లు పాలించినా ఫ్లోరైడ్‌తో ప్రజలు నడుములు వంగి, చనిపోయే వరకు చూశారే తప్ప నివారణ చేయలేదు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఫ్లోరైడ్ గోస పోయింది. పాలమూరు ప్రాజెక్టు పూర్తయితే డిండి ప్రాజెక్టుకు, శివన్నగూడెంకు నీళ్లు వస్తాయి. ఆ బాధ్యత నాది. ఏడాదిన్నరలో మునుగోడు నియోజకవర్గంలోనే 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. తొలి నుంచీ ఉద్యమాల్లో ఉన్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని మునుగోడులో గెలిపించాలి.

నేడు మరో మూడు కేసీఆర్ సభలు

పాలేరు, మహబూబాబాద్, వరంగల్‌లలో ప్రజా ఆశీర్వాద సభలు

సాక్షి ప్రతినిధి, వరంగల్: బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ శుక్రవారం మరో మూడు ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. తొలుత ఉదయం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించే బహిరంగ సభకు సీఎం హాజరవుతారు. తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్ సభకు వస్తారు. అనంతరం వరంగల్ నగరం భట్టుపల్లిలో నిర్వహించే వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. వరంగల్ జిల్లా పరిధిలోని సభల ఏర్పాట్లను గురువారం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, దాస్యం వినయభాస్కర్, శంకర్‌నాయక్ తదితరులు పరిశీలించారు.

బీఆర్ఎస్‌కు కూచుకుళ్ల, కేఎస్ రత్నం | రాజీనామా

నేడు బీజేపీలోకి రత్నం, 31న కాంగ్రెస్‌లోకి దామోదర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/కొల్లాపూర్/చేవెళ్ల: ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఇద్దరూ తమ రాజీనామా లేఖలను బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు పంపించారు. ఈనెల 31న కొల్లాపూర్‌లో నిర్వహించనున్న ప్రియాంకాగాంధీ సభలో ఆమె సమక్షంలో దామోదర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నారు. సభాస్థలిని పరిశీలించేందుకు కొల్లాపూర్ వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ తనకు ఎమ్మెల్సీ పదవితో తగిన గుర్తింపు ఇచ్చినప్పటికీ, స్థానికంగా తనకు ఎదురవుతున్న ఇబ్బందులను పట్టించుకోలేదన్నారు. సమస్యలను చెప్పేందుకు సీఎం కేసీఆర్‌ను ఎన్నిసార్లు అపాయిట్‌మెంట్ అడిగినా ఇవ్వలేదన్నారు. మంత్రి కేటీఆర్‌కు చెప్పినా ఆయన కూడా పట్టించుకోలేదన్నారు. తాను గతంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని 15 రోజులకోసారి కలిసి స్థానిక అంశాలు మాట్లాడేవాడినని వివరించారు. కేసీఆర్ పాలనలో అలాంటి అవకాశం లేదన్నారు. కాగా.. కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి కుమారుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఇది వరకే కాంగ్రెస్‌లో చేరగా.. ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ టికెట్ కేటాయించిన సంగతి తెలిసిందే. మరోవైపు చేవెళ్ల మాజీ



దామోదర్‌రెడ్డి



కేఎస్ రత్నం

ఎమ్మెల్యే కేఎస్ రత్నం శుక్రవారం బీజేపీలో చేరనున్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి కేసీఆర్, కేటీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. పదేళ్లుగా పార్టీలో తగిన ప్రాధాన్యత లేకపోయినా కేసీఆర్‌పై ఉన్న గౌరవంతో కార్యకర్తగా కొనసాగానని చెప్పారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేను బీఆర్ఎస్‌లో చేర్చుకుని తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని.. ఆ తరువాత రెండుసార్లు తనకు టికెట్ నిరాకరించారని ఆవేదన వ్యక్తంచేశారు. చేవెళ్ల నియోజకవర్గం అభ్యర్థి ఎంపికలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయం బాధ కలిగించిందని.. చేవెళ్ల ప్రజల కోరిక మేరకు ఎన్నికల్లో పోటీ చేయదలుచుకున్నానని పేర్కొన్నారు. అందుకే పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

బీఆర్ఎస్‌లోకి మోహన్‌రెడ్డి

- కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ
- ప్రగతి భవన్‌లో కేటీఆర్, హరీశ్‌తో చర్చలు జరిపిన బిత్తిరి సత్తి

సాక్షి, హైదరాబాద్: శాసన మండలి ఉపాధ్యాయ కోటా మాజీ ఎమ్మెల్సీ, పీఆర్‌టీయూ మాజీ అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి గురువారం మంత్రి కేటీ రామారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం బీజేపీలో కొనసాగుతున్న ఆయన ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సారథ్యంలో విద్యారంగ, ఉపాధ్యాయ అంశాలపైన కలిసి పని చేసేందుకు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. అలాగే ప్రముఖ కళాకారుడు బిత్తిరి సత్తి అలియాస్ చేవెళ్ల రవికుమార్ త్వరలో బీఆర్ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్, తాజాగా బిత్తిరి సత్తితోనూ సంప్రదింపులు జరిపింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామా



మోహన్‌రెడ్డి



బిత్తిరి సత్తి

రావు, మంత్రి హరీశ్‌రావుతో బిత్తిరి సత్తి గురువారం ప్రగతిభవన్‌లో భేటీ అయ్యారు. ముదిరాజ్ సామాజికవర్గంతో పాటు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన వారు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయాలని కేటీఆర్, హరీశ్ కోరినట్లు సమాచారం. బీఆర్ఎస్‌లో చేరికకు అంగీకరించినట్లు బిత్తిరి సత్తి 'సాక్షి'కి వెల్లడించారు. ముదిరాజ్ సామాజికవర్గానికి మరికొందరు కీలక నేతలు కూడా త్వరలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఓ పార్టీకి చెందిన కీలక నేత కూడా బీఆర్ఎస్‌లో చేరేందుకు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి సునీత రాజీనామా

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నేపథ్యంలో రాజీనామా... ఆమోదించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ పదవికి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి రాజీనామా చేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేస్తున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ఆమె బీఆర్ఎస్ పార్టీ బీఫారం కూడా అందు కున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆమె రాజీనామాను ఆమోదిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా సునీతా లక్ష్మారెడ్డి 27 డిసెంబర్ 2020న నియమితులయ్యారు. ఆమె పదవీ కాలానికి ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉంది. అయినప్పటికీ ఎన్నికల బరిలో ఉండటంతో ఆమె రాజీనామా చేయడం అనివార్యమైంది.

తెలంగాణ కాంగ్రెస్ కమ్యూనికేషన్ ఇన్‌చార్జిగా అజోయ్ కుమార్

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమ్యూనికేషన్ ఇన్‌చార్జిగా డాక్టర్ అజోయ్ కుమార్‌ను ఏఐసీసీ నియమించింది. ఎన్నికలు పూర్తయ్యేవరకు అజోయ్ కుమార్ మీడియా, సోషల్ మీడియా, వార్‌రూమ్ వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. ఈ మేరకు గురువారం ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

రేవంత్‌ను అసెంబ్లీ మెట్లెక్కనివ్వను: దాసోజు



సాక్షి, హైదరాబాద్: టీపీ సీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని అసెంబ్లీ మెట్లు ఎక్కకుండా మట్టి కరిపిస్తామని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. రేవంత్‌రెడ్డికి ఏం స్వేచ్ఛ కావాలో చెప్పడం లేదని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. బూతులు, రియల్‌ఎస్టేట్, భూ కబ్జాలు, సెటిల్‌మెంట్లు చేయడానికి స్వేచ్ఛ కావాలా? అని నిలదీశారు. 'నీ ఖేల్ ఖతం.. కాస్కో రేటెంతరెడ్డి' అని హెచ్చరించారు.

హరీశ్.. చరిత్ర తెలుసుకో

పీసీసీ అధికార ప్రతినిధి రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రైతువ్యతిరేకి అని అంటున్న రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ఒకసారి చరిత్ర చదువు కుంటే మంచిదని పీసీసీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతున్నామనే నిస్పృహలో ఏం మాట్లాడుతున్నారో తెలియనిస్థితిలో బీఆర్ఎస్ మంత్రులు, నాయకులు ఉన్నారని ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ధరణి పోర్టల్ పేరుతో దగా చేసి పేదల భూములు లాక్కున్నారని విమర్శించారు. రైతుబంధు పథకం తమదేనని చెప్తున్న బీఆర్ఎస్ నేతలు 2014 కాంగ్రెస్ మేనిఫెస్టో చూడాలని, రైతులకు ఆర్థికసహాయం రూ.10 వేలు ఇస్తామని ఆనాడే అందులో హామీ ఇచ్చామని గుర్తుచేశారు. మానవ కట్టడం శ్రీశైలం ప్రాజెక్టు ఎక్కడ? ఎలాంటి వరదలు లేకుండా కుంగిన మేడిగడ్డ ప్రాజెక్టు ఎక్కడ? అని ఆయన ప్రశ్నించారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్ల మీద సబ్సిడీ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు.

ఈ ఎన్నికలు.. రాహుల్ వర్సెస్ రైతన్నలు

- గాంధీలకే గ్యారంటీ లేదు... ఇక కాంగ్రెస్ ఇస్తున్న గ్యారంటీలకు దిక్కేది?
- కోరుట్లలో అర్వింద్ పోటీ చేస్తే ఓడిస్తాం
- మీడియాతో ఎమ్మెల్సీ కవిత చిట్‌చాట్



నిజామాబాద్ నాగారం: రాష్ట్రంలో ఎన్నికలు రాహుల్‌గాంధీ వర్సెస్ రైతన్నల మధ్య జరుగుతున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వాళ్లకు రాహుల్ గాంధీ ఉంటే... తమకు రైతన్నలు ఉన్నారన్నారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కాంగ్రెస్ ఎన్నికల సంఘాన్ని కోరడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు, దళితబంధు ఆపాలని ఆ పార్టీ నాయకులు కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ చెబుతున్నట్లు రైతుబంధు మాత్రమే ఆపేయాలా... లేక అన్ని పథకాలను ఆపేయాలా అని ప్రశ్నించారు. గురువారం నిజామాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ... సంక్షేమ పథకాల సృష్టికర్త కేసీఆర్ అని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇస్తున్న పథకాలు ఆపుకుంటూ వెళ్లాలంటే ముందు కరెంట్ కట్ చేయాలని, ఆ తర్వాత మిషన్ భగీరథ నీళ్లు ఆపాలన్నారు. ఇలా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కూడా ఆపాల్సి వస్తుందన్నారు. వీటిని ఆపడం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. పదేళ్లుగా నడుస్తున్న ఈ పథకాలు కొత్తవని భావిస్తుంటే కాంగ్రెస్ ఎంతటి అభద్రతాభావంతో ఉందో అర్థమవుతోందన్నారు. సంక్షేమ పథకాలు నిలిపివేయాలని చూస్తే, రైతులను బాధపెడితే కాంగ్రెస్‌కే నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ, రాహుల్ గాంధీలు ఏ హోదాలో గ్యారంటీలు ఇస్తున్నారని... ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గేను పక్కకు పెట్టి వారు గ్యారంటీలు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. గాంధీలకే గ్యారంటీ లేదని వారిచ్చే గ్యారంటీలను ఎలా నమ్మాలని నిలదీశారు. రేవంత్ కామారెడ్డికి వచ్చినా, ఈటల గజ్వేల్‌లో పోటీ చేసినా తమ పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరుట్లలో ఎమ్మెల్యేగా పోటీచేస్తే ఓడించడానికి తమ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. బోధన్, నిజామాబాద్‌తోపాటు పార్లమెంట్ నియోజకవర్గం జగిత్యాల నుంచి బోధన్ వరకు ప్రచారం చేస్తానని కవిత చెప్పారు. ఈసారి ఎన్నికల్లో హ్యాట్రిక్ కొట్టడమే కాకుండా 100కు పైగా సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నేడు కాంగ్రెస్ మలి జాబితా!

- నేతల చేరికల నేపథ్యంలో జాప్యం
- గెలుపు గుర్రాలకే సీట్లు ఇచ్చేలా స్క్రీనింగ్ కమిటీ కసరత్తు
- పార్టీ సీఈసీ భేటీ తర్వాత విడుదల చేయనున్న నేతలు
- మాణిక్‌రావ్ ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మలి జాబితాపై కసరత్తు దాదాపు పూర్తయింది. నేతల చేరికలు, మార్పుచేర్పుల నేపథ్యంలో విడుదల జాప్యమవుతోందని, శుక్రవారం రాత్రికల్లా మలి జాబితాను ఏఐసీసీ విడుదల చేయనుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో 34 మంది కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు కమ్యూనిస్టులకు కేటాయించే నాలుగు స్థానాల పేర్లు ఉండనున్నాయని తెలిపాయి. ఇందులో కచ్చితంగా గెలవగలిగే అభ్యర్థులకే సీట్లు కేటాయించేలా స్క్రీనింగ్ కమిటీ కసరత్తు పూర్తి చేసిందని పేర్కొన్నాయి.

అసంతృప్తిని చల్లార్చేందుకు..: కొన్నిరోజులుగా ఢిల్లీ వేదికగా మురళీధరన్ నేతృత్వంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయి. తొలి జాబితాలో 55 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాక కొన్నిచోట్ల అసంతృప్తి బయటపడిన నేపథ్యంలో.. మలి జాబితా తర్వాత అలాంటి పరిస్థితి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇద్దరు, ముగ్గురికిపైగా టికెట్లు ఆశిస్తున్న సుమారు 17 నియోజకవర్గాలకు సంబంధించి.. నేతలను ఢిల్లీకి పిలిపించుకొని చర్చలు జరుపుతున్నారు. అవసరమైన వారిని పోటీ నుంచి తప్పుకొనేలా బుజ్జగిస్తున్నారు. ఈ క్రమంలో మలి జాబితాపై ఆశావహులు, పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. కాగా.. శుక్రవారం కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం జరగనుంది. ఈ భేటీలో అభ్యర్థుల ఎంపికను సీఈసీ ఖరారు చేయనుంది.

కాంగ్రెస్‌లో చేరిన రాజగోపాల్‌రెడ్డి



బీజేపీకి రాజీనామా చేసిన మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం రాత్రి రాజగోపాల్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్ కుమార్‌లకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు రాజగోపాల్‌రెడ్డి, మిగతా ఇద్దరు నేతలు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఇతర పెద్దలను కలసి చర్చలు జరిపారు. రాహుల్‌గాంధీ సమక్షంలో పార్టీ చేరాలని వారు భావించారు. కానీ శుక్రవారం ఉదయం కాంగ్రెస్ సీఈసీ భేటీ ఉన్న నేపథ్యంలో.. అంతకన్నా ముందే పార్టీలో చేరితే అభ్యర్థిత్వాలను పరిశీలించడం సాధ్యమవుతుందని పెద్దలు స్పష్టం చేశారు. దీంతో ఈ ముగ్గురి చేరికల తతంగాన్ని గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఈ ముగ్గురు నేతలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో కలవనున్నారు.

బీఆర్ఎస్‌ను కాపాడుతోంది బీజేపీనే

- మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ నివేదికను కేంద్రం బయటకు రానివ్వట్లేదు
- తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఉంది కాబట్టే రైడ్స్ జరగట్లేదు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- జనసేనతో పాటు కేఏ పాల్‌ను కూడా కలుపుకుంటే బీజేపీకి మంచిదంటూ ఎద్దేవా



మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో ఉత్తమ్, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను కాపాడుతున్నది బీజేపీనే అని, మేడిగడ్డపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదికను కేంద్ర ప్రభుత్వం బయట పెట్టకపోవడమే ఇందుకు నిదర్శనమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రానికి బీఆర్ఎస్ 'ప్రొటెక్షన్ మనీ' చెల్లిస్తోంది కాబట్టే రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలపై చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శించారు. గాల్లో మేడలా మేడిగడ్డ ప్రాజెక్ట్‌ను నిర్మించారన్నారని ధ్వజమెత్తారు. గురువారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డి, సీనియర్ నేత బలరాం నాయక్‌తో కలసి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

తెలంగాణలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమే

దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈడీ, ఐటీ, సీబీఐ అధికారులు దాడులు చేస్తారని..తెలంగాణలో అధికారంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వం కాబట్టే దాడులు జరగట్లేదని రేవంత్ ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు బీజేపీకి ఫ్రంటల్ ఆర్గనైజేషన్లని విమర్శలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ మూడు పార్టీలు చెడ్డీగ్యాంగ్ అని, అందుకే ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు బీజేపీ, మజ్లిస్‌లు ప్రయత్నిస్తున్నాయని... వీరి మధ్య సీట్ల పంపకాలు కూడా జరిగిపోయాయని ఆరోపించారు. రాజగోపాల్‌రెడ్డి, డీకే అరుణ, విజయశాంతి, విశ్వేశ్వర్‌రెడ్డిలు సిద్ధాంతాలు నమ్మి బీజేపీలో చేరలేదని.. కేసీఆర్ చేసిన అవినీతిపై బీజేపీ చర్యలు తీసుకుంటుందని చేరారని రేవంత్ పేర్కొన్నారు. కానీ కేసీఆర్‌పై ఏవిధమైన చర్యలూ బీజేపీ తీసుకోదనే వాస్తవాన్ని వారంతా ఇప్పుడు తెలుసుకున్నారు కాబట్టే అక్కడ ఉండేందుకు ఇష్టపడట్లేదని వ్యాఖ్యానించారు.

కేసీఆర్, కేటీఆర్‌లను ఓడిస్తాం

కేసీఆర్, కేటీఆర్‌లను చిత్తుగా ఓడించేందుకు తాను, భట్టి విక్రమార్క సిద్ధంగా ఉన్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. కొడంగల్‌లో పోటీకి కేసీఆర్‌ను ఆహ్వానించానని, ఆయన రాకపోతే తానే కామారెడ్డిలో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అదే విధంగా అధిష్టానం ఆదేశిస్తే తాను, భట్టి విక్రమార్క ఇద్దరూ కేసీఆర్, కేటీఆర్‌లపై పోటీ చేసి ఓడించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీజేపీ, జనసేన పొత్తులపై మీడియా అడిగిన ప్రశ్నలకు స్పందించారు. పనిలో పనిగా బీజేపీ జనసేనతో పాటు కేఏ పాల్‌ను కూడా కలుపుకుంటే బాగుండేదంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తామేమీ ప్రభుత్వ పథకాలను వద్దనలేదనీ, రాష్ట్ర ప్రజలకు అందే సంక్షేమ పథకాలు నవంబర్ 2వ తేదీలోపు పూర్తి చేయాలని తాము ఎన్నికల సంఘాన్ని కోరినట్లుగా రేవంత్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు.

ఇదం జగత్



పార్టీ మారడానికి ఈజీగా ఉండటానికట!

యువ ఐపీఎస్‌ల శిక్షణ పూర్తి

సాక్షి, హైదరాబాద్: విజయవంతంగా మొదటి దశ శిక్షణ పూర్తి చేసిన యువ ఐపీఎస్ అధికారులు విధి నిర్వహణలో తొలి అడుగు వేయబోతున్నారు. శుక్రవారం ఉదయం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీఎన్‌పీఏ)లో 75వ రెగ్యులర్ రిక్రూటీస్ (ఆర్‌ఆర్) బ్యాచ్‌కు చెందిన 155 మంది యువ ఐపీఎస్ అధికారులు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొంటారు. వీరితోపాటు శిక్షణ పొందిన మరో 20 మంది విదేశీ అధికారులు పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొంటారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరవుతారు. తొలుత ఎన్‌పీఏలోని అమరవీరుల స్తూపం వద్ద ఆయన నివాళులర్పిస్తారు. అనంతరం కేడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి యువ ఐపీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేస్తారు.

బీఎస్సీ అలాయిడ్ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: బీఎస్సీ అలాయిడ్ హెల్త్ సైన్సెస్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశాలకు యూనివర్సిటీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. బీఎస్సీ అనస్థీషియా టెక్నాలజీ, బీఎస్సీ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, బీఎస్సీ కార్డియాక్, కార్డియో వాస్క్యులర్ టెక్నాలజీ, బీఎస్సీ రెనాల్ డయాలసిస్ టెక్నాలజీ, బీఎస్సీ ఆప్టోమెట్రీ, బీఎస్సీ రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ, బీఎస్సీ న్యూరో సైన్స్ టెక్నాలజీ, బీఎస్సీ క్రిటికల్ కేర్ టెక్నాలజీ, బీఎస్సీ రేడియాలజీ, ఇమేజింగ్ టెక్నాలజీ, బీఎస్సీ ఆడియోలజీ, స్పీచ్ థెరపీ టెక్నాలజీ, బీఎస్సీ మెడికల్ రికార్డ్స్ సైన్సెస్, బీఎస్సీ న్యూక్లియర్ మెడిసిన్, బీఎస్సీ రేడియో థెరపీ టెక్నాలజీ తదితర కోర్సులకు ప్రవేశం కల్పించనున్నట్లు వివరించింది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపింది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారని పేర్కొంది. మరిన్ని వివరాలకు www.knruhs.telangana.gov.in లో చూడాలని సూచించింది.

ఇంటి దగ్గరే ఓటు వేసేందుకు వినతి

సాక్షి, హైదరాబాద్: 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి దగ్గరే ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లక్ష్మయ్య, టి.శుభాకరరావు కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. పోలింగ్‌కు అయిదు రోజుల ముందే ఓటింగ్ నమోదు చేసుకోవాలని, వారికి ఫారం 12-డీ ఇచ్చి ఓటును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు నవంబర్ 14

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలు ఖరారయ్యాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు ఈ నెల 26 నుంచి వచ్చేనెల 14 వరకూ ఎలాంటి అపరాధ రుసుము లేకుండానే ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ బోర్డు సెక్రెటరీ నవీన్ మిత్తల్ తెలిపారు. రూ.వంద అపరాధ రుసుముతో నవంబర్ 16–23 వరకూ, రూ.500 అపరాధ రుసుముతో నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4 వరకూ ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.వెయ్యి అపరాధ రుసుముతో డిసెంబర్ 6–13 వరకూ, రూ.2 వేల అపరాధ రుసుముతో డిసెంబర్ 15–20 వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశముందని తెలిపారు. ఫస్టియర్, సెకండియర్ జనరల్ కోర్సులకు రూ.510, ఒకేషనల్ కోర్సులకు రూ.730 పరీక్ష ఫీజు చెల్లించాలని చెప్పారు.

దయతో చేసిన పనులన్నీ దాతృత్వానికి సమానమైనవే.
మీకు చెడు చేసిన వారి పట్ల కూడా దయ కలిగి ఉండండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 27 అక్టోబర్ 2023

చైనా కొత్త ఎత్తులు

ప్రపంచమంతా కొత్తగా రాజుకున్న ఇజ్రాయెల్ – గాజా లడాయిపై దృష్టి కేంద్రీకరిస్తున్న తరుణంలో చడీచప్పుడూ లేకుండా చైనా పావులు కదిపింది. మన సన్నిహిత దేశాలైన భూటాన్, శ్రీలంకలతో ఒప్పందాలు కుదుర్చుకుని మనల్ని ఇరకాటంలో పడేసింది. చైనాలో పర్యటించిన భూటాన్ విదేశాంగమంత్రి తాండీ దోర్జీతో చైనా ఉప విదేశాంగమంత్రి సన్ వీ డాంగ్ సంప్రదింపులు జరిపి ఇరుదేశాల సరిహద్దు వివాదాన్నీ పరిష్కరించుకోవటానికి ఉమ్మడి సాంకేతిక నిపుణుల బృందం ఏర్పాటుకు అవగాహన కుదుర్చుకున్నారు. రెండు దేశాల మధ్యా దౌత్యసంబంధాలు ఏర్పాటుచేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. అటు శ్రీలంక అధ్యక్షుడు విక్రమసింఘే కూడా చైనా సందర్శించి ఆ దేశం తలపెట్టిన బృహత్తర ప్రాజెక్టు బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ)లో తమ దేశం పాలుపంచుకుంటుందని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై త్వరలో సంతకాలవుతాయని సంయుక్త ప్రకటనలో తెలిపారు. భూటాన్, శ్రీలంక రెండూ సార్వభౌమాధికారం వున్న దేశాలు. తమ ప్రయోజనాలకు తగినట్టు అవి నిర్ణయాలు తీసుకుంటాయి. కానీ ఆ ఒప్పందాల పర్యవసానాలు భారత్ భద్రతతో ముడిపడివుండటం మనల్ని కలవరపరిచే అంశం.

శ్రీలంక మాటెలావున్నా భూటాన్‌తో మనకు ప్రత్యేక అనుబంధం వుంది. 2007 వరకూ భూటాన్‌తో వున్న స్నేహ ఒడంబడిక ప్రకారం మన దేశం ఆమోదించిన 21 దేశాలతో మాత్రమే అది దౌత్య సంబంధాలు ఏర్పర్చుకునేది. యూపీఏ హయాంలో ఈ ఒప్పందం గడువు ముగిసినా మన దేశం చొరవ తీసుకోకపోవటం, ఈలోగా ఆ ఒప్పందం కింద భూటాన్‌కి అప్పటివరకూ ఇచ్చే సబ్సిడీలు ఆగిపోవటం సమస్యలకు దారితీసింది. ఆ దేశంలో ఒక్కసారిగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పోయాయి. వాస్తవానికి భూటాన్ ఉత్తర సరిహద్దులో వున్న చంబీలోయ ప్రాంతాన్ని తమకు ధారాదత్తం చేయమని చైనా కోరినా అది భారత్ భద్రతకు సమస్యలు తెచ్చిపెడుతుందన్న ఏకైక కారణంతో భూటాన్ తిరస్కరించింది. 2005లో భూటాన్ రాజు ఐచ్ఛికంగా రాచరిక ఆధిపత్యాన్ని వదులుకుని రాజ్యాంగబద్ధ పాలనకు బాటలు పరిచారు. అటు తర్వాత నుంచి భూటాన్ ఆలోచన మారింది. దేశానికి గరిష్ఠంగా మేలు చేసే విదేశాంగ విధానం అనుసరించాలన్న అభిప్రాయం బలపడింది. అలాగని 2017లో డోక్లామ్‌లో చైనాతో వివాదం తలెత్తినప్పుడు భూటాన్ మన సాయమే తీసుకుంది. అయితే మన దేశం మరింత సాన్నిహిత్యంగా మెలిగివుంటే అది చైనా వైపు చూసేది కాదు. డోక్లామ్‌కు దగ్గరలో చైనా భూగర్భ గిడ్డంగుల్ని నిర్మిస్తోందని అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ మన దేశాన్ని నిరుడు హెచ్చరించింది. అలాగే అక్కడికి సమీపంలో ఒకటి రెండు గ్రామాలను సృష్టించి ప్రజలను తరలించిందన్న వార్తలొచ్చాయి. డోక్లామ్ ప్రాంతం భారత్– భూటాన్– చైనా సరిహద్దుల కూడలి. అలాంటిచోట చైనా రోడ్డు నిర్మాణానికి పూనుకోవటం వల్ల 2017లో వివాదం తలెత్తింది. మన దేశం గట్టిగా అభ్యంతరాలు తెలపటంతో చైనా వెనక్కు తగ్గింది. కానీ ఆనాటి నుంచీ భూటాన్‌ను బుజ్జగించే ప్రయత్నాలు అది చేస్తూనేవుంది. ఒకపక్క మనతో వాస్తవాధీన రేఖ వద్ద ఏర్పడ్డ వివాదాల పరిష్కారానికి ఏ మాత్రం సిద్ధపడకుండా, చర్చల పేరుతో కాలయాపన భూటాన్‌తో మాత్రం సన్నిహితం కావటానికి చైనా ప్రయత్నించటంలోని ఉద్దేశాలు గ్రహించటం పెద్ద కష్టం కాదు.

ఇటు శ్రీలంక సైతం మన అభ్యంతరాలను బేఖాతరు చేసి బీఆర్ఐ ప్రాజెక్టులో పాలుపంచుకునేందుకే నిర్ణయించుకుంది. ఇందుకు సంబంధించిన ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు ఇరుపక్షాలూ అంగీకరించాయి. హిందూ మహా సముద్ర ప్రాంతంలో మనల్ని దెబ్బతీసేందుకు మనకు సన్నిహితంగా వుండే దేశాలను రుణాలతో, భారీ ప్రాజెక్టులతో తనవైపు తిప్పుకునే చైనా ప్రయత్నాలు ఈనాటివి కాదు. భారీ నౌకాశ్రయాలు, రహదారులు, విమానాశ్రయాలు నిర్మించేందుకు తమ ఎగ్జిమ్ బ్యాంకు ద్వారా చైనా అందించిన రుణాలు లంకను కుంగదీశాయి. విదేశీ మారకద్రవ్యం నిల్వలు చూస్తుండగానే అడుగంటాయి. దేశ ఆర్థిక వ్యవస్థ గుల్లయింది. ధరలు పెరిగిపోవటం, నిత్యావసరాల కొరత ఏర్పడటం పర్యవసానంగా నిరుడు తీవ్ర నిరసనలు పెల్లుబికి రాజపక్స సోదరులు, వారి కుటుంబసభ్యులు దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది. ఆ సమయంలో మన దేశం శ్రీలంకకు తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకుంది. బీఆర్ఐ ప్రాజెక్టుకు అంగీకరించి, చైనా ఇస్తున్న రుణాలకు ఆమోదముద్ర వేస్తే పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని ఈనెల 11న కొలంబోలో జరిగిన హిందూ మహాసముద్ర ప్రాంత దేశాల సదస్సు సందర్భంగా మన విదేశాంగమంత్రి జైశంకర్ హెచ్చరించారు.

నిరుడు దేశంలో సంక్షోభం తలెత్తినప్పుడు అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర 20 దేశాలున్న పారిస్ క్లబ్‌తో పాటు మన దేశం కూడా శ్రీలంకకు ఒక షరతు పెట్టింది. రుణాల చెల్లింపులో ఒకే విధమైన నిబంధనలు అనుసరించాలని, ద్వైపాక్షిక ఒప్పందం పేరుతో ఎవరికీ వెసులుబాటు ఇవ్వరాదని తెలిపాయి. అయినా చైనా విషయంలో అందుకు భిన్నమైన మార్గాన్ని శ్రీలంక ఎంచుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశం జాగ్రత్తగా అడుగులేయాలి. మన వ్యూహాత్మక ప్రయోజనాలను దెబ్బతీసే రీతిలో చైనాతో ఒప్పందాలు కుదుర్చుకొనరాదని శ్రీలంక, భూటాన్‌లకు నచ్చజెప్పాలి. ఏ కారణాలు వారిని చైనా వైపు మొగ్గు చూపేందుకు దారితీస్తున్నాయో గ్రహించి మనవైపు ఏమైనా లోటుపాట్లుంటే సరిదిద్దుకోవాలి. సకాలంలో సరైన కార్యాచరణకు పూనుకుంటే మనకు సానుకూల వాతావరణం ఏర్పడటం పెద్ద కష్టం కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.3.44 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.9.16 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.8.36 నుండి 10.08 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.04 వరకు తదుపరి ప.12.07 నుండి 12.54 వరకు, **అమృతఘడియలు:** తె.5.40 నుండి 6.02 వరకు (తెల్లవారితే శనివారం).

సూర్యోదయం: 6.00
సూర్యాస్తమయం: 5.29
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

సామూహిక శిక్షగా మారిన యుద్ధం

విశ్లేషణ


మనోజ్ జోషి

పశ్చిమాసియా ప్రాంతపు ప్రస్తుత నిత్యాగ్నిహోత్రాన్ని డాంబికాల మధ్య జరుగుతున్న యుద్ధం అని అంటే అతిశయోక్తేమీ కాదు. గాజాలో హమాస్‌ను కట్టడి చేశామని తమకు తాము సర్ది చెప్పుకునే ఇజ్రాయెలీలు ఒకవైపు.. ఇజ్రాయెల్‌తో వివిధ అరబ్ దేశాల సంబంధాలు సాధారణ స్థితికి వస్తే – అది కూడా పాలస్తీనా అంశంతో సంబంధం లేకుండా జరిగిపోతే – ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ రాజకీయాలకు అక్కరకొస్తుందని అమెరికన్లు మరోవైపు భావిస్తున్నారు. కానీ నిత్య నిరాశావాది, స్వప్రయోజనాలే మిన్న అనుకునే నెతన్యాహూ రాజకీయాలు ఇజ్రాయెల్ ప్రయోజనాలను దెబ్బ తీశాయనడంలో సందేహం లేదు. ఒకరకంగా ఆయన హమాస్ ఆటలో పావు అయ్యారని చెప్పవచ్చు. ఇజ్రాయెల్‌కున్న ఆత్మరక్షణ హక్కును ఎవరూ కాదనరు. కానీ ప్రజలను నిర్బంధంలో ఉంచడం, ప్రాథమిక అవసరాలు కూడా తీరకుండా చేయడం 'సామూహిక శిక్ష' కిందకు వస్తుంది.

అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన హమాస్ ఉగ్రవాదుల దాడి యూదుల చరిత్రలోనే తీవ్రమైనదని అందరూ అంగీకరిస్తున్నారు. ఇజ్రాయెల్ ఇప్పుడు ఆ దాడికి ప్రతీకారం తీర్చుకుంటోంది. గాజా స్ట్రిప్‌కు నీరు, విద్యుత్తు, ఆహారం అన్నింటిని బంద్ చేసింది. పైగా ఆ ప్రాంతంపై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఇందులో కొన్ని జిల్లాలకు జిల్లాలు నేలమట్టమై పోయాయి. అయితే చర్యల ద్వారా హమాస్‌ను గాజా స్ట్రిప్ నుంచి ఎలా తీసివేస్తారన్నది ప్రశ్నార్థకంగా నిలుస్తోంది. ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో ఇజ్రాయెల్ ప్రణాళికలు మొత్తం బెడిసికొడుతూండగా ప్రస్తుతం అది కొత్త, విచిత్రమైన పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఇజ్రాయెల్ ఇకనైనా కొంచెం ఆచి తూచి ముందడుగు వేయాలని మిత్రదేశాలే సూచిస్తూండటం ఇందుకు నిదర్శనం.

అమెరికాకు అనుభవమే

ప్రస్తుతం ఇజ్రాయెల్ ఎదుర్కొంటున్న పరిస్థితికి, సెప్టెంబరు 11న అల్‌ఖైదా ఉగ్రవాదుల దాడి తరువాత అమెరికా ఎదుర్కొంటున్న పరిస్థితికి సారూప్యం కనిపిస్తుంది. అప్పట్లో అమెరికా గ్లోబల్ వార్ ఆన్ టెర్రరిజమ్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మహా యుద్ధాన్ని ఒక్కసారి సమీక్షిస్తే అమెరికా అఫ్గానిస్తాన్‌లో యుద్ధాన్ని కోరుకుందని, అదే సమయంలో ఇరాక్‌తో యుద్ధాన్ని ఎంచుకుందని చెప్పాల్సి వస్తుంది. రెండూ అమెరికాకు తలనొప్పి మిగిల్చిన మాటైతే నిజం. బాధితులు అఫ్గానిస్తాన్, ఇరాక్ ప్రజలు మాత్రమే. ఇప్పుడు ఇజ్రాయెల్ నేతలు కూడా ప్రజల బాధలు పట్టించుకునే స్థితిలో కనిపించడం లేదు. గాజాను సమూలంగా నేలమట్టం చేశాక, దాంతో సంబంధాలన్నీ తెంచేస్తామని ఇజ్రాయెలీ జనరళ్లు చెబుతున్నారు. అయినా సరే.. ఇజ్రాయెల్ పొరుగునే 20 లక్షల మంది బాధతప్త జనాభా ఉంటుంది. ఏదో ఒక ప్రాంతాన్ని మిలటరీ చర్యలకు అతీతంగా ఉంచినా సరే.

ఇజ్రాయెల్ ఏర్పాటు ఐక్యరాజ్య సమితి తీర్మానం ద్వారా జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ కూడా ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టబడిన వారి శాపనార్థాలు ఇజ్రాయెల్‌కు తగులుతూనే ఉన్నాయి. దశాబ్దాలుగా అసమ్మతిని, వ్యతిరేకతను అణచివేసేందుకు సైనిక చర్యలనే ఆసరాగా చేసుకుంది ఇజ్రాయెల్. రహస్య గూఢచార వ్యవస్థ సాయంతో దాడులను ముందస్తుగా అణచివేస్తోందనీ అంటారు.

ఇజ్రాయెల్ తన భద్రత చర్యల్లో భాగంగా 1967లో వెస్ట్‌బ్యాంక్, గాజాస్ట్రిప్‌లలోని కొంత ప్రాంతాన్ని ఆక్రమించింది కూడా. ఈ ప్రాంతాల్లో ఇజ్రాయెల్ ఏర్పాటు కారణంగా నిర్వాసితులైన పాలస్తీనియన్లు ఎక్కువగా ఉంటారు. అంటే బలవంతంగా తమ ఇళ్ల నుంచి గెంటివేయబడిన వారన్నమాట. ఈ రకమైన చర్యలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఎలాగైతే ఉగ్రవాదాన్ని తమ ప్రతిచర్యగా హమాస్ ఎంచుకుందో.. అలాగే ఇజ్రాయెల్ కూడా పాలస్తీనియన్లను వారి స్వస్థలాల నుంచి తరిమేయడాన్ని ఒక పనిగా పెట్టుకుంది. సరిహద్దుల్లో సవాళ్లను ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ వాటిని ఎదుర్కొనేందుకు పాలస్తీనా మొత్తమ్మీద శక్తిమంతమైన గూఢచార వ్యవస్థను, వేగులు, ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంది. ఈ నెట్‌వర్క్ అరబ్ దేశాలతోపాటు ఇరాన్ వరకూ వ్యాపించి ఉంది. గాజా చుట్టూ దుర్భేద్యమైన అత్యాధునిక ఏర్పాట్లు చేసుకున్నా హమాస్ ఇటీవల జరిపిన దాడి ఇజ్రాయెల్ శక్తియుక్తులను తక్కువ చేసి చూపుతోంది.


ఇజ్రాయెల్ ముట్టడిలో గాజా నగరం

పోటాపోటీగా హమాస్

పాలస్తీనాపై 38 ఏళ్ల ఆక్రమణ ముగిసిన రెండేళ్లకు అంటే 2005 లోనే హమాస్ సరిహద్దుల వెంబడి 45 కిలోమీటర్ల పొడవైన ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చుకుంది. అప్పటి నుంచి ఇజ్రాయెల్ గాజాపై నాలుగుసార్లు వైమానిక, భూతల దాడులు చేసింది. 2008లో మూడు వారాలపాటు కొనసాగిన యుద్ధంలో వెయ్యిమంది పాలస్తీనీయులు మరణించగా ఇజ్రాయెల్ తరఫున 13 మంది ప్రాణాలు కోల్పోయారు. దీని తరువాత 2012లో ఇజ్రాయెలీలు గాజా స్ట్రిప్‌పై ఎనిమిది రోజులపాటు తీవ్రస్థాయి దాడులు చేశారు. అలాగే 2014లో ఆరువారాలపాటు జరిగిన యుద్ధంలో మరోసారి వైమానిక, భూతల దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు రెండు వేల మంది పాలస్తీనీయులు మరణించగా ఇజ్రాయెలీల ప్రాణనష్టమూ ఎక్కువగానే ఉందని అంచనా. 2021లో మొత్తం 11 రోజులపాటు మరోసారి ఇరుపక్షాల మధ్య యుద్ధం జరగ్గా హమాస్ రాకెట్లతో ఇజ్రాయెలీ పట్టణాలపై దాడులకు తెగబడింది. ప్రతిగా ఇజ్రాయెల్ గాజాను వైమానిక, క్షిపణి దాడులతో అతలాకుతలం చేసింది. పాలస్తీనా తరఫున పోరాడిన 250 మంది, ఇజ్రాయెలీలు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ ఏడాది మొదలైన ఘర్షణలో జరిగిన నష్టంపై ఇంకా మదింపు జరగలేదు. కాకపోతే ప్రాణనష్టం ఇరువైపులా పది వేలు ఆ పైమాటే అంటున్నారు.

హింసకు హింసే సమాధానం అన్నట్టుగా సాగుతున్నాయి ఈ వ్యవహారాలు. ఈ నెల మొదట్లో జరిగిన హమాస్ దాడిలో ఇజ్రాయెల్‌కు జరిగిన ప్రాణనష్టాన్ని పరిగణించినా హమాస్ చేతుల్లోని బందీలను దృష్టిలో ఉంచుకున్నా ఈసారి యుద్ధం అంత ఆషామాషీగా ముగిసేది కాదని అర్థమవుతుంది. పాలస్తీనా మరోసారి దాడికి దిగకుండా గట్టిగా బుద్ధి చెప్పాలని ఇజ్రాయెల్ యోచిస్తోంది. అయితే ఇజ్రాయెల్ ఇప్పటికే చాలాసార్లు ఇలా తీవ్రస్థాయిలో పాలస్తీనాకు బుద్ధి చెప్పే ప్రయత్నం చేయడం గమనార్హం. వాటి ఫలితాల ఆధారంగా మిలటరీ మార్గం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాజాలదని ఇజ్రాయెల్ ఇప్పటికే గుర్తించి ఉండాలి.

రాజనీతిజ్ఞతా తోడవ్వాలి

గాజాలో హమాస్ ప్రాభవాన్ని తగ్గించేందుకు ఒకవైపున మిలటరీ దాడులు, ఇంకోవైపున రాజకీయ చర్యలు అత్యవసరమవుతాయి. ప్రతీకార దాడులు కేవలం హమాస్ కేంద్రంగా జరిగేలా ఇజ్రాయెల్ జాగ్రత్తలు తీసుకోవాలి. పాలస్తీనీయులకు భారీ ప్రాణ నష్టం జరగడం, ఇబ్బందులకు గురికావడం హింసాత్మక చక్రం గిర్రున తిరిగేందుకు మాత్రమే ఉపయోగపడుతుందని ఇజ్రాయెల్ అర్థం చేసుకోవాలి. ఆత్మరక్షణ విషయంలో ఇజ్రాయెల్‌కు ఉన్న హక్కును ఎవరూ కాదనరు. కానీ ప్రజలను నిర్బంధంలో ఉంచడం, ప్రాథమిక అవసరాలు కూడా తీరకుండా చేయడం అనేది 'సామూహిక శిక్ష' కిందకు వస్తుంది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఇది నేరం. ప్రస్తుతం ఇజ్రాయెల్ జరుపుతున్న బాంబుదాడుల్లో విచక్షణ అనేది ఏదీ లేదన్నది సుస్పష్టం. ఇక హమాస్ అమాయక ప్రజలను రక్షణ కవచంగా ఉపయోగించుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా యుద్ధ నియమాలను పాటించేలా అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు చర్యలు తీసుకోవాలి. లేదంటే దక్షిణార్ధ గోళ దేశాలు పాశ్చాత్య దేశాల విషయంలో దురభిప్రాయానికి వచ్చే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ చట్టాలు పాశ్చాత్యదేశాలు కేవలం తమ అనుకూలతకు తగ్గట్టుగా మలచుకుంటాయని ఇవి భావించే ప్రమాదం ఉంది.

ఇజ్రాయెల్, దాని ప్రధాన మద్దతుదారైన అమెరికా.. పశ్చిమాసియా అనేది ఒకప్పటి అమెరికా ఆధిపత్యం చలాయిస్తున్న ప్రాంతాల్లో ఒకటి కాదని గుర్తుంచుకోవాలి. అలాగే ఇజ్రాయెల్ కూడా ఈజిప్టు, సౌదీ అరేబియా, ఖతార్... బహుశా ఇరాన్‌తోనూ దీర్ఘకాలిక రక్షణ దృష్ట్యా రాజకీయపరమైన పరిష్కారాలు చేసుకోవడం మేలు.

వ్యాసకర్త అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సభ్యులు
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

దుమ్మురేపిన పుస్తకం



మధ్యప్రాచ్యంలోని అల్లకల్లోలంపై నబిన్ ఇక్బాల్ 2021లో రాసిన 'షామల్ డేస్' పుస్తక పునరావిష్కరణ వేళ రచయితకు, కేరళ యూనివర్సిటీ ఇంగ్లీష్ ప్రొఫెసర్ మీనా టి. పిళ్లైకి మధ్య నడిచిన చర్చ ఉత్తేజం కలిగించింది. ఈ కాలానికి తగిన పుస్తకం, ఆలోచన రేకెత్తించిన చర్చ.
– శశి థరూర్, ఎంపీ

ఏడాదంటే మాటలా?!




ఏఐసీసీ అధ్యక్షుడిగా విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న మన సొంత కర్ణాటక బిడ్డ శ్రీ మల్లికార్జున్ ఖర్గేకు అభినందనలు. సర్... మీ సమర్థ నాయకత్వంలో శక్తిమంతమైన మన పార్టీ... మీ మార్గదర్శకత్వంలో మరింత దూసుకుపోతుంది.
– డి.కె. శివకుమార్, ఉప ముఖ్యమంత్రి

పేరు మాత్రం నరోత్తమ్!!



మధ్యప్రదేశ్ ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తున్న ఆ రాష్ట్ర హోం మంత్రి నరోత్తమ్ మిశ్రా.. "అభివృద్ధిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటు, హేమమాలిని కూడా వచ్చి నృత్యం చేసేంత స్థాయికి మన నియోజకవర్గాన్ని తీసుకెళ్లాం.." అన్నారు! మహిళల పట్ల మన గౌరవం, ఆదరణ ఇలా ఉన్నాయి! హేమమాలిని తమ పార్టీ ఎంపీ అన్నది మిశ్రాకు గుర్తుకు రాలేదా?
– అశీష్ సింగ్, పొలిటికల్ ఎనలిస్ట్

మరో ఆయుధం రెడీ



మానవ జాతుల్లోని వ్యంగ్య విషాదం ఏమిటంటే భూగోళ రక్షణకు సదస్సులు నిర్వహిస్తూనే, ఒకరినొకరం ధ్వంసం చేసుకోడానికి నిరంతరం వినూత్న మార్గాలను అన్వేషిస్తూ ఉంటాం. (దెబ్బకు దెబ్బ తియ్యగల భారీ అణ్వస్త్రాన్ని రష్యా పరీక్షించి చూసిందన్న వార్తకు స్పందనగా..)
– ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూపు ఛైర్మన్

సీఎం వాకౌట్!



ఢిల్లీ గ్యాస్ ఛాంబర్‌గా మారి పోయింది. ఢిల్లీని రక్షించడానికి, పంజాబ్‌లో పంట వ్యర్థాలను కాల్చడాన్ని ఆపడానికి తీసుకున్న చర్యల గురించి అడిగినప్పుడు కేజ్రీవాల్ సమాధానం ఇవ్వకుండానే న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్.డి.ఎం.సి.) మీటింగ్ లోంచి వెళ్లి పోయారు. ఢిల్లీ, పంజాబ్ రెండిటిలోనూ ఉన్నది 'ఆప్' ప్రభుత్వమే కదా! సిగ్గు చేటు.
– అమిత్ మాల్వియా, బీజేపీ జాతీయ ఐటీ ఇన్‌చార్జి

పర్మిషన్ ఎవరిచ్చారు?



ఆమె ఎవరు? అసలు ఈ దేశంలో ఏం జరుగుతోంది! నటి కంగనా రనౌత్ ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయానికి వెళ్లి ఇజ్రాయెల్ రాయబారి నౌర్ గిలోన్‌ను కలవడం ఏమిటి?! ఆమె ఎమ్మెల్యే కాదు, ఎంపీ కాదు, సీఎం కాదు, మంత్రి కాదు, గవర్నర్ కూడా కాదు. ఎవరూ కాకుండా వెళ్లి ఇజ్రాయెల్‌కు సంఘీభావం ఎలా తెలియజేయగలిగారు?
– ఆయుష్ జైన్, మార్కెటింగ్ నిపుణుడు

కుటుంబం మొత్తాన్నీ!



గాజాలో న్యూస్ కవరేజీని సెన్సార్ చేయాలని యు.ఎస్. విదేశాంగ కార్యదర్శి బ్లింకెన్.. ఖతార్‌కు వర్తమానం పంపినట్లు వార్తలు వచ్చిన కొద్ది గంటల్లోనే యు.కె., యు.ఎస్., ఇ.యు.ల నుంచి అందిన ఆయుధాలతో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో గాజాలోని 'అల్-జజీరా' టీవీ కరస్పాండెంట్ వేల్ అల్-దహదౌహ్ భార్య, కొడుకు, కుమార్తె దుర్మరణం చెందారు!
– అఫ్షిన్ రత్తాన్సీ, బ్రిటిష్ జర్నలిస్ట్

ఇన్ బాక్స్

విద్యార్థి సంఘాలు కీలకం

నేటి విద్యా వ్యవస్థలో విద్యార్థి నాయకులు, విద్యార్థి సంఘాల ఆవశ్యకత చాలా ఉంది. విద్యావ్యవస్థలోని సమస్యలూ, లోపాలూ విద్యార్థులకు తెలిసినంతగా మరొకరికి తెలియవు. అటువంటి విద్యార్థులు సంఘటితమై తమ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నించడమే ఇప్పుడు నేరమై పోయినట్లు ప్రభుత్వాలు చిత్రిస్తున్నాయి. అయినా కొన్ని విద్యార్థి సంఘాలు విద్యార్థుల కోసం పోరాటాలు చేస్తున్నాయి. కానీ ఇదివరకు ఉన్నంత బలమైన విద్యార్థి ఉద్యమాలు ఇప్పుడు అంతగా కానరావడం లేదు.

ఒకప్పుడు విద్యార్థి నాయకులే కాల క్రమంలో రాజకీయ నాయకులుగా మారేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొన్ని దశాబ్దాలుగా విద్యార్థిలోకం నుంచి ఒక చెప్పుకోదగ్గ పెద్ద నాయకుడు ఎవరూ ఉద్భవించలేదని ఒక సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్య నేటి పరిస్థితికి అద్దం పడుతోంది. ఇందులో గురువుల తప్పు సైతం ఉంది. ఒక విద్యార్థి తన సమస్యను ముందు పెట్టినప్పుడు సర్దుకుపోవాలని నచ్చజెబుతున్నారు కానీ ఆ సమస్యను ఎలా పరిష్కరించాలో చెప్పడం లేదు.

విద్యార్థులను వ్యవస్థల్లో లోపాలకు అలవాటు పడేలా చేయడం వలన పట్టభద్రులు అయ్యాక వారు పనిచేసే వ్యవస్థల్లో కూడా సర్దుకుపోతున్నారు. దాని కారణంగా ప్రశ్నించే గుణం పోయి బానిస బ్రతుకు అలవడుతుంది. విద్యా వ్యవస్థలో మార్పులు అంటే కొత్త సిలబస్ కొత్త కోర్సులు కాదు... విద్యార్థుల్లో సమూల మార్పులు రావాలి. వారిలోని చైతన్యం వారు భవిష్యత్తులో పని చేసే వ్యవస్థలో కొత్త అధ్యాయాలు సృష్టించాలి. నేటి విద్యార్థుల్లో సామాజిక స్పృహ, నైతిక విలువలు, ప్రపంచ జ్ఞానం, దేశ సమస్యలు, దేశ రాజకీయాల వంటి విషయాల పట్ల అవగాహన కొరవడుతోంది.

పరిస్థితి మరింత దిగజార్చేలా ప్రభుత్వం విద్యార్థి సంఘాలకు విద్యాలయాల్లో ప్రవేశం లేదు అని ఉత్తర్వులు ఇచ్చింది. ఇది తప్పకుండా ప్రశ్నించే గొంతులను ఉక్కుపాదంతో అణచి వేసే చర్య. ప్రైవేటు వ్యక్తుల కోసం, ప్రభుత్వ స్వలాభం కోసం విద్యార్థి సంఘాలకు అనుమతి ఇవ్వకపోవడం సరైన చర్య కాదు.

– సభావట్ కళ్యాణ్, ఏబీవీపీ రాష్ట్ర నాయకులు

పాలమూరు సుగుణ... ప్రజల అరుణగా...

సందర్భం


ప్రొ॥ జి. హరగోపాల్

సుగుణ లాంటి త్యాగం చేసిన వాళ్లు ఉద్యమాలలో చాలామంది అమరులు ఉన్నారు. కానీ ఈమె జీవితంలో ఆచరణలో ఏదో విశిష్టత కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. విప్లవాలంటే ద్వేషం, ఆగ్రహం, హింస అని పాలకులు చేసే ప్రచారానికీ, బయట ఉండే చాలా మంది అనుకునే దానికీ భిన్నంగా ప్రేమ, ఆత్మీయత, స్నేహం, త్యాగం మనుషులంతా సుఖంగా జీవించాలని బలీయమైన ఆదర్శం... వీటిని ఆమె వ్యక్తిత్వంలో మనం చూడవచ్చు.

విప్లవోద్యమంలో స్త్రీల నాయకత్వం సరైన మేరకు లేదని చర్చ బయట జరుగుతున్నది. కానీ స్త్రీల నాయకత్వం ఎదగడానికి సుగుణలాంటి వారికి ఎన్ని రకాలు ఇబ్బందులు ఉంటాయో, పరిమితులు ఉంటాయో కానీ దాన్ని అధిగమించడానికి ఎంత దృఢమైన మానసిక సంసిద్ధత కావాలో అర్థం చేసుకుంటే తప్ప ఈ సమస్యకు సరిఅయిన సమాధానం దొరకదు. సుగుణ ఆరోగ్యమే సహకరిస్తే ఆమె సామాజిక మార్పులో మరింత గణనీయమైన పాత్ర నిర్వహించేదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

బయట ఉండే చాలామందికి ఉద్యమాలు అంటే తుపాకులు, దళాలు ఎంత సంఖ్యలో ఉన్నారు అని లెక్కలు వేసుకోవడం. సామాన్య ప్రజలు ఉద్యమకారులను చూసి భయపడతారు అనుకుంటారు. కానీ సుగుణ చెంచులతో మిళితమైన పద్ధతి చూస్తే, ఆహారపు అలవాట్ల నుండి సాంస్కృతిక జీవనం దాకా వాళ్ళతో పూర్తిగా కలిసిపోవడం అంటే మనుషులను నిరాఘాటంగా ప్రేమిస్తే తప్ప ఇది సాధ్యం కాదు. వాళ్ళ జీవనంలో జీవన విధానంలో కలిసే ఒక మనిషి అయినా, వేలాది మందిని కదిలించగలరనీ, వీళ్లకు ఇలాంటి మనుషుల పట్ల ఏర్పడిన విశ్వాసాన్నీ, నమ్మకాన్నీ... కొట్టో, తిట్టో, హింసించో మార్చగలమని రాజ్యం, పోలీసులు భావిస్తే అది ఎంత చారిత్రక తప్పిదమో సులభంగానే అర్థమవుతుంది.



వ్యక్తికీ, సమష్టికీ మధ్య దూరం తగ్గిన కొద్దీ మనుషులు కొత్తవారికైనా సుపరిచితులుగానే కనిపిస్తారు. నిజానికి మనిషినీ, మనిషినీ వేరు చేసేది అహం. ఈ అహం స్వప్రయోజనాలలో, భౌతిక సంబంధాలలో ప్రధానంగా ఆస్తి సంబంధాలలో మిళితమై ఉంటుంది. స్వప్రయోజనాన్నీ, సంపదనూ కాదని, అందరి మనుషుల ఆనందంలో సంతృప్తిలో తమ ఆనందాన్ని పంచుకునే వ్యక్తులకు ఏ మనిషితోనైనా, ముఖ్యంగా శ్రమ మీద ఆధారపడి బతుకుతున్న వారికి చాలా సులభంగానే సన్నిహితులు అవుతారు. కృత్రిమ ప్రపంచంలో బతుకుతున్న మధ్యతరగతికి ఇవన్నీ కొత్త అనుభవాలే. ఈ కృత్రిమత్వంలో నుండి సహజమైన మనిషిగా మారడం అంటే సాధారణ మనుషులు అసాధారణ మనుషులుగా మారడమే. సుగుణ జీవితంలో మనం స్పష్టంగా చూడగలిగింది ఈ ప్రక్రియే.

పాలమూరు జిల్లా భారతదేశంలోని అన్ని జిల్లాల కంటే చాలా వెనుకబడిన జిల్లా. కరవు, వలసలు పేదరికం అన్యాయము, అమాయకత్వం ఈ జిల్లా ప్రజల జీవనాన్ని నియంత్రిస్తున్నాయి. తెలంగాణ జిల్లాలు అన్నిట్లో చాలా వనరులు ఉండి కూడా వెనుకబడి ఉన్న జిల్లా పాలమూరు జిల్లా. దీనికి పాలకుల స్వార్థం ఒక కారణమైతే, ప్రజల అమాయకత్వం మరొక కారణం. నిరంతరంగా వలసలు పోవడం వలన ఈ జిల్లాలో బలమైన రాజకీయ ఉద్యమ నిర్మాణం లేదు. దాంతో ఈ జిల్లా చైతన్య స్థాయి ఇతర తెలంగాణ జిల్లాలతో పోలిస్తే కొంచెం తక్కువే. కానీ ఈ భౌతిక పరిస్థితులకు స్పందించే మనుషులు ఉంటే సుగుణ అరుణగా మారుతుందన్న సజీవ సాక్ష్యం సుగుణనే. పాలమూరు ప్రజల సమస్యలకు ఇప్పుడైనా ఒక పరిష్కారం దొరుకుతుందన్న విశ్వాసం, పరిష్కార మార్గం సుగుణ జీవిత క్రమంలో పాలమూరు ప్రజలు చూసుకుంటారు, వెతుక్కుంటారు అనే నమ్మకం కలుగుతున్నది.

అన్నింటికీ మించి సుగుణ జీవితాన్ని జ్ఞాపకాలను చదువుతుంటే మానవత్వం పునాదుల్లోకి, చరిత్ర మూలాల్లోకి వెళ్లినట్లే కాక చారిత్రక మార్పు రహస్యాలు అర్థమైన ఒక అనుభూతి కలుగుతుంది. ఈ జ్ఞాపకాలు మనిషిలోని మంచితనాన్ని వెలిగించి సామాజిక మార్పుకు తోడ్పడతాయని వినమ్రంగా రాయడం తప్పించి నాలాంటి వాళ్ళు సుగుణకి ఇచ్చే నివాళి మరేముంటుంది!

వ్యాసకర్త పౌరహక్కుల ఉద్యమకారుడు
('పాలమూరు నుంచి పల్నాటి దాకా' పుస్తకం నుంచి, ఎల్లుండి గద్వాల్‌లో సుగుణ 20వ వర్ధంతి సభ)

స్ఫూర్తి ప్రదాత

బయ్యా సూర్యనారాయణ మూర్తి మొదటి తరం దళిత నాయకులలో ఒకరు. ప్రస్తుతం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 'నగరం' గ్రామంలో 1906 అక్టోబర్ 29న జన్మించారు. అంటరాని తనాన్ని భరిస్తూనే చిన్నప్పటి నుంచీ చదువుపై ధ్యాస ఉంచి కాకినాడ 'బ్రహ్మసమాజం' శాఖ వారి సహాయంతో అప్పట్లోనే బీఏ, బీఈడీ, లా డిగ్రీలు సంపాదించారు. ఇంగ్లీష్‌లో ఆయనకు ఉన్న సామర్థ్యం కారణంగా ఎంతో ఎత్తుకు ఎదిగారు. జర్నలిస్ట్‌గా మారి 'ఆంధ్రా ప్రొవిన్షియల్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా వ్యవహరించారు. భారత జాతీయ కాంగ్రెస్ తరఫున ఆయన 1937 నుంచి 1952 వరకూ మద్రాస్ శాసన సభ సభ్యునిగా ఉన్నారు. మద్రాస్ ప్రభుత్వంలో పరిశ్రమలు, కార్మిక శాఖ మంత్రిగానూ పనిచేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటిష్ వాళ్లు రెండేళ్లు ఆయన్ని జైల్లో పెట్టారు.

1947లో తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయంలోకి దళితుల ప్రవేశం కొరకు ఉద్యమించి విజయం సాధించారు. 1944లో ఆయన దళిత కాలేజీ విద్యార్థుల కోసం 'ఎమ్‌సీ రాజయ్య మెమోరియల్ హాస్టల్'ను మద్రాస్‌లో స్థాపించారు. తరువాతి కాలంలో ఐఏఎస్ అయిన కత్తి చంద్రయ్య వంటి ఎందరో దళిత విద్యార్థులు ఈ హాస్టల్ వల్ల ప్రయోజనం పొందినవారే. మూర్తి 'నవజీవన' అనే తెలుగు వారపత్రికకు సంపాదకత్వం వహించారు. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ఆయన్ని మూడు నెలల పాటు ఉపన్యసించడానికి ఆహ్వానించింది. ఆయన అనేక గ్రంథాలు రాశారు. అందులో 'ఆంధ్ర వీర కుమార' ప్రసిద్ధిగాంచింది. 'అప్పికట్ల' అనే గ్రామంలో ఓ ఆధిపత్య కులంవారు దళితులను ఊరు నుంచి వెళ్లగొట్టారనే సంగతి మద్రాస్ నుంచి స్వగ్రామం వస్తున్న మూర్తికి తెలిసింది. దీంతో మంత్రిగా తనకున్న పలుకుబడితో దళితులను తిరిగి వారి గ్రామానికి పోలీసు రక్షణతో చేర్చారు. దళితుల కోసం ప్రత్యేకంగా గృహసముదాయాన్ని నిర్మింపచేశారు. దానికే 'మూర్తి రక్షణ నగర్' (ఎమ్ఆర్ నగర్) అని ప్రజలు పేరు పెట్టుకొన్నారు. ఆయన స్ఫూర్తితో ఎందరో దళితులు రాజకీయ రంగప్రవేశం చేసి ఎన్నో పదవులు అలంకరించారు.

– డా॥ అల్లూరి సుందర్ కుమార్ దాస్, విశ్రాంత ఐపీఎస్ అధికారి
(అక్టోబర్ 29న బి.ఎస్. మూర్తి జయంతి)

నేను పార్టీ మారడం లేదు

• రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ దుష్ప్రచారం: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్/ గద్వాల రూరల్: తాను పార్టీ మారుతున్నట్టు మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. పార్టీ మారే ప్రసక్తే లేదని గురువారం ఆమె ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరడం లేదని, ఆ పార్టీ నాయకులు పనిగట్టుకుని మైండ్‌గేమ్ ఆడుతున్నారని అరుణ మండిపడ్డారు. డీకే అరుణ కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం చేసుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితిలో ఆ పార్టీ ఉందని ఎద్దేవా చేశారు. విలువలు కలిగిన రాజకీయాలు చేసిన వ్యక్తిత్వమున్న నాయకురాలినని, పదవుల కోసమో, ఇంకా దేనికోసమో ఆశపడి మరో పార్టీలోకి వెళ్లే దానిని కాదన్నారు. బీజేపీలో తనకు తగిన గుర్తింపు కల్పిస్తూ పార్టీ జాతీయ నాయకత్వం జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇచ్చిందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో పని చేయడానికి అదృష్టం ఉండాలని, అది తనకు దక్కిందని తెలిపారు. కనీసం తన స్పందన తీసుకోకుండా మీడియాలో వార్తలు ఇవ్వడం సరైంది కాదని, తాను పార్టీ మారుతున్నట్లు మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని సూచించారు. మీడియా వాళ్లు తనకు సంబంధించి ఏవైనా వార్తలు రాసే సమయంలో తన వివరణ కూడా తీసుకోవాలని కోరారు. ఇకమీదట ఎవరైనా మీడియా, సోషల్ మీడియా వాళ్లు తనపై తప్పుడు వార్తలు ఇస్తే పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీకి బైనాక్యులర్ గుర్తు

• మరో గుర్తు కేటాయించాలని ఈసీకి వినతి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌టీపీకి బైనాక్యులర్ గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించింది. తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న వైఎస్సార్‌టీపీకి 119 నియోజకవర్గాలకుగాను ఉమ్మడి గుర్తుగా బైనాక్యులర్‌ను కేటాయిస్తూ గురువారం ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎన్నికల సంఘం కేటాయించిన బైనాక్యులర్ గుర్తుపై ఆ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ గుర్తు వల్ల పార్టీ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున మరోగుర్తు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి విన్నవించుకున్నట్టు వైఎస్సార్‌టీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owners as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SHRI PRODDATURI SANDEEP KUMAR	SHRI MAHAVIR PRASAD S/O LATE MANIRAM	PNO 17/FF, NEW VASAVI COLONY, KAKAGUDA	SALE DEED DOC NO 1776/2023, DT 29-09-2023
2	SHRI PRODDATURI SANDEEP KUMAR	SHRI MAHAVIR PRASAD S/O LATE MANIRAM	PNO 17/GF, NEW VASAVI COLONY, KAKAGUDA	SALE DEED DOC NO 1776/2023, DT 29-09-2023
3	SHRI LAGISHETTY PRASAD KUMAR	SMT POLEBOYENA VIJAYA LAXMI W/O POLEBOYENA LAXMINARAYANA	FNO106/FF,ADITYA ARCADE, KAKAGUDA	SALE DEED NO 1181/2023, DT 26-06-2023 (LINK DOCUMENTS)
4	SMT CH KAMALA	SHRI A INDRASENA REDDY S/O A LAXMA REDDY	29/A/FF/SF P&T COLONY, TRIMULGHERRY	GIFT DEED No 567/2023, DT 29-03-2023 (LINK DOCUMENTS)
5	SMT A SWARNALATHA W/O A INDRASENA REDDY	SHRI A INDRASENA REDDY S/O A LAXMA REDDY	29/B/GF/FF/SF P&T COLONY, TRIMULGHERRY	GIFT DEED No 566/2023, DT 29-03-2023 (LINK DOCUMENTS)
6	1)SHRI B ASHWIN REDDY 2)SMT B KRISHNA KUMARI	KUM B TANEESHA REDDY D/O LATE B ASHWIN REDDY	59/1/2/ADJ KOUSALYA CLY, KAKAGUDA	WILL DEED NO 70/BK-III/2021, DT 06-04-2021 (LINK DOCUMENTS), DEATH CERTIFICATE OF KRISHNA KUMARI BOLLUMPALLY
7	1)SHRI B ASHWIN REDDY 2)SMT B KRISHNA KUMARI	KUM B TANEESHA REDDY D/O LATE B ASHWIN REDDY	59/1/2 ADJ KOUSALYA COLONY, KARKHANA	WILL DEED NO 70/BK-III/2021, DT 06-04-2021(LINK DOCUMENTS), DEATH CERTIFICATE OF KRISHNA KUMARI BOLLUMPALLY
8	1)SHRI B ASHWIN REDDY 2)SMT B KRISHNA KUMARI	KUM B TANEESHA REDDY D/O LATE B ASHWIN REDDY	SY NO 129/1, THOKATTA VILLLAGE,BOWENPALLY	WILL DEED NO 70/BK-III/2021, DT 06-04-2021(LINK DOCUMENTS), DEATH CERTIFICATE OF KRISHNA KUMARI BOLLUMPALLY
9	SMT B KRISHNA KUMARI	KUM B TANEESHA REDDY D/O LATE B ASHWIN REDDY	1-12-195/P CHINNA THOKATTA, BOWENPALLY	WILL DEED NO 70/BK-III/2021, DT 06-04-2021(LINK DOCUMENTS), DEATH CERTIFICATE OF KRISHNA KUMARI BOLLUMPALLY
10	SHRI B ASHOK REDDY	B TANEESHA REDDY D/O LATE B ASHWIN REDDY	1-12-0105, CHINNA THOKATTA, BOWENPALLY	WILL DEED NO 70/BK-III/2021, DT 06-04-2021(LINK DOCUMENTS), DEATH CERTIFICATE OF KRISHNA KUMARI BOLLUMPALLY
11	SHRI M BHUSHANAM	BABY PULIGILLA SAANVI—MINOR BY NATURAL GURDIAN MOTHER SMT PULIGILLA PRATHIMA	FNO 204/FF HONEST ARCADE, MARREDPALLY	SALE DEED NO 1508/2023 DT 18-08-2023 (LINK DOCUMENT)
12	SHRI SYED KHADER PASHA	SHRI PODISHETTY NARESH S/O PODISHETTY VENKATESH	FNO 102/FF, SYNO 27 SJR COMPLEX,JAYA NAGAR, NEW BOWENPALLY	SALE DEED NO 1740/2023 DT 12-09-2023 (LINK DOCUMENTS), DEATH CERTIFICATE OF SYED KHADER PASHA
13	SMT G S LAKSHMI	1) SHRI KALLAKURI SUBRAHMANYAM 2) G SREENIVAS 3) G VENUGOPAL	PNO A-6/GF/FF VIKRAMPURI CHS, (VENT A), KARKHANA	WILL DEED 56/8-III/2013 DT 27-05-2013
14	SHRI BHUDEV KUMAR	SMT USHA DEVI W/O BHUDEV KUMAR	HNO 1-27-361/C, BALAMRAI	SETTLEMENT DEED NO 813/2022 DT 30-04-2022, SETTLEMENT DEED NO 814/2022 DT 30-04-2022
15	SMT M PRASANNA LATHA	SHRI MALOTH NARENDER NAIK S/O MALOTH SANGIAH	FNO 1/FF, PRAGATHI APRT, CHINNATHOKATTA, BOWENPALLY	SALE DEED NO 1634/2023, DT 05-09-2023 (LINK DOCUMENT)
16	SHRI RAMESH CHANDRA MURTHY GULLAPALLY	SMT ANJU BIPIN KUMAR PATEL W/O BIPIN KUMAR RAMESH BHAI PATEL	FNO 106/GF, B-BLK, PNO7,11,12, SHRI SAI SRINIVASA ESTATES, SHRI SAI NILAYAM, WEST MARREDPALLY	SALE DEED NO 1851/2021, DT 29-09-2022, GENERAL POWER OF ATTORNEY 1648/2019, DT 23-09-2019 (LINK DOCUMENT)
17	SHRI B RAMUDU	SMT BAGU VIDYA RANI D/O BAGU RAMUDU	18/FNO 2/FF, TEACHERS CHS, LOTHUKUNTA	SALE DEED NO 1441, DT 04-10-2008; SETTLEMENT DEED NO 1731/2023 DT 21-09-2023
18	SHRI SANJEEB KUMAR PADHEE	SHRI SAMANTHAPUDI SRINIVASA RAJU S/O SAMANTHAPUDI KOTAM RAJU	FNO 2/GF, SAIL COLONY, BAPUJI NAGAR, SECUNDERABAD	SALE DEED NO 1140/2023, DT 21-06-2023 (LINK DOCUMENT)
19	SHRI KATAM SANJAY GOUD	SHRI R VIKAS KUMAR S/O LATE SRI R SHANKER LAL	225/A/F&GF, RUKMINI DEVI COLONY, MARREDPALLY	SALE DEED NO 1652/2023, DT 12-09-2023
20	SHRI K C JAIN	SHRI KAPIL KUMAR JAIN S/O KASTOOR CHAND JAIN	PNO 8/GF, ICRISAT COLONY (II)-HASMATHPET	GIFT DEED NO 705/2022, DT 18-04-2022 (LINK DOCUMENT)
21	SHRI D APPA RAO	SHRI DADI VENKATA CHANDRA PRASAD S/O DADI APPA RAO	PNO A-8/GF/FF, VIKRAMPURI CHS, VENT-A, KARKHANA	WILL DEED NO 49/09.BK-III,DT 29-06-2009 DEATH CERTIFICATE OF D APPA RAO AND D VIJAYA (LINK DOCUMENT)
22	SHRI K ODALAIAH	SHRI BALSU SAMPATH KUMAR S/O SRI RAMESH BALSU	SHOP NO 3/ST/GF, BHEEMA HOMES, DHANA LAXMI COLONY, BOWENPALLY	SALE DEED NO 1615/2023, DT 02-09-2023 SALE DEED NO 2002/2015, DT 02-06-2015 (LINK DOCUMENT), DEATH CERTIFICATE OF K ODALAIAH
23	SMT K MADHAVI	SMT RAJITHA AKARAPU D/O SRI RAJAIAH	4/FNO 203/FF, ANAND NAGAR, BOWENPALLY	SALE DEED NO 846/2023, DT 09-05-2023 (LINK DOCUMENT)
24	SMT K DAMAYANTI	1) SMT JULOORI PADMA PRIYA 2) SMT PRATIMA KATTA	PNO C-4/GF/FF, VIKRAMPURI CHS, VENT C, KARKHANA	SETTLEMENT DEED NO 1167/2023, DT 26-06-2023 (LINK DOCUMENT)
25	SMT RAJSHREE SUTRAVE	1) SHRI SANJAY JAIN 2) VANDANA JAIN	PNO 50/CF/GF/FF/SF, P & T COLONY, TRIMULGHERRY	SALE DEED NO 1557/2023, DT 24-08-2023
26	SHRI A N S SARMA	SHRI A MANNOJ KARTHHEK S/O A N S SARMA	FNO 102/FF, A G ARCADE (SRI BALAJI) ON PNO 54, KARKAHANA	SETTLEMENT DEED NO 4940/2016, DT 17-12-2016
27	SRI K CHANDRAN	SRI RACHAMALLA VINOD PRAVALIKA S/O R VINOD KUMAR	PNO 19/1/GF RAVI CHS TRIMULGHRRY	SALE DEED NO 944/2022 DT 21/05/2022
28	SMT LINGA JYOTHI	MR MADUGULA VEDA PRAKASH S/O MADUGULA SHAM PRAKASH	PNO 3,SY NO 3 TO 7,FNO 401/TF, ANJANA TOWERS, SHANTHI DEEP HOUSING COLONY, KAKAGUDA	SALE DEED NO 811/2023 DT 05-05-2023 (LINK DOCUMENT)
29	SMT A BHARATHI LAKSHMI	1.MR MAHESH SARDA 2. MR RAMESH KUMAR SARDA 3. SMT PRAKASH SARDA	PNO 5/F/GF/FF, AMARJYOTHI CHS, BOWENPALLY	SALE DEED NO 1070/2017, DT 09-08-2017, SALE DEED NO 1069/2017, DT 09-08-2017 (LINK DOCUMENT)
30	1.SHRI A INDRASENA REDDY 2.SMT A SWARNALATHA REDDY 3.SMT A SRAVANTHI	SMT A SRAVANTHI D/O A INDRASENA REDDY	15/GF/FF/SF, RAVI CHS, TRIMULGHERRY, SECUNDERABAD	GIFT DEED NO 1811/2023, DT 05-10-2023, GIFT DEED NO 1812/2023, DT 05/10/2023, SALE DEED NO 1410/2001, DT 10-05-2001

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office .

No. SCB/TB/2400, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003.
Date : 26-10-2023

Sd/-
Chief Executive Officer,
Secunderabad Cantonment Board

1న బీజేపీ రెండో జాబితా!

• నామినేషన్ల దాఖలు సమయంలో తుది జాబితా?
• జనసేనతో చర్చల నేపథ్యంలో రెండో జాబితా ఆలస్యం
• 32 సీట్లు కోరిన జనసేన.. 10 వరకు కేటాయించే అవకాశం
• బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి



సాక్షి, హైదరాబాద్: బీజేపీ అభ్యర్థుల రెండో జాబితా వచ్చేనెల 1న విడుదలయ్యే అవకాశాలున్నాయి. జనసేనతో పొత్తు చర్చలు, ఆ పార్టీకి కేటాయించే సీట్లపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రెండో జాబితా ప్రకటనకు మరో నాలుగైదు రోజులు పట్టొచ్చునని పార్టీవర్గాల సమాచారం. కాగా 1న కూడా మిగిలిన అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు లేవని సమాచారం. నామినేషన్ల దాఖలు మొదలయ్యే నవంబర్ 3, 4 తేదీల నాటికి పార్టీ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న సీట్లు పది, పన్నెండు సీట్లతో తుది జాబితా వెలువడే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

అసలు బలమే లేని పార్టీతో పొత్తా?

జనసేనతో పొత్తు, ఆ పార్టీతో కలిసి ఉమ్మడి పోటీ తప్పదనే సంకేతాలు రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలే ఇస్తుండగా..దీనిపై పార్టీ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమౌతోంది. రాష్ట్రంలో బలమే లేని ఆ పార్టీతో పొత్తు బీజేపీకి నష్టదాయకమంటూ అంతర్గతంగా చర్చ సాగుతున్నట్టు తెలుస్తోంది. జనసేన నేతలతో తొలుత హైదరాబాద్‌లో, ఆ తర్వాత ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో చర్చల నేపథ్యంలో ఆ పార్టీకి పదిలోపు సీట్లు కేటాయించే అవకాశాలున్నట్టు పార్టీ నాయకుల సమాచారం. గురువారం కూడా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ సమావేశమై జనసేనకు కేటాయించే సీట్లపై మరోదఫా చర్చించినట్టు తెలిసింది.

కూకట్‌పల్లి ఖరారు!

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, నగరంలో మరో సీటు, ఉమ్మడి ఖమ్మం, ఇతర జిల్లాల పరిధిలో కలిపి మొత్తం 32 సీట్లు కేటాయించాల్సిందిగా బీజేపీకి జనసేన ప్రతిపాదించింది. వీటిలో కూకట్‌పల్లి సీటు ఖరారు కాగా, శేరిలింగంపల్లి సీటుపై ప్రతిష్టంభన కొనసాగుతున్నట్టు, ఉమ్మడి ఖమ్మం పరిధిలో, ఇతర జిల్లాల పరిధిలో మరికొన్ని సీట్లు ఇచ్చేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. జనసేనకు కేటాయించిన సీట్లు పోను మిగతా స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసి ముందుగా రెండో జాబితా, ఆ తర్వాత చివర్లో మూడో జాబితా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు.

శేరిలింగంపల్లి యోగానంద్‌కే కేటాయించాలి

శేరిలింగంపల్లి బీజేపీ సీటును గజ్జల యోగానంద్‌కే కేటాయించాలని కోరుతూ గురువారం నాంపల్లిలోని పార్టీ ఆఫీసు ఎదుట ఆయన అనుచరులు కొందరు నినాదాలు చేశారు. సీట్ల సర్దుబాటులో భాగంగా ఆ సీటును జనసేనకు ఇవ్వొద్దని కోరారు. అయితే ఈ విధంగా ప్లకార్డులతో హడావుడి చేయడం మంచి పద్ధతి కాదని, యోగానంద్‌నే వచ్చి కలవమని చెప్పాల్సిందిగా కిషన్‌రెడ్డి వారికి చెప్పారు.

త్యాగాల తెలంగాణ కేసీఆర్ కుటుంబం కోసమా?

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందర్నీ మోసం చేసింది

• సీఎం కేసీఆర్ హామీలేవీ నెరవేర్చలేదు
• కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం
• పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరిన ముధోల్ బీఆర్‌ఎస్ నేతలు



గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: త్యాగాలు చేసి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ కుటుంబానికి పదవులు ఇవ్వడం కోసమా? అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకోవడానికి తెలంగాణ వచ్చిందా? అని నిలదీశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులు, యువకులు, దళితులను మోసం చేసిందని ఆరోపించారు. కౌలు రైతులను, నిరుద్యోగులను సైతం పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని, ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మాయచేసి ఓట్లు దండుకునేందుకు ఇప్పుడు కొత్త వాగ్దానాలు గుప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. భైంసాలో మజ్లిస్ గూండాలు అరాచకం చేస్తున్నారని, ఒక్కోసారి మనం భైంసాలో ఉన్నామా? పాకిస్తాన్‌లో ఉన్నామా? అనే అనుమానాలు కలిగే పరిస్థితులున్నాయన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ముధోల్ బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్ ఆధ్వర్యంలో ముధోల్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు బీజేపీలో చేరారు. వీరిలో నలుగురు జెడ్పీటీసీలు, ఇద్దరు ఎంపీపీలు, 10 మంది ఎంపీటీసీలు, 10 మంది సర్పంచ్‌లతో పాటు రైతు సమన్వయ సమితి నేతలు, పీఏసీఎస్ చైర్మన్లు, నలుగురు మాజీ జెడ్పీటీసీలు, నలుగురు మాజీ ఎంపీపీలు, మరో 20 మంది వరకు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు. వారికి కిషన్‌రెడ్డి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఈ పాపం ఎవరిది?

'డెబ్బై శాతం పూర్తయిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనబెట్టి కమీషన్ల కోసం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయాయి. లక్షా ఇరవై వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారు. ఈ పాపం ఎవరిది?' అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పదేళ్లలో ఇప్పటివరకు ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేని చేతగాని ప్రభుత్వం కేసీఆర్‌దని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తనకు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తూ వివిధ రంగాల కార్మికులు, సకల జనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిణామాలు చూశాక తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. తెలంగాణకు ప్రధాని మోదీ పసుపు బోర్డు ప్రకటించారని గుర్తు చేశారు. కేంద్రం ఎరువులు అందజేస్తోందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తోందని, రైతులు పండించిన పంటలను రూ.20 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టి కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, ప్రజలు మోదీ నాయకత్వానికి అండగా ఉండాలని, తెలంగాణలో బీజేపీని ఆశీర్వదించాలని కోరారు.

ఓటమి భయంతోనే వివేకానంద దాడి

శ్రీశైలం గౌడ్‌కు పోలీసులు ఎందుకు భద్రతనివ్వడం లేదు: బండి సంజయ్



కుత్బుల్లాపూర్: ఓడిపోతామనే భయం, అసహనంతోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌పై దాడి చేశారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఓ న్యూస్ చానల్ నిర్వహించిన ఎన్నికల చర్చలో వివేకానంద, శ్రీశైలంగౌడ్ మధ్య వివాదం రేగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని నివాసంలో సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా దాడులకు తెగబడుతున్నారని.. తమ సహనాన్ని చేతగాని తనంగా భావించొద్దని హెచ్చరించారు. '"పేరేమో వివేకానంద కానీ చేష్టలేమో ఔరంగజేబును తలపిస్తున్నాయని' బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేని ఉద్దేశించి విమర్శించారు. భౌతిక దాడులు జరిగే అవకాశముందని ముందే సమాచారం వచ్చినా పోలీసులు ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని సంజయ్ ప్రశ్నించారు. బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌కు ఎందుకు భద్రత ఇవ్వడం లేదని నిలదీశారు. వివేకానందను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

క్షణికావేశంతో అలా చేశాను


ఘటన దురదృష్టకరం.. చింతిస్తున్నా: వివేకానంద్



వివేకానంద్

కుత్బుల్లాపూర్: సూరారం రామ్‌లీలా మైదానంలో బుధవారం చర్చావేదిక సందర్భంగా చోటు చేసుకున్న ఘటన దురదృష్టకరమని, దీనికి చింతిస్తున్నానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, చర్చాగోష్టి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ తనపై వ్యక్తిగత ఆరోపణలకు దిగడంతో పాటు రాజకీయ కురువృద్ధుడు, ఎంతోమందికి రాజకీయ గురువైన తన తండ్రి కె.ఎం.పాండుపై సైతం దూషణలు చేశారని, దీంతో తట్టుకోలేకనే క్షణికావేశంతో అలా చేశానని వెల్లడించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు ఉందన్నారు. తాను జరిగిన ఘటనకు ఎంతో బాధ పడుతున్నానని, చర్చల సందర్భంగా వ్యక్తిగత దూషణలకు తావులేకుండా ఆరోపణలు చేస్తే బాగుంటుందని చెప్పారు. ప్రజాక్షేత్రంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని, వారికి తాను జవాబుదారీగా ఉంటానన్నారు.

జై స్వరాజ్ పార్టీ మొదటివిడత అభ్యర్థుల ప్రకటన



తొలిదశ జాబితా ప్రదర్శిస్తున్న అభ్యర్థులు

పంజగుట్ట (హైదరాబాద్): పేదరికంలేని సమాజ నిర్మాణమే తమ పార్టీ లక్ష్యమని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాస్ రావుగౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ మొదటి విడత 11 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించారు.

జై స్వరాజ్ పార్టీ ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు..: పాలేరు నియోజకవర్గం నుంచి కాసాని శ్రీనివాస్‌రావు గౌడ్, స్టేషన్ ఘన్‌పూర్- కె.అర్జున్, ఆసిఫాబాద్- కె.తారాచంద్, హుస్నాబాద్ -పరశురాములుగౌడ్, మంచిర్యాల- జి.మల్లారెడ్డి, బెల్లంపల్లి- కొమరేష్, మల్కాజ్‌గిరి- రమేశ్ గౌడ్, కంటోన్మెంట్- జి.వెంకటస్వామి, చొప్పదండి- బాబన్న, మానకొండూరు- దేవదాసు, సిరిసిల్ల- కొన శ్రీనివాస్‌ను అభ్యర్థులుగా ప్రకటించారు.

ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థుల రెండో జాబితా విడుదల



అభ్యర్థుల రెండవ జాబితాను ప్రకటిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్

కాచిగూడ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) 25 మందితో ఎమ్మెల్యే అభ్యర్థుల రెండవ జాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ప్రకటించారు. గురువారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇప్పటికే 53 మంది ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించామన్నారు. 93% ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల తరఫున నిలబడే ఏకైక పార్టీ 'ధర్మ సమాజ్ పార్టీ'అని అన్నారు. టార్చ్‌లైట్ గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సబ్బండ కులాల ప్రాంతీయ పార్టీ డీఎస్‌పీకి మద్దతుగా నిలవాలని తెలంగాణ ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. బోథ్ (ఎస్టీ)- ఉక్కె ఉమేశ్, మంచిర్యాల - వై.రమేశ్, ఎల్లారెడ్డి - ఎస్.లక్ష్మయ్య, జుక్కల్ (ఎస్సీ) - పి.భూమయ్య, బాన్సువాడ - తోట శ్రీకాంత్, నిజామాబాద్ అర్బన్ - రచ్చ అంజనేయులు, బోధన్ - శ్యామ్ మురళీ, మునుగోడు -ఇ.గాలయ్య, తుంగతుర్తి (ఎస్సీ)- దాసరి బాలస్వామి, హుస్నాబాద్ - బి.సదన్ మహారాజ్, నారాయణ్‌ఖేడ్- ఎ.జీవన్, గజ్వేల్ - బొగ్గ రాజు, నాగర్‌కర్నూల్ - అరవింద్ దనోజు, దేవరకద్ర - బి.జంగయ్య ముదిరాజ్, హుజురాబాద్ - చిలువేరు రాకేశ్, చొప్పదండి - జంగం సాదన, రామగుండం - పులిపాక రాజు, తాండూరు- శ్రీశైలం ముదిరాజ్, యాకుత్‌పుర - ఎం.సైదులు, సనత్‌నగర్ -మెడి కార్తీక్, అంబర్‌పేట- నల్ల ఉదయ్‌కుమార్, ఖైరతాబాద్ - మిద్దె కృష్ణ, కూకట్‌పల్లి- ఎస్.సునీల్‌కుమార్, దేవరకొండ (ఎస్టీ) - గుగులోతు రవినాయక్, హుజూర్‌నగర్ - అవిరెండ్ల జ్యోతిలను ప్రకటించారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను ఎండగట్టండి: అమిత్‌షా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆరాతీశారు. ఎన్నికల నేపథ్యంలో తలెత్తిన పరిణామాలు, అధికార బీఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పరిస్థితి తదితర అంశాలపై రాష్ట్ర నేతలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సర్కార్‌పై ఉన్న ప్రజావ్యతిరేకతను బలంగా ఎండగట్టాలని, కాంగ్రెస్ వ్యవహారశైలి, కర్ణాటక ఎన్నికల్లో గెలిచాక ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేక ఆ పార్టీ వేస్తున్న పిల్లిమొగ్గలను ప్రజలకు సమర్థవంతంగా వివరించాలని రాష్ట్రనేతలకు సూచించినట్టు సమాచారం. అమిత్‌షా గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులోఆయనకు బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు, తమిళనాడు సహ ఇన్‌చార్జీ పొంగులేటి సుధాకరరెడ్డి, బండి సంజయ్, రాజాసింగ్ స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కొంత ఆలస్యంగా చేరుకోవడంతో అమిత్‌షా ఆయనను తన కారులోకి ఎక్కించుకున్నారు. నేషనల్ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఐపీఎస్‌ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొనేందుకు వచ్చినందున అమిత్‌షా అక్కడి నుంచి ఎన్‌పీఏకు బయలుదేరారు. ఆ తర్వాత అమిత్‌షాతో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాజాసింగ్ సమావేశమయ్యారు. కాగా, శుక్రవారం సూర్యాపేటలో జరగనున్న బీజేపీ జనగర్జనసభలో అమిత్‌షా పాల్గొననున్నారు. అమిత్‌షా మధ్యాహ్నం 3.45 గంటలకు హెలికాప్టర్‌లో సూర్యాపేటకు వెళతారు. సభ ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు. కాగా, సూర్యాపేటలో జరగనున్న జనగర్జన సభ ఏర్పాట్లను ఆయన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పరిశీలించారు.

గవర్నర్‌గా ఇంద్రసేనారెడ్డి ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: త్రిపుర గవర్నర్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డి గురువారం ఉదయం అగర్తలాలో బాధ్యతలు స్వీకరించారు. ఇంద్రసేనారెడ్డితో త్రిపుర హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఆపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం రాజభవన్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహ, సీనియర్ అధికారులతో ఇంద్రసేనారెడ్డి భేటీ అయ్యారు. అక్కడ అమలవుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాల గురించి సీఎం వివరించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ అధికారులు పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. సాధారణ పౌరులు సైతం సాధికారత సాధించేలా అంతా కృషి చేయాలని కోరారు. తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన అభిమానులు పూలదండలతో ఇంద్రసేనారెడ్డిని సత్కరించారు. అనంతరం రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులు తేనేటి విందు ఇచ్చారు. కార్యక్రమానికి సీఎం మాణిక్ సాహ, మంత్రులు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్రం నుంచి మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, ఎం.ధర్మారావు, పార్థసారథి, పార్టీ నేతలు వై.సత్యకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవీంద్రరాజు, డా.జి.మనోహర్‌రెడ్డి, డా. ఎస్.ప్రకాశ్‌రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, జయశ్రీ,, పల్లె గంగారెడ్డి, కళ్లెం బాల్‌రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. బుధవారం గవర్నర్ దంపతులు అగర్తలా చేరుకున్నప్పుడు విమానాశ్రయంలో సీఎం మాణిక్ సాహ, మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

త్వరలో మేనిఫెస్టో ప్రకటిస్తాం

• పార్టీలో టికెట్ల కోసం పోటీ తీవ్రంగా ఉంది: జి.కిషన్‌రెడ్డి
• జనసేనతో పొత్తు ఖరారైందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలపై, కేసీఆర్ ప్రభుత్వం, అధికార బీఆర్‌ఎస్‌పై బీజేపీ వేయనున్న చార్జిషీట్లు వంటి వాటిపై కసరత్తు దాదాపు పూర్తయిందని కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే ముసాయిదా ప్రతులను పార్టీ జాతీయ నాయకత్వం వద్దకు తీసుకెళ్తామని చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ఆమోదం పొందాక మేనిఫెస్టోను ప్రకటిస్తామన్నారు. గురువారం కిషన్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేనతో పొత్తు ఖరారైందని, బీజేపీ-జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తాయని చెప్పారు. సీట్ల కేటాయింపుపై చర్చలు సాగుతున్నాయని, ఆ పార్టీకి పదిదాకా సీట్లు కేటాయించే అవకాశముందన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో జరిగే పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో రెండోవిడత అభ్యర్థుల జాబితాపై చర్చిస్తామని చెప్పారు. అప్పుడే మేనిఫెస్టో, ప్రచారం తదితర అంశాలపై స్పష్టత వస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్‌పై వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని చెప్పారు. తెలంగాణ ప్రజలు మార్పు కావాలని గట్టిగా కోరుకుంటున్నారని, కేసీఆర్ అవినీతి, కుటుంబ, నిరంకుశ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామన్నారు. ఎన్నికల్లో పోటీ కోసం పార్టీలో తీవ్రమైన పోటీ నెలకొందని, కొన్నిచోట్ల అభ్యర్థుల ఎంపిక కూడా కష్టతరంగా మారుతోందని చెప్పారు.

రామాలయం నుంచి వారిని దూరం పెట్టండి

దేశ చరిత్రను, నాగరికత విలువలను, హిందువులను, హిందుత్వాన్ని నిర్లక్ష్యం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ భాగస్వామి అయిన తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీ శ్రీరాముడి అస్థిత్వాన్నే ప్రశ్నిస్తూ ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. అందుకే సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పని చేస్తున్న శక్తులను రామాలయం నుంచి దూరంగా ఉంచాలని శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర వారిని కోరుతున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



గాజా ఉక్కిరి బిక్కిరి

ఖాన్ యూనిస్ పట్టణంలో తాగు నీటి కోసం గుమిగూడిన జనం



గాజాలోని ఐక్యరాజ్యసమితి శిబిరంలో ఆహారం కోసం వేచిచూస్తున్న నిరాశ్రయులు



అదే శిబిరంలో ఎట్టకేలకు ఆహారం దొరకడంతో ఆనందపడుతున్న ఓ బాలిక



దక్షిణ గాజా స్ట్రిప్‌లో స్టాక్ అయిపోవడంతో వెలవెలబోతున్న పెట్రోల్ బంక్



ఖాన్ యూనిస్ పట్టణంలో కరెంట్ కొరతతో దొరికిన చోటే మొబైల్ చార్జింగ్ పెట్టుకుంటున్న పాలస్తీనియన్లు

గాజాపై భూతల దాడులు

ఉత్తర గాజాలోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ పదాతి దళాలు, యుద్ధ ట్యాంకులు

- స్వల్పస్థాయిలో దాడులు.. పలువురు మిలిటెంట్లు హతం!
- అతిత్వరలో పూర్తిస్థాయి యుద్ధం
- గాజాపై 24 గంటల వ్యవధిలో 250 వైమానిక దాడులు

రఫా/వాషింగ్టన్: ఇజ్రాయెల్‌–హమాస్ యుద్ధం మరో కీలక దశలోకి ప్రవేశించింది. ఊహించినట్లుగానే ఇజ్రాయెల్ సైన్యం ఉత్తర గాజాపై భూతల దాడులు ప్రారంభించింది. హమాస్ స్థావరాలను నేలమట్టం చేయడానికి ఇజ్రాయెల్ పదాతి దళాలు, యుద్ధ ట్యాంకులు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సరిహద్దు దాటి గాజా భూభాగంలోకి అడుగుపెట్టాయి. 'లక్ష్యాల'పై స్వల్పస్థాయిలో దాడులు నిర్వహించాయి. గురువారం తెల్లవారుజాము వరకూ ఈ దాడులు కొనసాగాయి. ఉత్తర గాజాపై అతిత్వరలో పూర్తిస్థాయి భూతల యుద్ధం ప్రారంభం అవుతుందని ఇజ్రాయెల్ సైన్యం సంకేతాలిచ్చింది. యుద్ధక్షేత్రాన్ని సిద్ధం చేయడానికే స్వల్పంగా భూతల దాడులు చేశామని గురువారం వెల్లడించింది. చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని, హమాస్ మౌలిక సదుపాయాలను, ఆయుధ వ్యవస్థను ధ్వంసం చేశామని పేర్కొంది. గత 24 గంటల్లో గాజాపై దాదాపు 250 వైమానిక దాడులు చేశామని ప్రకటించింది. గాజాలో సహాయక చర్యలకు ఆటంకాలు సృష్టించవద్దని, భూతల దాడులను విరమించుకోవాలని ఐక్యరాజ్యసమితి విజ్ఞప్తి చేసినా ఇజ్రాయెల్ సైన్యం లెక్కచేయకపోవడం గమనార్హం.

ప్రాణనష్టం.. ఊహించలేం

పాలస్తీనా మిలిటెంట్ సంస్థ 'హమాస్' 2007 నుంచి గాజాలో అధికారం చెలాయిస్తోంది. ఈ నెల 7న ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా విరుచుకుపడింది. భారీ సంఖ్యలో రాకెట్లు ప్రయోగించింది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా సామాన్య ప్రజలు, సైనికులు మరణించారు. తమ భద్రతకు సవాలు విసురుతున్న హమాస్‌కు బుద్ధి చెప్పడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ఎదురుదాడికి దిగింది. గాజాపై వైమానిక దాడులు ప్రారంభించింది. ఇరుపక్షాల మధ్య గత 20 రోజులుగా హోరాహోరీ యుద్ధం కొనసాగుతోంది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,000 మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాతపడ్డారు. వీరిలో 2,900 మంది చిన్నపిల్లలు, 1,500 మంది మహిళలు ఉన్నారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. పూర్తిస్థాయిలో భూతల దాడులు మొదలైతే గాజాలో ప్రాణనష్టం ఊహించని స్థాయిలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఖాన్ యూనిస్‌లో 15 మంది బలి

ఇజ్రాయెల్ సైన్యం గురువారం ఉత్తర గాజాపై భూతల దాడులతోపాటు దక్షిణ గాజాలో వైమానిక దాడులను కొనసాగించింది. ఈ దాడుల్లో ఖాన్ యూనిస్ సిటీలో 8 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 15 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. సామాన్య ప్రజలకు హాని కలిగించడం లేదని, కేవలం హమాస్ స్థావరాలపైనే దాడుల చేస్తున్నామని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. మరోవైపు మిలిటెంట్లు సైతం ఇజ్రాయెల్‌పై రాకెట్ దాడులు కొనసాగిస్తున్నారు. తాజాగా సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని పెటా తిక్వా నగరంపై రాకెట్ ప్రయోగించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు.

మానవతా సాయం అంతంత మాత్రమే

గాజాలో ఆహారం, నీరు, ఔషధాలు, నిత్యావసరాలు లేక జనం పిట్టల్లా రాలిపోతుండడంతో ఇజ్రాయెల్‌పై ప్రపంచదేశాలు ఒత్తిడి పెంచాయి. ఇజ్రాయెల్ అనుమతితో ఈజిప్టు నుంచి ఇప్పటివరకు 70కి పైగా వాహనాలు గాజాలోకి అడుగుపెట్టాయి. ఈజిప్టు నుంచి అందుతున్న మానవతా సాయం ఏ మూలకూ చాలడం లేదని గాజా అధికారులు చెబుతున్నారు. ఈ సాయం సముద్రంలో నీటిబొట్టంత అని గాజాలోని ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ ద రెడ్ క్రాస్ ప్రతినిధి విలిమయ్ షోమ్‌బర్గ్ అన్నారు. ఆకలితో అలమటించిపోతున్న ప్రజల ప్రాణాలు నిలబెట్టాలంటే ఇంకా ఎన్నో రెట్ల సాయం కావాలని కోరారు.

అల్‌–జజీరా జర్నలిస్టు భార్య, పిల్లలు మృతి

గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో బుధవారం అంతర్జాతీయ మీడియా సంస్థ అల్‌–జజీరా సీనియర్ జర్నలిస్టు వాయెల్ దాహ్‌దౌ భార్య, కుమారుడు, కుమార్తె, మనవడు ప్రాణాలు కోల్పోయారు. గాజాలోని నుసీరాత్ శరణార్థుల శిబిరంపై జరిగిన దాడిలో వారు మరణించారు. మరికొందరు కుటుంబ సభ్యులు కనిపించకుండాపోయారు. గురువారం వాయెల్ భార్య, కుమారుడు, కుమార్తె, మనవడి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తన భార్య, కుటుంబ సభ్యుల మృతదేహాలను చూసి ఆయన కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియాలో నెటిజన్ల హృదయాలు కలిచివేశాయి. సంతాపం ప్రకటిస్తూ వారు పోస్టులు పెట్టారు. ప్రతీకారం తీర్చుకోవాలంటే మా పిల్లలను బలి తీసుకోవాలా? అని వాయెల్ నిలదీశారు. పాలస్తీనా జాతీయుడైన వాయెల్ చాలా ఏళ్లుగా గాజాలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. ఇక్కడి ప్రజల దీనగాథలను, ఇజ్రాయెల్ సైన్యం దుశ్చర్యలను బయటి ప్రపంచానికి తెలియజేస్తున్నారు.

ఆ ఎకనామిక్ కారిడార్ వల్లే హమాస్ దాడి!: బైడెన్

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత్‌లో జీ–20 సదస్సులో ప్రకటించిన ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌ను హమాస్ మిలిటెంట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఈ ప్రాజెక్టును విరమించుకొనేలా ఒత్తిడి పెంచడానికే ఇజ్రాయెల్‌పై అకస్మాత్తుగా దాడి చేశారన్న వాదన కొంతవరకు తనకు సబబుగానే కనిపిస్తోందని అన్నారు. హమాస్ దాడికి గల కారణంపై తన అంతరాత్మ ఇదే చెబుతోందని వ్యాఖ్యానించారు. అయితే, దీనికి తనవద్ద స్పష్టమైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొన్నారు. అమెరికా పర్యటనకు వచ్చిన ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బానీస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఎకనామిక్ కారిడార్ గురించి బైడెన్ ప్రస్తావించడం గత వారం రోజుల వ్యవధిలో ఇది రెండోసారి. రైలు, రోడ్డు మార్గాలతో ఆసియా, మధ్యప్రాచ్యం, యూరప్ దేశాలను అనుసంధానించడానికి ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌ను జీ–20 దేశాలు తలపెట్టిన సంగతి తెలిసిందే.

చిన్నారి చూపుల్లో సమాధానంలేని ప్రశ్నలెన్నో!!



గాయాలతో రక్తమోడుతున్న తన తల్లికి ఏమయిందో తెలియక బేలచూపులు చూస్తున్న చిన్నారి. దక్షిణ గాజాలోని నజీర్ ఆస్పత్రిలో తీసిందీ ఫొటో.



ఘటన జరిగిన బార్ వద్ద అప్రమత్తంగా ఉన్న పోలీసులు

అమెరికాలో నరమేధం

18 మందిని కాల్చి చంపిన ఉన్మాది

- ముందుగా ఆడుకుంటున్న చిన్నారులు, తల్లిదండ్రులపై
- అనంతరం సమీపంలోని బార్‌పైకీ కాల్పులు
- హంతకుడు సైనికుడు, మానసిక రోగి!
- కాల్పులకు దిగుతానంటూ గతంలోనూ బెదిరింపులు
- పట్టుకునేందుకు పోలీసుల వేట

లెవిస్టన్ (అమెరికా): అమెరికాలో మళ్లీ తుపాకీ పేలింది. మానసిక స్థితి సరిగా లేదని భావిస్తున్న ఓ సైనికుడు నరమేధానికి దిగాడు. చిన్నారులు, వారి తల్లిదండ్రులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం పారిపోతూ దార్లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌పైనా కాల్పులకు పాల్పడ్డాడు. ఈ దారుణాల్లో ఏకంగా 18 మంది ప్రాణాలు కోల్పోయారు. కనీసం 13 మందికి పైగా గాయపడ్డారు. మెయిన్ రాష్ట్రంలోని లెవిస్టన్‌లో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి వేళ ఈ ఘోరం జరిగింది. కాల్పుల అనంతరం చీకటి చాటున తప్పించుకుని పారిపోయిన హంతకుని కోసం భారీ వేట సాగుతోంది. హంతకుడిని 40 ఏళ్ల రాబర్ట్ కార్డ్‌గా గుర్తించారు. అతడు అమెరికా ఆర్మీ రిజర్వ్‌లో ఆయుధాల ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నట్టు సమాచారం. కొంతకాలంగా అతను మానసిక సమస్యలతో బాధపడుతున్నట్టు పోలీసులు తెలిపారు. హంతకుని ఫొటోను విడుదల చేశారు. అందులో అతను చేతిలో ఆటోమేటిక్ రైఫిల్‌తో కన్పిస్తున్నాడు. హంతకుడు పారిపోయేందుకు ఉపయోగించినట్టుగా భావిస్తున్న కారును ఆండ్రోస్కాగిన్ కౌంటీలో స్వాధీనం చేసుకున్నారు. ఈ దారుణంపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ మెయిన్ గవర్నర్‌తో మాట్లాడారు.

బౌలింగ్ పోటీలు జరుగుతుండగా...

కాల్పులు జరిగిన స్పేర్‌టైమ్ రిక్రియేషన్, షెమెంగీస్ బార్ అండ్ గ్రిల్ రెస్టారెంట్ లెవిస్టన్ శివార్లలోని డౌన్‌టౌన్లో ఉన్నాయి. బుధవారం రాత్రి అక్కడి బౌలింగ్ ఏరియాలో చిన్నారుల బౌలింగ్ లీగ్ జరుగుతోంది. ఆటవిడుపుగా దాంట్లో పాల్గొంటున్న పిల్లలు, వారి తల్లిదండ్రులతో సందడిగా ఉన్న సమయంలో రాబర్ట్ అందులోకి చొరబడి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు.

హింసాత్మక ప్రవృత్తి

రాబర్ట్‌ది హింసాత్మక ప్రవృత్తి అని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మానసిక పరిస్థితి కూడా సరిగా లేదని తెలిపారు. రెండు వారాల క్రితమే ఓ మానసిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స కూడా తీసుకున్నాడన్నారు. అతను ఎలాంటి సమస్యతో బాధపడుతున్నాడో చెప్పకపోయినా, కంఠధ్వనులు వినిపిస్తున్నాయని ఫిర్యాదు చేసినట్టు చెబుతున్నారు. బౌలింగ్ ఏరియాలో కాల్పుల మోతకు జనం వణికిపోయారు. ప్రాణభయంతో చెల్లాచెదురైపోయారు. హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు.



స్పేర్‌టైమ్ వద్ద హంతకుడు కాల్పులు జరుపుతున్న దృశ్యం

బెలూన్లను పేలుస్తున్నారనుకున్నాం...

తాను బౌలింగ్ ఏరియాలోకి వెళ్లిన కాసేపటికే వెంటవెంటనే కనీసం 10సార్లు తుపాకీ పేల్చిన శబ్దం విన్నట్టు బ్రెండన్ అనే వ్యక్తి చెప్పాడు. ''ఆ సమయంలో కాళ్లకు బూట్లు తొడుక్కుంటున్నా. సరదాగా బెలూన్లను పేలుస్తున్నారని తొలుత అనుకున్నా. కానీ డోర్ వద్ద చేతిలో తుపాకీతో హంతకున్ని చూసి వణికిపోయా. వెంటనే నేలపై పాక్కుంటూ బౌలింగ్ మెషీన్లోకి దూరి దాక్కున్నా. ఐదారు గంటల పాటు ఉత్తకాళ్లతో గడిపా''అని వివరించాడు. రెయిలీ దెమోంట్ అనే ఆవిడ తల్లిదండ్రులతో కలిసి తన కూతురి ఆట చూస్తోంది. ఆమె తండ్రి రిటైర్డ్ పోలీసాఫీసర్. ''కాల్పులు మొదలు కాగానే అక్కడున్న వాళ్లందరినీ మా నాన్న హుటాహుటిన ఓ మూలకు తరలించాడు. టేబుళ్లు తదితరాలను వారికి అడ్డుగా పెట్టి ఎంతోమంది ప్రాణాలు కాపాడాడు''అని చెప్పింది. బార్‌లో కూడా కాల్పుల శబ్దం వింటూనే సిబ్బంది వెంటనే తలుపులన్నీ మూసేసి లోపలున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఎందుకీ కాల్పులు...?

కాల్పులను కళ్లారా చూసిన జోయ్ లెవెస్క్ అనే పదేళ్ల చిన్నారి ఇప్పటికీ దాన్ని తలుచుకుని వణికిపోతోంది! ''బులెట్ నా కాలికి తగులుతూ దూసుకెళ్లింది. ఇలా జరుగుతుందని ఎప్పుడూ ఊహించలేదు. ఎవరైనా ఎందుకిలా ప్రవర్తిస్తారు?''అని ప్రశ్నిస్తోంది. కాల్పుల అనంతరం బౌలింగ్ ఏరియాలో, రెస్టారెంట్లో ఉన్నవాళ్లందరినీ పోలీసులు సమీపంలోని స్కూలుకు తరలించారు.

ఈ ఏడాది 36వ ఘటన

అమెరికాలో ఇది ఈ ఏడాదే ఏకంగా 36వ సామూహిక కాల్పుల ఘటన! ఇక మెయిన్ రాష్ట్రంలో కాల్పుల్లో ఇంతమంది బలవడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో 2022 మొత్తంలో పరస్పర కాల్పుల ఘటనల్లో 29 మంది మరణించారు. ఈ రాష్ట్రం వేటకు, షూటింగ్ క్రీడలకు ప్రసిద్ధి. అందుకే ఇక్కడ తుపాకీ కోసం లైసెన్సు కూడా అక్కర్లేదు! తుపాకీ కొనేందుకు లైసెన్సును తప్పనిసరి చేసేందుకు జరిగిన ప్రయత్నాలను స్థానిక ప్రజలే వ్యతిరేకించారు. కనీసం కొనుగోలుదారుల నేపథ్యాన్ని క్షుణ్నంగా తనిఖీ చేయాలన్న ప్రతిపాదనను కూడా బుట్టదాఖలు చేశారు. ఇక కాల్పులు జరిగిన లెవిస్టన్ కేవలం 38 వేల జనాభాతో కూడిన చిన్న పట్టణం. ఇక్కడ ప్రధానంగా ఆఫ్రికన్లు నివసిస్తుంటారు. ప్రస్తుతం పట్టణంలో లాక్‌డౌన్ విధించారు.

నార్త్ కరోలినాలో ఐదుగురు మృతి

క్లింటన్: అమెరికాలో గురువారమే మరో కాల్పుల ఉదంతం చోటుచేసుకుంది. నార్త్ కరోలినాలోని క్లింటన్‌లో హైవే సమీపంలోని ఓ ఇంట్లో ఐదుగురు తూటా గాయాలతో చనిపోయి కన్పించినట్టు పోలీసులు తెలిపారు. ఈ దారుణానికి ఎవరు, ఎందుకు పాల్పడిందీ ఇప్పటికైతే తెలియలేదన్నారు. పరస్పర గొడవలే ఇందుకు దారి తీసి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు.

ప్రియాంకా గాంధీకి ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన 'కవర్ల' వ్యాఖ్యలకు సంబంధించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీకి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షోకాజ్ నోటీసులిచ్చింది. అక్టోబర్ 30 సాయంత్రంలోపు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ విషయమై బుధవారం బీజేపీ చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకుంది. మోదీ వ్యక్తిగత మత విశ్వాసాలను ప్రియాంక బాహాటంగా కించపరిచారని బీజేపీ ఆరోపించింది. 'అక్టోబర్ 20న రాజస్తాన్‌లోని దౌసాలో చేసిన ఎన్నికల ప్రసంగంలో మోదీని కించపరిచేలా ప్రియాంక వ్యాఖ్యలు చేశారు. ఒక ఆలయానికి మోదీ ఇచ్చిన విరాళం తాలూకు కవర్‌ను తెరిచి చూస్తే అందులో కేవలం 21 రూపాయలే ఉన్నట్టు టీవీలో చూశానని ఆమె అన్నారు. సరిగ్గా అదే విధంగా పథకాల రూపంలో ప్రజలకు బీజేపీ చూపిస్తున్న కవర్లలో నిజానికి ఏమీ లేదని ఎన్నికల తర్వాత తేలుతోందంటూ ఎద్దేవా చేశారు' అని పేర్కొంది.

బెంగాల్ మంత్రి నివాసాల్లో ఈడీ సోదాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అటవీ శాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జ్యోతిప్రియో మల్లిక్ నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం ఉదయం సోదాలు ప్రారంభించారు. బెంగాల్‌లో రేషన్ సరుకుల పంపిణీలో కోట్లాది రూపాయల అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు కోల్‌కతాలో మంత్రికి చెందిన రెండు నివాసాల్లో సోదాలు ప్రారంభించారు. ఆయన మాజీ వ్యక్తిగత సహాయకుడి ఇళ్లల్లోనూ సోదాలు జరిగాయి. జ్యోతిప్రియో మల్లిక్ గతంలో ఆహార శాఖ మంత్రి పనిచేశారు. ఆ సమయంలోనే రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో మంత్రితో సంబంధం ఉన్న ఓ వ్యక్తిని ఈడీ అరెస్టు చేసింది. మంత్రి బ్యాంకు ఖాతాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని, అనుమానాస్పద లావాదేవీలపై ఆయనను ప్రశ్నిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

అస్సాం సీఎం శర్మకు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారం సభలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత, అస్సాం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వ శర్మకు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నోటీసు జారీ చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని కవార్ధాలో ఈనెల 18వ తేదీన జరిగిన ఎన్నికల ప్రచార సభలో హిమాంత శర్మ మాట్లాడుతూ..'ఒక చోటికి ఒక అక్బర్ వచ్చాడంటే అతడు మరో 100 మంది అక్బర్‌లను పిలుస్తాడు. అందుకే సాధ్యమైనంత త్వరగా అక్బర్‌ను పంపించివేయాలి. అలా చేయలేకపోతే కౌశల్య మాత పుట్టిన ఈ నేల అపవిత్రమవుతుంది' అంటూ రాష్ట్ర కేబినెట్‌లోని ఏకైక ముస్లిం మంత్రి మహ్మద్ అక్బర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తమకు సమాధానమివ్వాలని ఆదేశించింది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్‌లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

లక్ష డాలర్ల నోట్ల వర్షం

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ వినూత్న యత్నం

ప్రాగ్: ఆకాశంలో నుంచి డాలర్ల నోట్లు వర్షంలా వచ్చి పడుతుంటే..? చూసిన వారెవరైనా ఏం చేస్తారు? ఆత్రంగా వచ్చి ఏరుకుంటారు..! అచ్చంగా చెక్ రిపబ్లిక్‌లో జరిగిందిదే.. ఆ దేశానికి చెందిన టీవీ వ్యాఖ్యాత, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఇదే తరహాలో హెలికాప్టర్ నుంచి అక్షరాలా లక్ష డాలర్ నోట్లను జార విడిచాడు. కామిల్ బర్తోషెక్ అనే ఇన్‌ఫ్లూయెన్సర్ 'వన్‌మాన్ షో: ది మూవీ'అనే సినిమాలో నటించాడు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా యూజర్ల కోసం ఓ కాంటెస్ట్ నిర్వహించాడు. ఆ సినిమా చూసి, అందులో ఉన్న పజిల్‌ను పరిష్కరించిన మొదటి వ్యక్తికి లక్ష డాలర్లు బహుమతిగా ఇస్తానని ప్రకటించాడు. అందుకోసం యూజర్లు తమ పేర్లను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించాడు. కాంటెస్ట్‌లో చాలామంది పాల్గొన్నప్పటికీ ఆ పజిల్‌ను ఎవరూ పరిష్కరించలేకపోయారు. దీంతో, బహుమతిగా ఇవ్వాలనుకున్న లక్ష డాలర్లను పేర్లను రిజిస్టర్ చేసుకున్న వారికి ఇవ్వాలనుకున్నాడు. ఇందుకోసం వారందరికీ సీక్రెట్ కోడ్‌తో మెయిల్ పంపారు. అందులో హెలికాప్టర్ నుంచి నగదును జార విడిచే ప్రాంతానికి సంబంధించిన క్లూ ఇచ్చాడు. మెయిల్‌లో తెలిపినట్లుగానే కామిల్ ఆదివారం ఉదయం 6 గంటలకు నింబుర్క్ జిల్లా లైసా నాడ్ లబెమ్ అనే ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో డాలర్ల నోట్లను జార విడిచాడు. దీనికి సంబంధించిన వీడియోను ఫస్ట్ రియల్ మనీ రెయిన్'పేరుతో తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేశాడు. డబ్బును ఉంచిన ఒక పెద్ద కంటెయినర్‌ను హెలికాప్టర్‌తో ఆకాశంలోకి తీసుకెళ్లి ముందుగా ప్రకటించిన ఖాళీ ప్రదేశంలో నగదును జార విడిచాడు. అప్పటికే అక్కడ బ్యాగులు, ఎక్కువ నోట్లు పోగేసుకోవాలనే ఆలోచనతో కొందరు గొడుగులతో అక్కడికి చేరుకున్నారు. సుమారు నాలుగు వేల ఆ డబ్బు మొత్తాన్ని గంటలోపే సేకరించుకున్నారని, ఆ సమయంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని కామిల్ తెలిపాడు. అన్ని నోట్లపైనా క్యూఆర్ కోడ్ ఉందని, ఆ డబ్బును కావాలనుకుంటే ఆన్‌లైన్ వేదికగా దానం చేయవచ్చని కూడా చెప్పాడు.

8 మంది భారత నేవీ మాజీ ఉద్యోగులకు

ఖతార్ కోర్టు మరణశిక్ష

తీవ్రంగా షాక్‌కు గురయ్యామన్న భారత్

న్యూఢిల్లీ: ఖతార్‌లోని ఓ న్యాయస్థానం ఎనిమిది మంది భారత నేవీ మాజీ ఉద్యోగులకు గురువారం మరణశిక్ష విధించింది. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ పరిణామం అత్యంత ఆశ్చర్యకరమని పేర్కొంది. అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంగా భావించి, ఖతార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది. అరెస్టయిన వారిలో కెప్టెన్ సౌరభ్ వశిష్ఠ, కమాండర్ పూర్ణేందు తివారీ, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కమాండర్ సంజీవ్ గుప్తా, కమాండర్ సుగుణాకర్ పాకాల, అమిత్ నాగ్‌పాల్, శైలర్ రాగేశ్ అనే వారున్నారు. వీరంతా నేవీలో కనీసం 20 ఏళ్ల అనుభవం ఉంది. ఖతార్‌లోని అల్ దహ్రా అనే సెక్యూరిటీ సంస్థలో ఆ దేశ నేవీ సిబ్బందికి గత కొన్నేళ్లుగా శిక్షణనిస్తున్నారు. సంస్థకు చెందిన ఒక అధికారి అరెస్ట్‌తో శిక్షణ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అనంతరం భారతీయ నేవీ మాజీ సిబ్బందిపై గూఢచర్యం ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఆగస్టులో అరెస్ట్ చేశారు. అయితే, ఆ ఆరోపణల వివరాలను మాత్రం వారు వెల్లడించలేదు. అక్కడి ప్రభుత్వం అనుమతి మేరకు ఖతార్‌లోని భారత దౌత్యాధికారి జైలులోని వారిని ఈనెల ఒకటో తేదీన కలుసుకుని మాట్లాడారని విదేశాంగ శాఖ తెలిపింది. దీనిపై ఈ సమయంలో వ్యాఖ్య చేయడం సరికాదని వివరించింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం షిర్డీలోని సాయి బాబా ఆలయాన్ని సందర్శించుకుని, పూజలు చేశారు. ఆ తర్వాత ప్రధాని మోదీ అహ్మద్‌నగర్ జిల్లాలో నిల్వాండే డ్యామ్ వద్ద జలాభిషేకం చేశారు. జలాశయం ఎడమ గట్టు కాల్వను ప్రారంభించారు. అనంతరం షిర్డీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు.



జమ్మూలో భారత సైనిక పోస్టులపై పాక్ రేంజర్ల కాల్పులు

జమ్మూ/న్యూఢిల్లీ: పాకిస్తాన్ రేంజర్లు భారత జవాన్లను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. గురువారం రాత్రి జమ్మూలోని అర్నియా సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వద్ద భారత సైనిక పోస్టులపై కాల్పులు జరిపారని బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు. తాము తగిన రీతిలో ప్రతిస్పందిస్తున్నామని, పాకిస్తాన్ రేంజర్లకు ధీటుగా సమాధానం చెబుతున్నామని వెల్లడించారు. పాకిస్తాన్ భూభాగం నుంచి రాత్రి 8 గంటలకు కాల్పులు ప్రారంభమయ్యాయని, ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 17న అర్నియా సెక్టార్‌లో పాక్ రేంజర్ల కాల్పుల్లో బీఎస్ఎఫ్ జవాను ఒకరు గాయపడ్డారు.

చొరబాటుకు యత్నించిన అయిదుగురు ముష్కరులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో గురువారం నియంత్రణ రేఖ (ఎల్ఓసీ)వెంబడి గుర్తు తెలియని వ్యక్తుల చొరబాటు యత్నాన్ని భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. ఈ సందర్భంగా మచ్చిల్ సెక్టార్‌లో జరిపిన కాల్పుల్లో అయిదుగురు తీవ్రవాదులు హతమైనట్లు అదనపు డీజీపీ విజయ్ కుమార్ చెప్పారు. వారిని గుర్తించాల్సి ఉందన్నారు. ఆ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోందన్నారు.

ఎన్నికల రాష్ట్రాల్లో 'వికసిత్ భారత్ సంకల్ప్' వద్దు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తమ పథకాలు తదితరాల గురించి ప్రజలకు వివరించేందుకు తలపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో డిసెంబర్ ఐదో తేదీదాకా చేపట్టరాదని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబాకు గురువారం ఈ మేరకు లేఖ రాసింది. 'నవంబర్ 20 నుంచి మొదలవుతున్న ఈ యాత్ర కోసం జిల్లా రథ్ ప్రహారీలుగా సీనియర్ ప్రభుత్వాధికారులను నామినేట్ చేయాల్సిందిగా రాష్ట్రాలకు కేంద్రం లేఖ రాసినట్టు మా దృష్టికి వచ్చింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న ఐదు రాష్ట్రాల్లో, నాగాలాండ్‌లో ఉపఎన్నిక జరుగుతున్న తపీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో డిసెంబర్ ఐదో తేదీదాకా ఇలాంటి కార్యకలాపాలేవీ చేపట్టరాదు' అని ఆదేశించింది.

గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డు

వాషింగ్టన్: అమెరికాలో శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డు పొందాలంటే దరఖాస్తుదారులు చాలా ఏళ్లు ఎదురు చూడాల్సి వస్తోంది. ఇలాంటి వారికి ఊరట కల్పిస్తూ ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డు(ఈఏడీ) అందజేయాలని వైట్‌హౌస్ కమిషనర్ గురువారం ప్రభుత్వానికి అధికారికంగా సిఫార్సు చేశారు. అధ్యక్షుడు జో బైడెన్ ఆమోద ముద్ర వేస్తే ఈఏడీ మంజూరు ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనివల్ల లక్షలాది మంది భారతీయులకు లబ్ధి చేకూరుతుంది.

• చెకింగ్‌లు..చికాకులు



యాదాద్రి జిల్లా రామన్నపేట పరిధిలో ఓ బస్సులో తనిఖీ ఇలా..



నగర పరిధిలో ఓ కారులో ఇలా..



రామన్నపేట రైల్వేస్టేషన్‌లో

సామాన్యుడి సమయం...
సోదాహరణం

పటిష్టమైన ఇంటెలిజెన్స్, సాంకేతిక పరిజ్ఞానం పక్కకు..

శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి

ఎన్నికల్లో డబ్బు, మద్యం తదితర ప్రలోభాలను అడ్డుకునేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న సోదాలు, హడావుడి ఈ సందర్భంగా ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లు సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులకు తీవ్రమైన చికాకు తెప్పిస్తున్నాయి. ఎన్నికల్లో డబ్బు రవాణా, పంపిణీని నిలువరించేందుకు పటిష్టమైన ఇంటెలిజెన్స్, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడే బదులు.. అడుగడుగునా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద రోజూ సాధారణ జనం నుంచి సైతం నిత్యం నగదు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇంతా చేస్తే.. ఈ తతంగమంతా వృథా ప్రయాసగానే మారుతోందని, చాలావరకు కేసుల్లో అసలు దోషుల్ని గుర్తించడం లేదని, కొన్ని కేసులు విచారణకు సైతం నోచుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

90% డబ్బులు వెనక్కే..

గడిచిన రెండు సాధారణ ఎన్నికల్లోనూ భారీ ఎత్తున నగదు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించిన ఎన్నికల యంత్రాంగం.. ఎన్నికల అనంతరం నూటికి 96 శాతం తిరిగి సంబంధిత వ్యక్తులకు అప్పగించేశారు. ప్రస్తుతం కూడా వివిధ చెక్‌పోస్టుల్లో స్వాధీనం చేసుకుంటున్న కేసుల్లో 90 శాతం డబ్బును జిల్లా స్థాయి కమిటీలే తిరిగి సంబంధిత వ్యక్తులకు అందజేస్తున్నా..ఈ సందర్భంగా చిన్నా చితక వ్యాపారులు, సాధారణ జనాన్ని రోజుల తరబడి జిల్లా కలెక్టరేట్ల చుట్టూ తిప్పుతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి ఎన్నికల్లో ప్రలోభాల కోసం రాజకీయ పక్షాలు అత్యధికంగా హవాలా, ప్రైవేటు బ్యాంకులు, విద్యా సంస్థలు, ఇతర వాణిజ్య సంస్థల నుండి భారీగా రవాణా చేస్తున్నా..అలాంటి వాటిని వదిలి పోలీసులు సాధారణ జనం మీద పడుతున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇక సాధారణ ట్రాఫిక్ సాఫీగా ముందుకు సాగిపోయే వీల్లేకుండా రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనే విమర్శలు కూడా విన్పిస్తున్నాయి.

2014–2018 సాధారణ ఎన్నికల సందర్భంలోనూ స్వాధీనం చేసుకున్న డబ్బు – శిక్షలు తదితర అంశాలపై ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ సంస్థ ఆర్‌టీఐ ద్వారా సమాచారం సేకరించగా, పది లక్షల లోపు అయితే జిల్లా అధికారులు, పది లక్షలు దాటితే ఐటీ అధికారులు

పన్ను కట్టించుకుని వదిలేస్తున్న ఐటీ

పరిశీలించారు. ఐటీకి సంబంధించి ఒక వేళ పన్ను కట్టకపోతే పన్ను కట్టించుకుని, మరికొన్ని కేసుల్లో అడ్వాన్స్ పన్ను కట్టించుకుని ఆ మొత్తాలను తిరిగి ఇచ్చేసినట్లు తేలింది.హవాలా ద్వారా భారీ ఎత్తున వెళుతున్న డబ్బును స్వాధీనం చేసుకున్న మెజారిటీ కేసుల్లో ఇంకా న్యాయ విచారణలే మొదలు పెట్టకపోవటంతో ఒక్కరికీ శిక్ష పడలేదు.

అడ్వాన్స్ ట్యాక్స్‌లు.. సాగని విచారణలు

- 2018 ఎన్నికల్లో జనగామ వద్ద రూ.5.8 కోట్లతో వెళుతున్న కంటెయినర్‌ను పట్టుకున్న పోలీసులు కేసు నమోదు (576–2018) చేసి కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో తీవ్ర అభియోగాలు నమోదు చేసినా.విచారణ ముందుకు సాగలేదు.
- ములుగు పరిధిలో పట్టుకున్న రూ.19.95 లక్షల కేసులోనూ రాజకీయ పార్టీకి సంబంధించిన ఆధారాలున్నా ఆ దిశగా విచారణ ముందుకు సాగటం లేదు.
- 2104 ఎన్నిక సమయంలో బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విశ్వాస్‌కుమార్ అనే వ్యక్తి నుండి స్వాధీనం చేసుకున్న రూ.8.38 లక్షల డబ్బును ఐటీ విభాగానికి అప్పగించగా, అందులోనుండి రూ.3.38 లక్షలు అడ్వాన్స్‌ట్యాక్స్‌గా కట్టించుకుని మిగిలిన డబ్బును తిరిగి అప్పగించారు.
- 2018లో కొడంగల్ నియోజకవర్గం మిర్జాపూర్‌లో రూ.17.5 కోట్ల నగదు ఉందని సమాచారం వస్తే ఐటీ అధికారులు దాడి చేసి నగదు స్వాధీనం చేసుకున్నారు. తీరా రూ.51 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు ఐటీ శాఖ పేర్కొంది.
- 2018లో పోలీసులు రూ.79.23 లక్షలు (500 డినామినేషన్) స్వాధీనం చేసుకుని కేసు నమోదు (190–2018) చేశారు. ఎన్నికలయ్యాక..అందులో రూ.23,000 మాత్రమే ఒరిజినల్ నోట్లుగా తేల్చి మిగిలినవి నకిలీగా పేర్కొన్నారు.


కచ్చితత్వం లేకుండా సాధారణ ప్రజలు, చిరు వ్యాపారుల నుంచీ నగదు స్వాధీనం

ఈ తతంగమంతా వృథా ప్రయాసే అన్న విమర్శ

రాజకీయ లింకులు పరిశీలించాలి

ఎన్నికల సమయంలో యంత్రాంగం స్వాధీనం చేసుకునే మొత్తం రూ.10 లక్షల లోపు అయితే జిల్లా కమిటీకి, రూ.10 లక్షలు దాటితే ఆదాయపు పన్ను శాఖకు పంపుతున్నారు. కాగా జిల్లా స్థాయి కమిటీలు తగు రశీదులు సమర్పిస్తే ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తున్నాయి. అలా కాకుండా ప్రతి వ్యక్తి వెనుక రాజకీయ లింకులను లోతుగా పరిశీలించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐటీకి వెళ్లిన డబ్బు విషయంలో కూడా రవాణా చేస్తున్న వ్యక్తుల వివరాలు, ఇతరత్రా లోతుల్లోకి వెళ్లకుండా..కేవలం నల్లధనమా లేక తెల్లధనమా అనేది చూస్తున్నారు. ఒక వేళ నల్లధనమైతే పన్ను కట్టించుకుని వదిలేస్తున్నారు. డబ్బును తీసుకువెళుతున్న కారణాన్ని విశ్లేషించి ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అంటున్నారు. ఇక భారీ మొత్తాలు దొరికిన సమయాల్లో రాజకీయ పార్టీల కార్యకర్తలు, వారు నియమించిన కూలీలు దొరికిన సందర్భాల్లో లోతైన విచారణలు చేయాలి. అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థలను ఇన్‌వాల్వ్ చేయాలని సూచిస్తున్నారు.

అసలు దోషుల వరకు వెళ్లటం లేదు



ఎన్నికల్లో ఓట్ల కోసం డబ్బు, మద్యం పంపిణీ విచ్చలవిడి అయ్యింది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ మార్గాల్లో నగదు తీసుకెళ్తూ పట్టుబడుతున్న కేసుల్లో అసలు దోషుల్ని వదిలిపెట్టి నామమాత్రంగా డ్రైవర్లు, ఇతర కూలీలపై కేసులు నమోదు చేస్తున్నారు. రూ.10 లక్షలకు పైబడి అయితే ఐటీకి అందజేస్తున్నారు. ఆ నగదు వెనుక ఉన్న అసలు దోషులను గుర్తించే దిశగా విచారణ చేయటం లేదు.

– ఎం.పద్మనాభరెడ్డి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

వృథా ప్రయాసగా మారొద్దు



ఇప్పుడు తెలంగాణలో సాగుతున్న సోదాలు, డబ్బు..ఇతర వస్తువుల స్వాధీనం చూస్తుంటే అధికార యంత్రాంగం శ్రమ వృథా ప్రయాసగానే కనిపిస్తోంది. డబ్బు ఎన్నికల కోసమే వెళుతుందని ధ్రువీకరించుకుంటే,తగు ఆధారాలు సంపాదించి నేరుగా పోటీలో ఉన్న అభ్యర్థులపైనే చర్యలకు సిఫారసు చేయొచ్చు. నేను కమిషనర్‌గా ఉన్న సమయంలో కరీంనగర్‌జిల్లాలో పంపిణీ చేసేందుకు వెళుతున్న ఓ నేతను పట్టుకుని చర్యలు తీసుకున్నాం.

– వి.నాగిరెడ్డి, రిటైర్డ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్

దసరా..సరదా లేకుండా చేశారు



ఈ నెల 10వ తేదీన నా ఖాతా నుండి రూ.3 లక్షలు విత్‌డ్రా చేసుకొని ఇంటికి వస్తుంటే పోలీసులు పట్టుకున్నారు. సింగరేణి ఎరియర్స్ డబ్బు అని చెప్పినా వినకుండా అధికారులకు అప్పగించారు. వారం రోజుల పాటు అన్ని ఆధారాలతో తిరిగితే మంథని తహసీల్దార్ ఆఫీస్‌లో వాపస్ ఇచ్చారు. దసరా సరదా కాస్తా నీరుగారిపోయింది.

– వేగొలం రామన్న, సింగరేణి కార్మికుడు, నాగేపల్లి.

పాప్ కార్న్



ఒక్కరూపాయి ఇవ్వండి.. ఓటు వెయ్యండి

కోదాడలో ఎన్నారై జలగం సుధీర్ వినూత్న ప్రచారం

కోదాడ: 'డబ్బులిస్తాను.. నాకు ఓటెయ్యండి'అని అడగటం ఎన్నికల్లో పరిపాటి. దీనికి భిన్నంగా ఓ ఎన్నారై తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని, ఎన్నికల ఖర్చు కోసం ప్రతి ఒక్కరూ డబ్బులు ఇవ్వడంతోపాటు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఎన్నారై జలగం సుధీర్ కోదాడ బీఆర్‌ఎస్ టికెట్ కోసం ప్రయత్నించారు. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్‌తో తనకున్న పరిచయాలు కలిసి వస్తాయని ఆశించారు. కానీ, పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేకే టికెట్ ఇవ్వడంతో ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న సుధీర్ ఎన్నికల ఖర్చు కోసం ప్రతి ఓటరూ ఒక్క రూపాయి ఇవ్వాలని, ఓటు వెయ్యాలని సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే 15 వేలమంది తనకు రూపాయి చొప్పున పంపారని, రోజురోజుకూ మద్దతు పెరుగుతోందని, ఎన్నికల్లో విజయం సాధిస్తానని అన్నారు.

మీకు తెలుసా ?

ఓటేసి పదవొదులుకున్నారు

ప్రస్తుత తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ వల్ల గతంలో తొమ్మిది మంది ఎమ్మెల్యేలు అనర్హత వేటుకు గురయ్యారు. ఆయన గతంలో ఉమ్మడి ఏపీలో ఎమ్మెల్సీగా పోటీచేసినప్పుడు అప్పటి టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తొమ్మిది మందిని ప్రలోభపెట్టి తనకు ఓటు వేసేలా చేసుకున్నారు. ఆ తొమ్మిది మంది ఎమ్మెల్యేలు విప్‌ను ధిక్కరించి మరీ జ్ఞానేశ్వర్‌కు ఓటువేసి గెలిపించారు. దీంతో చిర్రెత్తుకొచ్చిన నాటి టీఆర్‌ఎస్ పార్టీ వారందరిపై అనర్హత వేటు వేయాలని అప్పటి స్పీకర్ కేఆర్. సురేశ్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదును విచారించిన సురేశ్‌రెడ్డి మూడేళ్ల తర్వాత వారందరిపై అనర్హత వేటు వేశారు. అనర్హత వేటుకు గురైనవారిలో ఎస్.బాపూరావు, నారాయణరావు పటేల్, ఎస్.సంతోశ్ రెడ్డి, జి.ముకుందరెడ్డి, కాశీపేట లింగయ్య, జగ్గారెడ్డి, డి.శ్రీనివాసరావు, ఎమ్.సత్యనారాయణరెడ్డి, బి.శారారాణి ఉన్నారు. అయితే అనర్హత వేటు పడటానికి ఒక్కరోజు ముందే ఈ తొమ్మిది మంది తమ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసేశారు. ఇక నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంతో ఏర్పడిన పరిణామాలలో ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలిచి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంపై వచ్చిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన కొండా సురేఖ కూడా అనర్హత వేటుకు గురయ్యారు. ఇక టీడీపీ అధినేత చంద్రబాబు తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలలో ఒక నామినేటెడ్ ఎమ్మెల్యేని కొనబోయి దొరికిపోయిన ఘటనలో జ్ఞానేశ్వర్ పట్టుబడలేదు. కానీ ఆయనకు ఓటు వేసిన వారు మాత్రం పదవులు వదులుకోవాల్సి వచ్చింది.

ప్రతిపక్షహోదా..వచ్చినట్లు వచ్చి 'చేయి'జారింది

2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాలేకపోయినప్పటికీ ప్రధాన ప్రతిపక్షంగా ఉండటానికి అవసరమైన సీట్లను మాత్రం పొందగలిగింది. తద్వారా ప్రతిపక్షనేతగా ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు కేబినెట్ హోదా వచ్చింది. కానీ, పార్టీ నుంచి పలువురు వెళ్లిపోయి బీఆర్‌ఎస్‌లో విలీనమవడంతో వచ్చిన ప్రధాన ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోవలసి వచ్చింది. ఆ ఎన్నికల్లో 19 సీట్లను కాంగ్రెస్ గెలుచుకున్నా, 12 మంది ఆ పార్టీని వీడి బీఆర్‌ఎస్ లో కలిసిపోయారు. ఆ తర్వాత సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లోక్‌సభకు ఎన్నికవడంతో ఆయన సీటు ఖాళీ అయ్యింది. ఫలితంగా కాంగ్రెస్ బలం ఆరుకు పడిపోయింది. దీంతో మల్లు భట్టి విక్రమార్క కేబినెట్ హోదా పోయింది. విశేషం ఏమిటంటే బీఆర్‌ఎస్ మిత్రపక్షమైన మజ్లిస్‌కు ఏడు సీట్లు ఉండటంతో ఆ పార్టీ నేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రధాన ప్రతిపక్షనేతగా కేబినెట్ హోదాను పొందే అవకాశం వచ్చింది. కాగా 1994లో ఉమ్మడి ఏపీ శాసనసభలో 26 సీట్లే రావడంతో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్ష హోదా రాలేదు. ప్రతిపక్ష హోదా రావడానికి మొత్తం సీట్లలో పదిశాతం ఆ పార్టీకి వచ్చి ఉండాలి.

గాసిప్ టైమ్

సీఎం కావాలంట.. కానీ పదేళ్ల తర్వాత అంట..

కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే పదవికి ఎంత పోటీ ఉంటుందో సీఎం పదవికి కూడా అంతే పోటీ ఉంటుంది. ఇటీవల ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత జానారెడ్డి కూడా తాను సీఎం రేసులో ఉన్నానని చెప్పుకున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా సీఎం పదవి కోసం అవసరమైతే తన కొడుకు రాజీనామా చేస్తాడని, తాను గెలిచి సీఎం అవుతానంటూ మనసు విప్పారు. ఇప్పుడు తాజాగా ఆ కోవలోకి సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేరారు. ఆయన కూడా సీఎం కావాలన్న తన మనసులోని మాటను దసరా సందర్భంగా బయటపెట్టారు. మరో పదేళ్ల తర్వాత తాను సీఎం అవుతానని, అప్పటివరకు ప్రజలు తనను కాపాడుకోవాలని కోరారు జగ్గారెడ్డి. ఇప్పుడు కాకపోతే పదేళ్ల తర్వాతనయినా తనకు అవకాశం వస్తుందనే ఆశ జగ్గారెడ్డికి ఉందని అర్థమవుతుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికలయ్యేనాటికి ఇంకా ఎంత మంది వస్తారో అంటై , ఎంత సెటైర్లు వేస్తున్నాయి.

గనులు తెచ్చి.. ఉపాధినిచ్చే...
ఘనులెవరు..?



'సింగరేణి డిక్లరేషన్' మేనిఫెస్టోలో పెట్టాల్సిందే

ప్రైవేటీకరణను నిలిపి పర్మనెంట్ కార్మికులను పెంచాలి

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

సాక్షి' డిబేట్‌లో కార్మిక సంఘాల డిమాండ్

సింగరేణిలో నెలకొన్న సమస్యలు, కార్మికుల ఎజెండాపై గోదావరిఖనిలో సాక్షి ఆధ్వర్యంలో చర్చావేదికలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

పీపుల్స్ మేనిఫెస్టో
'సాక్షి' చర్చావేదిక

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల డిమాండ్లను పరిష్కరించి తమ బతుకుల్లో వెలుగులు నింపాలని అన్ని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సింగరేణి కార్మికుల ఎజెండాపై గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'సాక్షి చర్చా వేదిక'లో అన్ని గుర్తింపు, జాతీయ, విప్లవ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. కెంగర్ల మల్లయ్య– టీజీబీకేఎస్, వాసిరెడ్డి సీతారామయ్య– ఏఐటీయూసీ, జనక్ ప్రసాద్–ఐఎన్‌టీయూసీ, రియాజ్ అహ్మద్– హెచ్‌ఎంఎస్, యాదగిరి సత్తయ్య–బీఎంఎస్, తుమ్మల రాజారెడ్డి– సీఐటీయూ,జి.రాములు– ఏఐఎఫ్‌టీయూ, విశ్వనాథ్, నరేష్–ఐఎఫ్‌టీయూ పాల్గొన్నారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రైవేటీకరణ, యాంత్రీకరణ, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ, రెండుపేర్లకు చట్టబద్ధత, ఆదాయపు పన్ను మినహాయింపు, సొంతింటికల, డీఎంఎఫ్ నిధుల మళ్లింపు వంటి ప్రధాన సమస్యలపై ఎన్నికలు వచ్చిన ప్రతీసారి రాజకీయ పార్టీలు కేవలం వాగ్దానాలతో కాలయాపన చేయడమే తప్ప.. ఇంతవరకూ ఆ సమస్యలను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తగనులు, ఉపాధి ఎక్కడ...?

తెలంగాణ రాష్ట్రం వస్తే.. కొత్త గనులు వచ్చి స్థానికులకు ఉపాధి లభిస్తుందనుకున్న తమ ఆశలు అడియాసలయ్యాయని కార్మిక సంఘాల నేతలు వాపోయారు. ఇక్కడ మరో 180 ఏళ్లకు తగిన బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. యాంత్రీకరణ వల్ల ఉపాధి అవకాశాలు తగ్గినా.. ఏటా ఐదు కొత్త గనులు ప్రారంభించి, దాదాపు లక్ష మందికి కల్పించే వీలుందని సింగరేణి ఉన్నతాధికారులే ధ్రువీకరించారని గుర్తు చేశారు. కానీ 1.16 లక్షల మంది కార్మికులున్న సంస్థను ఇపుడు 40 వేలకు కుదించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సంస్థలో 40 వేలమంది కాంట్రాక్టు కార్మికులు ప్రాణాంతక పరిస్థితుల్లో పనిచేస్తున్నా.. వారికి అత్తెసరు వేతనాలే ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

జంగ్ తెలంగాణ

ఇవీ డిమాండ్లు

- కాంట్రాక్టు కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలి.
- ఆదాయపు పన్ను మినహాయింపులో స్లాబ్ మార్చడం లేదా పార్లమెంటులో చట్టం ద్వారా శాశ్వత ఉపశమనం కల్పించాలి
- డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్) నిధులను సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలకు మళ్లించకుండా సింగరేణి ప్రభావిత గ్రామాల్లోనే ఖర్చు చేయాలి.
- ఇక రెండు పేర్ల చట్టబద్ధతపై విధానపరమైన నిర్ణయం తీసుకుని వారి వారసులకు 40 ఏళ్ల వయోపరిమితితో కారుణ్య నియామకాల్లో అవకాశం కల్పించాలి.
- బొగ్గు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పి స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న డిమాండ్‌ను నిలబెట్టుకోవాలి
- సింగరేణి డిక్లరేషన్ తేవాలి..

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా డిక్లరేషన్ తరహాలో అన్ని పార్టీలు సింగరేణి డిక్లరేషన్ చేసిన వారికే ఈ ఎన్నికల్లో ఓటేస్తామని స్పష్టం చేశారు. స్వరాష్ట్రంలో సింగరేణి మనుగడకు గతంలో పార్టీలు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ఎవరైతే తమ డిమాండ్లను మేనిఫెస్టోలో చేరుస్తారో వారికే తమ సంఘాలు, కార్మికులు మద్దతు తెలుపుతాయని నేతలు స్పష్టం చేశారు.



అవ్వా.. ఈ కారు మనదే...

సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం పట్టణంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలిని మంత్రి ఆప్యాయంగా పలకరించి.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రం చూపించారు. తనకు ఓటు వేస్తే అవన్నీ అమలు చేస్తానని హామీ ఇచ్చారు.

2018లో ఎక్కువ కేసులు నమోదైన జిల్లాలు

జిల్లా	కేసులు
భద్రాద్రి కొత్తగూడెం	226
మహబూబ్‌నగర్	189
వనపర్తి	137
మెదక్	136
కామారెడ్డి	181
నిజామాబాద్	243
గద్వాల	247

‘గీతాంజలి’.. రీ రిలీజ్



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

చాలాకాలం కిందట కొంతమంది కీలక నేతలు కాంగ్రెస్ పార్టీని వీడిపోయారు. బీజేపీలోకి వెళ్లిన వాళ్లంతా..దాని సిద్ధాంతాలెంతగా వంటబట్టించుకున్నారో తెలీదుగానీ... వాళ్ల ‘ఘర్ వాపసీ’ నినాదాన్ని మాత్రం ఘనంగా అర్థం చేసుకున్నారు. ఘర్‌వాపసీ అంటే వాళ్లకు అర్థమైన కాన్సెప్టు... ‘తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం’ అని.

ఈ ప్రహసనమంతా చూస్తున్న ప్రజలకూ, ఓటర్లకూ..పొలిటికల్ వెండితెరపై

మరోసారి మరో ‘గీతాంజలి’ సినిమా కనిపించింది. ఆ మూవీ సన్నివేశాలూ, డైలాగులూ, పాటలూ వినిపించాయి. అదెలాగంటే...

‘‘హేయ్... వెళ్లిపోతానన్న మొనగాడా,
రానన్నావ్.
ఎప్పటికీ తిరిగిరానన్నావ్.
కానీ మళ్లీ వచ్చావ్.
నచ్చానా...
అంత నచ్చానా..అంది గీతాంజలిలాంటి కాంగ్రెస్ పార్టీ.
‘‘హేయ్... ఆనాడెళ్లిపోయా.
అప్పుడు నువ్వు లబోదిబో అన్నావ్.
ఇప్పుడు మళ్లీ వచ్చాగా.
హ్యాపీగా లేదా?’’ నాగార్జున స్టైల్లో అన్నాడు చేరిక అభ్యర్థి.

హీరోయిన్ కాంగ్రెసాంజలి పాట...
మీరంత పార్టీకి కావాలిలే.
మరోసారి బరిలోకి దిగాలిలే
పార్టీలోకి...
మరోసారి
పార్టీలోకి మరోసారి ఎంట్రీలు మీరంత ఇవ్వాలిలే...

అంటూ పాట ముగించింది. పార్టీ గీతాంజలి..తండ్రిలాంటి తనఅధిష్టానాన్ని ఆవేదనతో అడుగుతోన్న సన్నివేశంలో ఉద్వేగంగా వేస్తున్న ప్రశ్నలివి...

‘‘ఎందుకు నాన్నా కోమటిరెడ్డి వెళ్లిపోయాడు?
బ్రదర్స్‌లో ఒకరు లేకుండానే ఈసారి పోటీకెళ్లాలా?
ఆ రేవంత్ పోటీ చేస్తాడు. ఆ ఉత్తమూ పోటీచేస్తాడు.
ఆ భట్టీ, దామోదర్ రాజనర్సింహా, జగ్గారెడ్డి..అందరూ పోటీచేస్తారు.
మునుగోడు మాత్రం ఎందుకు మునగాలి నాన్నా?
ఎందుకు..నేనెందుకు నాన్నా ఇంతగా బాధపడాలి?

అంటూ ఆవేదన చెందుతుండగా... కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీ గీతాంజలిపై అలక మాని రీ–ఎంట్రీ ఇస్తాడు. ఇచ్చిన వెంటనే పాటందుకుంటాడు.

‘‘నల్లగొండా జిల్లాలోన
మునుగోడు మునిగిట్లోనా
అందరి అభిప్రమ్మేరకు
ప్రత్యర్థులందరిపైనా
పోటీకొస్తున్నా...
పోటీ చేస్తున్నా...
ఒహోహో... ఒహోహో...
అహహా... అహహా... అంటూ చేరిక అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి పాట పూర్తిచేశారు.

క్లైమాక్స్‌లో...
కాంగ్రెస్–గీతాంజలీ, పార్టీ అభ్యర్థీ చెట్టాపట్టాలేసుకుంటున్న ఫ్రేము ఫ్రీజవుతూ ఉండగానే...
‘‘ఎన్నాళ్లు పార్టీలో ఉంటారో తెలియదుగానీ...
ఈ ఎన్నికల వరకు కాంగ్రెస్‌లోనే ఉంటారు...’’
అనే ఎండ్‌కార్డు వాళ్లమీద పడుతుండగా...
‘‘శుభం’’

ఒకే ఊరు.. దారులు వేరు..

రాజకీయ ‘బంధువులు’ అన్నపూర్ణమ్మ, సురేశ్‌రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): ఇద్దరి మధ్య బంధుత్వం ఉంది. ఒకే ఊరు.. ఒక్కటే వాడ.. ఇళ్లు కూడా ఎదురెదురు.. ఒకేసారి రెండు వేర్వేరు నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలుగా ఎంపికయ్యారు. వారే మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ, మరొకరు ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు, మాజీ స్పీకర్ కేఆర్ సురేశ్‌రెడ్డి. అన్నపూర్ణమ్మ అప్పటి అధికార పార్టీ టీడీపీ నుంచి ఆర్మూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైతే.. కేఆర్ సురేశ్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్షంలో ఉన్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన ఇద్దరు నేతలు ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఉత్తర తెలంగాణలో క్లీన్‌స్వీప్ చేసింది. ఆ ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి సురేశ్‌రెడ్డి ఒక్కరే కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎంపికై రికార్డు సృష్టించారు. అన్నపూర్ణమ్మ, సురేష్‌రెడ్డిలు వరుసకు అత్త, అల్లుడు అవుతారు.


అన్నపూర్ణమ్మ


సురేశ్‌రెడ్డి



నాలుగో సింహం ఓటు వేట

అలుపు కొంత.. గెలుపు కొంత

శ్రీరంగం కామేష్

వారంతా చట్టాన్ని కాపాడే విధుల్లో సత్తా చాటారు.. కానీ చట్టాలు చేసే పదవిని మాత్రం ఆశించిన స్థాయిలో పొందలేకపోయారు! ప్రజలను రక్షించే బాధ్యతలను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించిన వారు ‘పొలిటికల్ సైన్స్’లో మాత్రం ఫెయిలయ్యారు!! ప్రత్యక్ష లేదా పరోక్ష రాజకీయాల్లో తమ మార్కును చాటలేకపోయారు... ఖాకీ నుంచి ఖద్దరు వైపు మళ్లిన కొందరు పోలీసుల ప్రస్థానం ఇది.

ఉమ్మడి ఏపీ మొదలు తెలంగాణలో పోలీసు యూనిఫాం వదిలి ఖద్దరు తొడిగిన మాజీ అధికారుల్లో విజయం సాధించిన వారి సంఖ్య అతితక్కువే. ముగ్గురు మాత్రమే మంత్రి పదవులు అలంకరించగలిగారు. మిగిలిన వారిలో కొందరు పార్టీ పదవుల్లో పనిచేసినా, చేస్తున్నా వారివి తెర వెనుక పాత్రలే అయ్యాయి.

ఏమాత్రం ప్రభావం చూపలేక...

కొందరు మాజీ పోలీసు అధికారులు రాజకీయాల్లోకి వచ్చినా ఏ మాత్రం తమ ఉనికి చాటలేకపోయారు. కనీసం ఎన్నికల్లో పోటీ, గెలపోటములు, పెద్దల సభలు, నామినేటెడ్ పదవులు సహా ఏ ఒక్కటీ తమ ఖాతాల్లో వేసుకోలేకపోయారు. క్లిష్ట సమయంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసి ఘర్షణల్ని అదుపు చేయమంలో తనకు తానే సాటి అని పేరొందిన ఐపీఎస్ అధికారి ఎంవీ భాస్కర్‌రావు. ఆపై రాష్ట్ర డీజీపీగానూ పని చేశారు. ఈయన రాజకీయంగా మిగిలిన వారి కంటే మరో అడుగు ముందుకు వేశారు. పదవీ విరమణ పొందిన అనంతరం ఈయనే సొంతంగా ఆంధ్రనాడు పేరుతో పార్టీ స్థాపించారు. విజయవాడ సీపీగా, వరంగల్ ఎస్పీగా పనిచేసిన సమయంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న ఐపీఎస్ అధికారి డీటీ నాయక్ రిటైరయ్యాక ప్రజారాజ్యం పార్టీలో చేరారు. మహబూబాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. టీడీపీ తరఫున గతంలో వరంగల్ ఎంపీగా పోటీ చేసిన దొమ్మాట సాంబయ్య ఇన్‌స్పెక్టర్‌గా కరీంనగర్ జిల్లాలో పని చేస్తూ వీఆర్‌ఎస్ తీసుకున్నారు.

రీఎంట్రీ ఇచ్చింది ఒక్కరే...

ఖాకీ వదిలి ఖద్దరు తొడిగాక తిరిగి ‘వెనక్కు’ రావడం దాదాపు అసాధ్యం. అయితే హైదరాబాద్‌లోని చిలకలగూడ ఠాణాలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన హనుమంతరావు పీఆర్పీ ఆవిర్భావంతోనే వీఆర్‌ఎస్ తీసుకొని ఆ పార్టీలో చేరారు. విజయనగరం జిల్లా సాలూరు నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆపై మళ్లీ పోలీసు ఉద్యోగంలో చేరారు. అదనపు ఎస్పీ వరకు పదోన్నతులు కూడా పొందారు.

- సీనియర్ ఐపీఎస్ రావులపాటి సీతారామరావు రిటైరయ్యాక టీడీపీలో, రిటైర్డ్ డీఐజీ స్థాయి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ డీజీ స్థాయి అధికారి ఎస్‌కే జయచంద్రం బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.
- రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా నడుస్తున్న సమయంలో వివాదాస్పద పరిస్థితుల్లో తన డీఎస్పీ పోస్టుకు రాజీనామా చేసిన నళిని తొలుత టీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపారు. ఆపై బీజేపీలో చేరారు.
- త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నిలిచిన మాజీ ఐపీఎస్ అధికారి, కాగజ్‌నగర్ నుంచి పోటీ చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ భవితవ్యం ఎలా ఉంటుందో వేచి చూడాలి.


పేర్వారం రాములు


దినేష్‌రెడ్డి

అలా మెరిసి.. ఇలా తెరమరుగై...

హైదరాబాద్ పోలీసు కమిషనర్ నుంచి డీజీపీ వరకు అనేక కీలక పోస్టుల్లో పనిచేసిన ఐపీఎస్ అధికారి వి.దినేష్‌రెడ్డి పదవీవిరమణ అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విధానాలకు ఆకర్షితుడై రాజకీయాల్లోకి దిగాలని నిర్ణయించుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2014 సాధారణ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆపై బీజేపీ చేరినా ప్రస్తుతం సైలెంట్ అయ్యారు. డీజీపీ ర్యాంక్‌లో ఉండి హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన తొలి ఐపీఎస్ అధికారి పేర్వారం రాములు ఆపై ఉమ్మడి ఏపీ డీజీపీగానూ వ్యవహరించారు. రిటైర్మెంట్ అనంతరం తొలుత టీడీపీలో చేరిన ఆయన ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో చేరారు. అయినప్పటికీ పొలిటికల్‌గా తన మార్కు చూపించుకోలేకపోయారు.

మంత్రులుగా ముగ్గురే...

- ఉమ్మడి రాష్ట్ర డీజీపీగా పనిచేసిన 1954 బ్యాచ్ ఐపీఎస్ అధికారి పీవీ రంగయ్య నాయుడు 1991లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. అప్పటి పీవీ నరసింహారావు కేబినెట్‌లో 1996 వరకు కేంద్ర మంత్రిగా పని చేశారు. ఆపై ఎమ్మెల్సీగానూ వ్యవహరించారు.
- హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా పని చేసిన కె.విజయరామారావు, ఆపై సీబీఐ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు. రిటైరయ్యాక టీడీపీలో చేరి 1999లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. చంద్రబాబు మంత్రివర్గంలో వాణిజ్య పన్నులు, రోడ్లు భవనాల శాఖల్ని పర్యవేక్షించారు. 2004 ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఆయన ఇటీవలే కన్నుమూశారు.
- వరంగల్ జిల్లా మదనపల్లెలో పుట్టిన పి.బలరామ్‌నాయక్ మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించారు. కానిస్టేబుల్ ఉద్యోగం నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారిన నాయక్ 2009లో రాజకీయాల్లోకి వచ్చారు. ఎంపీగా గెలిచి యూపీఏ–2లో కేంద్ర మంత్రిగానూ పనిచేశారు.


పీవీ రంగయ్య


బలరామ్‌నాయక్


కె.విజయరామారావు

జంగ్ తెలంగాణ
పంచతంత్రం

“వరి ధాన్యం సేకరణకు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నాయంటే, బీజేపీ ప్రచార సారథి, మాజీ సీఎం రమణ్‌సింగ్ తన పంటను సైతం ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వానికే విక్రయిస్తూ వస్తున్నారు...!”

- నవంబర్ 7న తొలి దశ పోలింగ్ జరగనున్న వేళ రాష్ట్రంలో వినిపిస్తున్న జోక్ ఇది. ఇది అతిశయోక్తేమీ కాదని బీజేపీ నేతలు, కార్యకర్తలు కూడా అంటుండటం విశేషం! ఎలాంటి వివక్షా లేకుండా అర్హులైన రైతులందరికీ పథకాన్ని వర్తింపజేస్తుండటం భూపేశ్ బఘేల్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో అతి పెద్ద సానుకూలాంశం కానుందని వారూ పరోక్షంగా ఒప్పుకుంటున్నారు...

వరి బోనసే గట్టెక్కిస్తుంది..!



ఛత్తీస్‌గఢ్‌లో సీఎం బఘేల్ ధీమా

రైతుల్లో కాంగ్రెస్ పట్ల సానుకూలత

పథకం ప్రభావంపై బీజేపీలో గుబులు

ఛత్తీస్‌గఢ్‌లో తొలి దశ పోలింగ్‌కు ఇంకా పది రోజులే ఉంది. అధికార కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. సీఎం భూపేశ్ బఘేల్ మాత్రం 2018 నుంచీ వరి పంటకు తాము అందిస్తూ వస్తున్న రూ.600 బోనస్ ఈసారి తమను సునాయాసంగా ఎన్నికల గండాన్ని గట్టెక్కిస్తుందని ధీమాగా ఉన్నారు. రైతుల స్పందన ఆయన నమ్మకాన్ని గట్టిపరిచేదిగానే ఉండటం విశేషం!

రైతుకు బోనస్ భరోసా...

విత్తు దశ నుంచి ధాన్యం చేతికొచ్చి అమ్ముడయ్యే దాకా అడుగడుగునా దైవాధీనంగానే సాగే సాగుకు బఘేల్ ప్రభుత్వం ఒక భరోసా కల్పించిందన్నది ఛత్తీస్‌గఢ్ రైతుల నోట వినిపిస్తున్న మాట. నిజానికి క్వింటా వరికి రూ.300 చొప్పున బోనస్ చెల్లిస్తామని 2013 అసెంబ్లీ ఎన్నికల వేళ బీజేపీ వాగ్దానం చేసింది. కానీ గెలిచి అధికారంలోకి వచ్చాక రెండేళ్లు చెల్లించి చేతులెత్తేసింది. ఇది 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అవకాశాలను బాగా దెబ్బ తీసింది. అందుకే, బఘేల్ హయాంలో రైతులకు మంచి రోజులొచ్చాయని బస్నా గ్రామానికి చెందిన హేమ్‌సింగ్ నిషాద్ అనే రైతు అభిప్రాయపడ్డాడు. ‘రమణ్‌సింగ్ సర్కారు ఎన్నికల హామీల అమలులో విఫలమైంది. కాంగ్రెస్ అలా కాకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకుంది’ అన్నాడతను. ‘భూపేశ్‌తో మాకు లబ్ధి చేకూరింది. రమణ్‌సింగ్ మాటిచ్చి తప్పారు’ అంటూ జుడా గ్రామానికి చెందిన శోభారాం భరద్వాజ్ అనే రైతు నిష్ఠూరమాడాడు. తన 18 ఎకరాలకు ప్రభుత్వం నుంచి ఏటా రూ.1.5 లక్షలకు పైగా బోనస్ అందుతోందని దుర్గ్ జిల్లాలోని పటన్ ప్రాంత రైతు ఖేమ్‌రాజ్ చంద్రాకర్ చెప్పుకొచ్చాడు. వరి రైతులందరిలోనూ చంద్రాకర్ తరహా స్పందనే కనిపిస్తోంది.

పార్టీలకతీతంగా...

పార్టీలు, రాజకీయాలతో నిమిత్తం లేకుండా ప్రతి రైతుకూ బోనస్ పథకాన్ని వర్తింపజేస్తుండటం బఘేల్ సర్కారు విశ్వసనీయతను మరింత పెంచిన అంశం. తాను బీజేపీ కార్యకర్తనని, అయినా తనకూ ఠంచనుగా బోనస్ అందుతోందని సద్వాయ్ గ్రామానికి చెందిన గులాబ్ వర్మ చెప్పాడు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తమకు ఎంతో సాయం అందుతోందని బెమెటరా జిల్లాలోని ఉమారియా గ్రామానికి చెందిన ఖైర్దిన్ సాహు అనే మహిళా రైతు సంతోషం వెలిబుచ్చారు. బఘేల్ హయాంలో రైతులకు చాలా మేలు జరిగిందన్నది వాస్తవమని మాజీ సీఎం రమణ్‌సింగ్ స్వగ్రామం రాంపూర్‌కు చెందిన తులారాం అనే రైతు చెప్పుకొచ్చారు.

కోటి మంది ఓటర్లపై ప్రభావం.

వరికి బోనస్ పథకంతో దాదాపు 26 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందుతున్నారు. వారి కుటుంబాల్లో వారందరినీ కలిపితే కనీసం కోటి మంది ఓటర్లు ఈ పథకం తాలూకు లబ్ధిదారులన్నమాట! ఇది రాష్ట్రంలోని మొత్తం ఓటర్ల సంఖ్యలో ఏకంగా సగం కావడం విశేషం. ఈ అంశమే కాంగ్రెస్‌కు ధీమాను కల్పిస్తూ బీజేపీకి గుబులు పుట్టిస్తోంది. ‘ఒక్క రైతులనే కాదు, అన్ని వర్గాలూ బఘేల్ పాలన పట్ల ఎంతో కొంత సంతృప్తిగా కనిపిస్తున్నాయి. ఎవరిని కదిలించినా ఆయనకు మరో అవకాశం ఇద్దామన్న ధోరణే కనిపిస్తోంది’ అని గులాబ్ వర్మ వంటి బీజేపీ కార్యకర్తే చెబుతుండటం పరిస్థితికి అద్దంపడుతోంది!

- కౌలు రైతులు మాత్రం బఘేల్ తీరుపై పెదవి విరుస్తున్నారు. ఆయన అందిస్తున్న బోనస్ కామందులకే అందుతోంది తప్ప తమకు ఒరుగుతున్నదేమీ లేదన్నది వారి ఆవేదన. ‘ప్రభుత్వం నుంచి అందుతున్న నగదును వాళ్లు మాకైతే ఇవ్వరుగా. ఏడు గంటలు పొలాల్లో కష్టపడితే మాకు దక్కేది కేవలం రూ.110. ఈ తలరాత అయితే మారదుగా’ అన్న వారి అసంతృప్తిపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. ఈ పథకం కేవలం ధనిక రైతులకే లబ్ధి చేకూరుస్తోందంటూ జోరుగా ప్రచారం చేస్తోంది.

ఏమిటీ పథకం...?

- బఘేల్ సర్కారు 2018లో అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ కిసాన్ న్యాయ యోజనను అమల్లోకి తెచ్చింది.
- దీనికింద ప్రతి ఎకరాకు 15 క్వింటాళ్ల చొప్పున వరిని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తుంది.
- అలా కొనుగోలు చేసే ప్రతి క్వింటాలుకు కనీస మద్దతు ధరకు అదనంగా రూ.600 చొప్పున చెల్లిస్తోంది.
- అలా ప్రతి రైతుకు ఎకరాకు రూ.9,000 చొప్పున నేరుగా అందిస్తూ వస్తోంది.
- ఈ ఖరీఫ్‌లో వరికి కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,040 కాగా బఘేల్ సర్కారు రైతులకు రూ.2,640 చెల్లించింది.
- ఇది దేశంలోనే అత్యధికం!
- పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి ఈ బోనస్‌కు ఢోకా ఉండదు. ప్రకృతి విపత్తులు తదితర కారణాలతో పంట చేతికిరాని సందర్భాల్లో ఇది రైతులకు ఎంతో ఊరటగా నిలిచింది.
- ఇలా సేకరించిన ధాన్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ప్రభుత్వమే విక్రయిస్తుంది.
- ఈ పథకం వల్ల ఛత్తీస్‌గఢ్‌లో దాదాపు 26 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందుతున్నారు.
- వచ్చే సీజన్ నుంచి ఒక్కో రైతు నుంచి ప్రతి ఎకరాకు వరి సేకరణను 20 క్వింటాళ్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- దాంతో ఎకరాకు అందే బోనస్ రూ.12,000కు పెరగనుంది.
- గెలిస్తే క్వింటాకు రూ.3,600కు పెంచుతామని మంత్రి చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గెహ్లోత్ కుమారుడికి ఈడీ సమన్లు

- ఫెమా కేసులో నేడు విచారణకు రావాలంటూ వైభవ్‌కు నోటీసు
- రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సహా పలువురి నివాసాల్లో సోదాలు
- పరీక్ష పేపర్ లీకేజీ కేసులో దర్యాప్తు చేస్తున్న ఈడీ
- కేంద్రం గూండాగిరీకి పాల్పడుతోందన్న సీఎం అశోక్ గెహ్లోత్



జైపూర్: రాజస్తాన్‌లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరీక్ష పేపర్ లీకేజీ కేసులో మనీల్యాండరింగ్ ఆరోపణలపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, పాఠశాల విద్యాశాఖ మాజీ మంత్రి గోవింద్ సింగ్ దోతాస్రా ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాడులు జరిపింది. అదేవిధంగా, విదేశీ కరెన్సీ నిబంధనల ఉల్లంఘన కేసులో సీఎం అశోక్ గెహ్లోత్ కుమారుడు వైభవ్‌కు సమన్లు జారీ చేసింది. శుక్రవారం ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఆయన్ను కోరింది. సీఆర్‌పీఎఫ్ బలగాల బందోబస్తు నడుమ గురువారం ఈడీ అధికారుల బృందం జైపూర్, సికార్‌లలోని గోవింద్ సింగ్ ఇళ్లలో సోదాలు చేపట్టారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఈయన సికార్ జిల్లాలోని లచ్చమన్‌గఢ్ నుంచి పోటీలో ఉన్నారు. అదేవిధంగా, దౌసా జిల్లాలోని మహువా సీటుకు పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి ఓం ప్రకాశ్ హుడ్లా, మరికొందరి ఇళ్లలో కూడా సోదాలు చేపట్టినట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. 2022 డిసెంబర్‌లో రాజస్తాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సీనియర్ టీచర్ గ్రేడ్–2 పరీక్షలో జనరల్ నాలెడ్జి ప్రశ్నపత్రం లీకైంది. అప్పటి విద్యాశాఖ మంత్రి గోవింద్‌సింగ్ తదితరులు కలిసి ఒక్కో అభ్యర్థి నుంచి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేసి, ఈ దందాకు పాల్పడినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

వైభవ్‌పై ఆరోపణలేంటి?

సీఎం గెహ్లోత్ కుమారుడు వైభవ్ విదేశీ మారక ద్రవ్య మార్పిడి చట్టం కేసును ఎదుర్కొంటున్నారు. 2011 నుంచి ఈ కేసుకు సంబంధించిన పత్రాలను సమకూర్చుకోవాల్సి ఉన్నందున వైభవ్ శుక్రవారం విచారణకు హాజరుకాకపోవచ్చని ఈడీ అంటోంది. విచారణ వాయిదా కోరవచ్చని భావిస్తోంది. రాజస్తాన్‌కు చెందిన ట్రిటాన్ హోటల్స్ అండ్ రిసార్ట్స్, వార్ధా ఎంటర్‌ప్రైజెస్ సంస్థల ప్రమోటర్లకు చెందిన జైపూర్, ఉదయ్‌పూర్, ఢిల్లీల్లోని పలు ప్రాంతాల్లో ఆగస్టులో ఈడీ సోదాలు జరిపింది. వీరికి వైభవ్ గెహ్లోత్‌తో సంబంధాలున్నట్లు ఈడీ అనుమానిస్తోంది. దాడుల్లో రూ.1.2 కోట్ల లెక్కల్లో చూపని నగదును గుర్తించింది.

కేంద్రం గూండాగిరీ: సీఎం గెహ్లోత్

ఎన్నికల వేళ తాజా పరిణామాలపై సీఎం అశోక్ గెహ్లోత్ స్పందించారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తున్న హామీలను చూసి భయపడే గూండాగిరీకి బీజేపీ తెరతీసిందని సీఎం అశోక్ గెహ్లోత్ ఆరోపించారు. ‘ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలడంతో ఈడీని అడ్డుపెట్టుకుని భయోత్పాతం సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. బీజేపీ బెదిరింపులకు తాము లొంగేది లేదు’ అని గెహ్లోత్ స్పష్టం చేశారు. ఈడీ అనే మిడతల దండుతో చివరికి నష్టపోయేది బీజేపీయేనని వ్యాఖ్యానించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈడీ, ఐటీ, సీబీఐలను కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యకర్తలుగా మార్చేసుకుందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రాజస్తాన్‌లో ఓటమి ఖాయమని తెలిసే, చివరి ప్రయత్నంగా ఇటువంటి చర్యలకు దిగిందన్నారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, సీఎం గెహ్లోత్‌తో పొసగని మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ కూడా ఈడీ చర్యలపై స్పందించారు. సీఎం గెహ్లోత్‌కు మద్దతు పలికారు. బీజేపీ ఇలాంటి జిమ్మిక్కులతో తమ నేతలను భయపెట్టలేదని వ్యాఖ్యానించారు. 2020లో తన ప్రభుత్వంపై పైలట్ సారథ్యంలో జరిగిన తిరుగుబాటు యత్నం విఫలమైందంటూ తాజాగా గెహ్లోత్ వ్యాఖ్యానించడం గమనార్హం.

కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది: బీజేపీ

ఈడీ సోదాలను రాజకీయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఈ శతాబ్దంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం సీఎం గెహ్లోత్ ప్రభుత్వమని సొంతపార్టీ నేతలే విమర్శిస్తున్నారని బీజేపీ నేత, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల ఆరోపణలు పూర్తిగా నిరాధారాలంటూ ఆయన కొట్టిపారేశారు. అవినీతి వ్యవహారంలో పెద్ద చేపలను పట్టుకునేందుకే ఈడీ చర్యలు ప్రారంభించిందని మంత్రి షెకావత్ చెప్పారు. రాష్ట్ర అసెంబ్లీలోని 200 సీట్లకు నవంబర్ 25న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

ఛత్తీస్‌గఢ్‌లో మత మార్పిడుల మార్కెట్ తెరిచారు

ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌పై అస్సాం సీఎం హిమంతబిశ్వశర్మ ధ్వజం

మహాసముంద్: ఛత్తీస్‌గఢ్‌లో సనాతన ధర్మాన్ని బలహీనపర్చడానికి ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ మత మార్పిడుల మార్కెట్ తెరిచారని అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు హిమంత బిశ్వశర్మ ఆరోపించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని, డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. గురువారం మహాసముంద్ సిటీలో ఎన్నికల ప్రచార సభలో హిమంత బిశ్వశర్మ ప్రసంగించారు. అయోధ్యలోని రామ మందిరాన్ని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఏనాడూ దర్శించుకోలేదని ఆయన ఆక్షేపించారు. బాబర్ అభిమానులకు కోపం వస్తుందన్న కారణంతోనే ఆయన అయోధ్య రామమందిరానికి దూరంగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులకు శ్రీరాముడంటే ఏమాత్రం భక్తి లేదని, వారంతా ఎల్లప్పుడూ బాబర్‌ను మాత్రమే ఆరాధిస్తుంటారని మండిపడ్డారు. అయోధ్యలో భవ్య రామమందిరాన్ని నిర్మించడానికి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏమాత్రం చొరవ చూపలేదని అన్నారు. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ ఘనత సాధిస్తున్నారని కొనియాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ పాలనలో సనాతన ధర్మంపై దాడి జరుగుతోందని, గిరిజనులను మతం మార్చడానికి కుట్రలు కొందరు కుట్ర పన్నుతున్నారని హిమంత బిశ్వశర్మ ఆరోపించారు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023

పెయిడ్‌న్యూస్‌పై దృష్టి సారించాలి

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ కమిటీ చైర్మన్ రోనాల్డ్ రాస్ తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా పరిశీలనకు ప్రత్యేకంగా ఒక ఎక్స్‌పర్ట్‌ను నియమించుకోవాలని ఆయన సూచించారు.



ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు.

-10లో

అదనంగా ఒకరిని అనుమతించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 31న జరిగే ఓయూ స్నాతకోత్సవంలో 979 మంది పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందుకోనున్నారు. కానీ ఠాగూర్ ఆడిటోరియం సీట్ల పరిమితి కంటే అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటంతో వారి వెంట వచ్చే వారికి అనుమతి ఇవ్వడంలేదు. గతంలో మాదిరి డాక్టరేట్ డిగ్రీని అందుకునే వారి వెంట ఒకరు హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

వచ్చేసింది చలిపులి

సాక్షి, సిటీబ్యూరో: నగర పరిధిలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గత ఐదు రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రత 32 డిగ్రీల వరకు నమోదవుతోంది. రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత 17 డిగ్రీలకు పడిపోతూ వస్తోంది. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో రాత్రి 9 గంటల తర్వాత చలి ప్రభావం పెరుగుతోంది. గురువారం హైదరాబాద్‌లో 31.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా కనిష్ట ఉష్ణోగ్రతలు 17.7 డిగ్రీలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో 13.4 డిగ్రీలకు పడిపోయింది. రాబోయే రోజుల్లో చలితీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.

రేపటి నుంచి టీఎస్‌సెట్-2023

ఉస్మానియా యూనివర్సిటీ: రేపటి నుంచి మూడు రోజుల (ఈ నెల 28, 29, 30 తేదీల్లో) పాటు జరిగే టీఎస్ సెట్-2023 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురువారం అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసివేయనున్నట్లు తెలిపారు. టీఎస్‌సెట్ పరీక్ష నిబంధనలు పాటించాలని అభ్యర్థులకు సూచించారు. మొత్తం 40,838 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ బీఎల్‌ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు గురువారం అక్బర్‌బాగ్ దిల్‌ఖుష్ ఫంక్షన్ హాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరై మాట్లాడారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఈజీగా పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా బూత్ వివరాలు తెలియజేసి, ఓటరు జాబితాలో తమ పేర్లను రీ- చెక్ చేసుకుకోవడానికి ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 31లోగా ఓటరు లిస్ట్‌లో మార్పులు చేర్పులు చేసే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మలక్‌పేట ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సర్కిల్-6 డీసీ జయంత్, సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ, డీపీఓ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి

సాక్షి, సిటీబ్యూరో: అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించడంలో ఫ్లయింగ్‌స్క్వాడ్స్‌ది ముఖ్య భూమిక అని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ అన్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్స్ సమర్థంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫ్లయింగ్‌స్క్వాడ్స్, ఎస్ఎస్‌టీలకు ఎంసీసీ నోడల్ అధికారి ప్రకాశ్ రెడ్డి, అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్‌లతో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రాస్ మాట్లాడుతూ.. తనిఖీల్లో అనుసరించాల్సిన పద్ధతులు, సాంకేతికతపై వివరించారు. ఎన్నికలకు సంబంధం లేని నగదును, వస్తువులను ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వెంటనే విడుదల చేయాలని సూచించారు. విక్రమ్‌సింగ్‌మాన్ మాట్లాడుతూ.. తనిఖీల్లో సీజ్ చేసిన నగదుకు సంబంధించిన వీడియో కావాలని ప్రజలు కోరితే రూ.300 చలానా కడితే ఇవ్వవచ్చునని తెలిపారు. విమానాశ్రయాల వద్ద విదేశాల నుంచి వచ్చేవారిని తనిఖీలు చేయాలన్నారు. తనిఖీలు నిర్వహించాల్సిన విధానం, తదితరమైన వాటి గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.



దుర్గమ్మా.. వెళ్లిరావమ్మా

శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు హుస్సేన్ సాగర్‌కు తరలిస్తున్నారు. గురువారం ఎన్టీఆర్ మార్గ్‌లో దుర్గామాత ప్రతిమలను భక్తులు భారీ ఎత్తున తీసుకువచ్చారు. నిమజ్జనం ఆలస్యం కావడంతో ట్రాలీల్లో అలసిపోయి ఇలా నిద్రలో మునిగిపోయారు.





కమలం వర్సెస్ జనసేన

బీజేపీ ఆశావహులపై అనుకోని పిడుగు

- పొత్తుతో ఆశలు చిత్తేనని ఆ పార్టీ నేతల ఆందోళన
- కీలకమైన రెండు స్థానాలపై జనసేన పట్టు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో భారతీయ జనతా పార్టీ అంతర్గత సీట్ల సర్దుబాటుతో ఇప్పటికే సతమతమవుతుంటే... ఉరుములేని పిడుగులా వచ్చిపడ్డ జనసేన పొత్తు ఆ పార్టీకి మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా కమలం పార్టీకి బలమున్న, గెలుపు ఆశలున్న స్థానాలు నగరం, చుట్టుపక్కలే ఎక్కువ. గత మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఆ పార్టీ దాదాపుగా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేంత స్థాయిలో సత్తా చాటిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో పలు నియోజకవర్గాల్లో బీజేపీ సీట్ల కోసం బారులు తీరిన ఆశావహుల సంఖ్య బాగానే ఉంది. ఈ నేపథ్యంలో అనూహ్యంగా తెరమీదకు వచ్చిన జనసేన పొత్తు తమ సీటును ఎక్కడ తన్నుకు పోతుందోననే ఆందోళన నగర కమలం పార్టీ నేతల్లో నెలకొంది.

నేడో రేపో ఖరారు ..

ఇప్పటికే ఇరు పార్టీల మధ్య తొలిదఫా చర్చలు జరిగాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలిశారు. ఆ సందర్భంగా పోటీ చేయకుండా తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా పవన్‌ను కోరినట్టు.. ఇప్పటికే తాము తెలంగాణలో పోటీకి నిర్ణయం తీసుకున్నాం కాబట్టి అది సాధ్యం కాదని తేల్చిచెప్పినట్టు సమాచారం. దాంతో పొత్తు కుదురకపోవచ్చని ఊపిరి పీల్చుకున్న కాషాయ పార్టీ ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లుతూ పవన్- అమిత్‌షా భేటి తెరమీదకు వచ్చింది. ఆ తర్వాత కిషన్‌రెడ్డితో కలిసి పవన్ కళ్యాణ్ బుధవారం అమిత్‌షాతో చర్చలు జరపడంతో పొత్తు పొడిచింది. పొత్తు తమ టికెట్‌కి ఎక్కడ ఎసరు తెస్తుందోననే ఆందోళన బీజేపీ నాయకుల్లో మొదలైంది.

'పల్లి'లపైనే లొల్లి..

నగరంలో కీలక స్థానాలపై కన్నేసిన జనసేన పలు స్థానాలను అడుగుతున్నట్టుగా తెలిసింది. ముఖ్యంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి సీట్ల విషయంలో జనసేన పట్టుదలగా ఉన్నట్టు చెబుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో బీజేపీని నమ్ముకుని జెండాకు అండా దండగా ఉన్న నాయకులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. వీరిని సర్దుబాటు చేయడమే సమస్య అనుకుంటే ఇప్పుడు జనసేన కూడా ఆ సీట్లపైనే పట్టుపట్టడంతో బీజేపీ నాయకత్వానికి తలనొప్పులు తప్పేలా లేవు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున గజ్జెల యోగానంద్ పోటీ చేసి ఓడిపోయారు. మరోసారి బీజేపీ టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ కుమారుడు రవికుమార్ యాదవ్ కూడా గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. వీరిద్దరే ఢీ అంటే ఢీ అన్నట్టు ఉన్నారనుకుంటే ఇటీవలే కమ్మ సామాజిక వర్గం ప్రతినిధిగా నేను సైతం అంటూ ముప్పా సత్యనారాయణ తెరపైకి వచ్చారు. ఇలా వీళ్లంతా పోటీపడుతుంటే అకస్మాత్తుగా పొడిచిన పొత్తు వీరి ఆశలపై నీళ్లు చల్లేసింది. ఇప్పటి దాకా నియోజకవర్గంలో చడీచప్పుడు లేని జనసేన పార్టీకి ఇక్కడ ఇంత వరకూ ఎమ్మెల్యే అభ్యర్థి అంటూ ఎవరూ లేరు. ప్రస్తుతానికి చూస్తే చిరంజీవి అభిమాన సంఘం నేత సమ్మెట ప్రసాద్, కాపు నేత మిరియాల రాఘవరావు వంటి పేర్లు మాత్రం వినిపిస్తున్నాయి.


తలకిందులైన ఆశలు..

ఇక జనసేన రాష్ట్రంలో తొలిసీటు ఇదే కావాలని మరీ గట్టిగా పట్టుబడుతున్న కూకట్‌పల్లి నియోజకవర్గంలోనూ బీజేపీ ఆశావహుల సంఖ్య తక్కువేమీ లేదు. కొంత కాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, ప్రేమ్‌కుమార్‌తోపాటు గత ఎన్నికల్లో ఓడిపోయిన కాంతారావు సైతం మరోసారి క్యూలో ఉన్నారు. వీళ్లంతా ఈ సీటు జనసేనకు వెళ్లే అవకాశం ఉందని తెలియడంతో తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు. కూకట్‌పల్లిలో జనసేనకు ఏ మాత్రం పట్టు లేదని, ఆ పార్టీ గెలిచే పరిస్థితి లేదు కాబట్టి కమలం పార్టీ అభ్యర్థే నిలబడేలా చూడాలని వీరంతా ఎవరి స్థాయిలో వాళ్లు తుది ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇక జనసేన పార్టీ విషయానికి వస్తే.. ఎమ్మెల్యే అభ్యర్థి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నేమూరి శంకర్ గౌడ్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఏదేమైనా.. జనసేనతో పొత్తు గ్రేటర్ పరిధిలో బీజేపీలో అనుకోని మార్పులకు, అంతర్గత కల్లోలాలకు కారణం అవడం తథ్యంగా కనిపిస్తోంది.

హస్తంలో ఉత్కంఠ!

నేడు విడుదల కానున్న మలి విడత జాబితా

- నగరంలోని సెగ్మెంట్లకు అభ్యర్థుల ఖరారు పూర్తి
- బుజ్జగించేందుకు రంగంలో దిగిన సీనియర్లు



సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీలో మలి విడత జాబితాపై ఉత్కంఠ నెలకొంది. మహానగర పరిధిలోని మిగిలిన అసెంబ్లీ సెగ్మెంట్లకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) దాదాపు పూర్తి చేసింది. ఇప్పటికే తొలి జాబితాలో సగానికి పైగా సెగ్మెంట్లకు అభ్యర్థులను ప్రకటించిన పార్టీ అధిష్టానం.. మిగతా వాటికి కూడా అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. ఈసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దింపే అభ్యర్థులను ఆచితూచి ఎంపిక చేస్తోంది. పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) శుక్రవారం విడుదల చేసే జాబితాలో నగర అసెంబ్లీ సెగ్మెంట్లకు కూడా అవకాశం లభించవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పలు సెగ్మెంట్లలో పోటీ తీవ్రంగా ఉండటంతో స్క్రీనింగ్ కమిటీ రెండుసార్లు భేటీ అయి అభ్యర్థుల బలాబలాలను అంచనా వేసి సెగ్మెంట్‌కు ఇద్దరేసి అభ్యర్థులను గుర్తించింది. వారిలో సైతం గెలుపు అవకాశాలు, విధేయత, కుల సమీకరణాలు, సర్వేల ఆధారంగా అభ్యర్థిత్వాలను ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఇటీవలే అభ్యర్థుల జాబితాను స్క్రీనింగ్ కమిటీ నివేదించగా సీఈసీ ఆమోదించడంతో విడుదలకు రంగం సిద్ధమైంది.

బుజ్జగింపుల పర్వం..

మలి జాబితా సిద్ధం కావడంతో విడుదలకు ముందే అసంతృప్తులను అంచనా వేసి పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఇద్దరు, ముగ్గురు పోటీపడుతున్న నియోజకవర్గాల్లో టికెట్ వచ్చే అవకాశం లేని వారిని బుజ్జగిస్తోంది. టికెట్ రాని నేతలకు భవిష్యత్తులో తగిన న్యాయం చేస్తామని హామీ ఇస్తోంది. ఇప్పటికే ముఖ్యనేతలు ఆశావహులతో ఫోన్లో మాట్లాడటం, మరోవైపు సీనియర్లు రంగంలోకి దింపి వారి ఇళ్లకు వెళ్లి సంప్రదింపులు జరుపుతోంది.

వీరిలో ఎవరికో..

గ్రేటర్ పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు అభ్యర్థిత్వాలను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు పారిజాత నర్సింహారెడ్డి లేదా చల్లా నర్సింహారెడ్డి, శేరిలింగంపల్లికి రఘునాథ్ యాదవ్ లేదా జగదీశ్వర్ గౌడ్, ఎల్బీ నగర్‌కు మధుయాష్కీ గౌడ్ లేదా ముద్దగొని రాంమోహన్ గౌడ్, ఇబ్రహీంపట్నంకు మల్‌రెడ్డి రంగారెడ్డి, కూకట్ పల్లికి గొట్టిముక్కల వెంగళరావు లేదా సత్యం శ్రీరంగం, రాజేంద్రనగర్‌కు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లేదా గౌరీ సతీష్, జూబ్లీహిల్స్‌కు అజారుద్దీన్ లేదా విష్ణువర్ధన్‌రెడ్డి, ఖైరతాబాద్‌కు రోహిన్ రెడ్డి లేదా విజయారెడ్డి, అంబర్‌పేటకు రోహిత్ లేదా నూతి శ్రీకాంత్ గౌడ్, చార్మినార్‌కు అలీ మస్కతి, కంటోన్మెంట్‌కు వెన్నెల (గద్దర్ కూతురు) లేదా పిడమర్తి రవిలలో ఒకరి అభ్యర్థిత్వాలు ఖరారు చేసినట్లు సమాచారం.

ఒక్క భవనం.. ఆరేడు పోలింగ్ కేంద్రాలు



9 నియోజకవర్గాల్లో 37 లొకేషన్లలో..

- ఒక్క పోలింగ్ కేంద్రమే ఉన్న భవనాలు 441
- మిగతా ప్రాంతాల్లో రెండు, అంతకన్నా ఎక్కువ

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి హైదరాబాద్ జిల్లాలో ఒకే భవనం/లొకేషన్‌లో ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇవి రెండు నుంచి ఆరు.. అంతకంటే ఎక్కువ కూడా ఏర్పాటు కానున్నాయి. ఓటరు జాబితాలో పేరు నమోదు కోసం దరఖాస్తులకు ఇంకా అవకాశం ఉన్నందున నమోదయ్యే ఓటర్ల సంఖ్యను బట్టి అనుబంధ పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుత ఓటర్ల జాబితా మేరకు జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 1,688 భవనాలను/లొకేషన్లను 3,986 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు గుర్తించారు. వీటిలో 9 నియోజకవర్గాల పరిధిలోని 37 లొకేషన్లలో ఆరు అంతకంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. 14 నియోజకవర్గాల్లోని 48 లొకేషన్లలో ఐదేసి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. 15 నియోజకవర్గాల్లోని 212 ప్రాంతాల్లో నాలుగు చొప్పున పోలింగ్ కేంద్రాలు, 306 భవనాల్లో మూడేసి పోలింగ్ కేంద్రాలు, 644 భవనాల్లో రెండు చొప్పున ఏర్పాటు కానున్నాయి. 441 భవనాల్లో మాత్రం ఒకే పోలింగ్ కేంద్రం ఏర్పాటు కానుంది.

ఆరు, అంతకంటే ఎక్కువ..

ఒకే చోట 6 అంతకంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్న నియోజకవర్గాలు, భవనాలు/లొకేషన్ల సంఖ్య ఇలా ఉంది: ముషీరాబాద్ (5), మలక్‌పేట (4), అంబర్‌పేట (3), ఖైరతాబాద్ (6), జూబ్లీహిల్స్ (6), నాంపల్లి (3), కార్వాన్ (3), యాకుత్‌పురా (4), సికింద్రాబాద్ (3).

- 14 నియోజకవర్గాల్లో ఒకే ప్రాంతంలో ఐదేసి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వాటిల్లో ముషీరాబాద్‌లో తొమ్మిది ప్రాంతాల్లో, కార్వాన్‌లో ఆరు ప్రాంతాల్లో మలక్‌పేట, యాకుత్‌పురా, జూబ్లీహిల్స్‌లో నాలుగేసి ప్రాంతాల్లో, నాంపల్లి, బహదూర్‌పురా, కంటోన్మెంట్‌లలో మూడేసి భవనాల్లో, అంబర్‌పేటలో రెండు భవనాల్లో ఏర్పాటు కానున్నాయి. ఖైరతాబాద్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో ఒక్కో భవనంలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.
- ఒక పోలింగ్ కేంద్రంలో వెయ్యి మందికి మించిన ఓటర్లుంటే అనుబంధ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. కొత్తగా నమోదయ్యే వారి పేర్లతో అనుబంధ జాబితాగా వెలువరిస్తారు.

అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వండి

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యంపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. అక్రమంగా మద్యం నిల్వ చేయకుండా ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసింది. మరోవైపు దాడులను సైతం ఉధృతం చేసింది. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు శంషాబాద్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, తదితర ప్రాంతాల్లో 2800 లీటర్ల మద్యాన్ని, 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సత్యనారాయణ తెలిపారు. గత ఏడాది ఇదే నెలలో విక్రయించిన మద్యం కంటే 30 శాతం అధికంగా మద్యం విక్రయించే షాపులపైన నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

నిల్వలపై సమాచారం ఇవ్వండి...

ఎక్కడైనా అక్రమంగా మద్యాన్ని నిల్వచేసినట్లు తెలిస్తే ప్రజలు తమకు సమాచారం అందజేయాలని సత్యనారాయణ కోరారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. అక్రమ మద్యంపై 040-24657471, 87126 58725లకు సమాచారం ఇవ్వవచ్చు. వారి వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతారు.

క్యాబ్‌వాలా.. ఓటేయాలా!



క్యాబ్ సంస్థలపైనా నియంత్రణ ఉండాలి



డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేకంగా తెలంగాణ డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాం. క్యాబ్ సంస్థలపై నియంత్రణ లేకపోవడంతో డ్రైవర్‌ల కమిషన్‌లు రోజు రోజుకు తగ్గుతున్నాయి. దీంతో వాహనాల ఈఎంఐలు కూడా చెల్లించలేకపోతున్నాం. అన్ని ట్యాక్సీల్లో మీటర్ రీడింగ్ పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టాలి. కిలోమీటర్‌కు రూ.17 చొప్పున కనీస చార్జీ ఉండాలి.

– షేక్ సలావుద్దీన్, గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్, అధ్యక్షుడు

వీరి ఓట్లపై ప్రధాన పార్టీల దృష్టి

- గ్రేటర్‌లో 4.5 లక్షల క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్
- క్యాబ్‌లలో కమిషన్‌ల పెంపు కోసం డిమాండ్
- గతంలో నిరవధిక సమ్మెలకు దిగిన డ్రైవర్లు
- క్యాబ్ సంస్థలపై నియంత్రణ ఉండాలని డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వివిధ వర్గాలు తమ సమస్యలను పార్టీల మేనిఫెస్టోల్లో చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో ప్రజలు సంఘటితమవుతున్నారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని సుమారు 4.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ తదితర గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్లపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. అసంఘటిత రంగానికి చెందిన ఈ కార్మికుల సమస్యలు అనేక ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు, ముఖ్యంగా ఉబెర్, ఓలా వంటి క్యాబ్ అగ్రిగేటర్ సంస్థలు, స్విగ్గి, జొమోటో వంటి డెలివరీ సంస్థల్లో పని చేస్తూ కాలంతో పోటీ పడుతున్నప్పటికీ సరైన వేతనాలు లభించడం లేదని, కమిషన్‌లలో భారీగా కోత విధించడం వల్ల వాహనాలకు ఈఎంఐలు కూడా చెల్లించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసంఘటిత రంగానికి చెందిన ఈ డ్రైవర్లు, కార్మికుల ఓటు బ్యాంకుపై రాజకీయ పార్టీలు దృష్టి సారించిన నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించే పార్టీలకే జైకొడతామని వారు స్పష్టం చేస్తున్నారు.

నిరవధిక సమ్మెలు చేసినా దక్కని ఫలితం...

- క్యాబ్ సంస్థల్లో కమిషన్‌లు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌లతో గతంలో అనేకసార్లు నిరవధిక సమ్మెలు చేపట్టారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి క్యాబ్ సేవలను నిలిపివేశారు. క్యాబ్ సంస్థల కార్యాలయాల ఎదుట, రవాణా కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించారు. ముఖ్యంగా కోవిడ్‌తో క్యాబ్ రంగం అతలాకుతలమైంది. ఈఎంఐలు కూడా చెల్లించలేని దుస్థితిలో చాలామంది వాహనాలను వదిలేసుకొని ఈ రంగం నుంచి వెళ్లిపోయారు. అనంతరం పరిస్థితులు చక్కబడడంతో క్యాబ్‌లు తిరిగి రోడ్డెక్కాయి.
- మరోవైపు డెలివరీ సంస్థల్లో ఇబ్బడిముబ్బడిగా సిబ్బందిని నియమించడంతో కమిషన్‌లలో భారీగా కోత పడింది. గతంలో 8 గంటలు పని చేస్తే రూ.1100 వరకు లభించగా కొంతకాలంగా రూ.600 మాత్రమే వస్తున్నాయని డెలివరీ బాయ్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ సంస్థలకు చెందిన డెలివరీబాయ్స్ సేవలను నిలిపివేసి ఆందోళనకు దిగారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం దక్కలేదు. తాజా ఎన్నికలతో వారిలో కొత్తగా ఆశలు చిగురిస్తున్నాయి. తమ సమస్యలను ప్రధాన పార్టీల ముందుంచుతున్నారు.

విన్నపాలు వినవలె..

- గ్రేటర్‌లోని ఓలా, ఉబెర్, రాపిడో డ్రైవర్లు, పోర్టర్లు, స్విగ్గి, జొమాటో, బ్లింక్, డుంజో, బిగ్ బాస్కెట్, షాడో ఫాక్స్, అర్బన్ కంపెనీ తదితర సంస్థల్లో సుమారు 4.5 లక్షల మంది పని చేస్తున్నారు.
- ఇటీవల రాజస్థాన్ ప్రభుత్వం గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు సాంఘిక భద్రత కల్పిస్తూ కొత్త చట్టాన్ని తెచ్చింది. అదే తరహాలో తెలంగాణలోనూ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి.
- అన్ని సంస్థల్లో జరిగే ప్రతి లావాదేవీపై కొంత మొత్తాన్ని రుసుముగా విధించి దానిని కార్మికుల సంక్షేమ సెస్‌గా వినియోగించాలి. గిగ్ అండ్ ప్లాట్‌ఫాం కార్మికుల సాంఘిక భద్రత నిధిగా డిపాజిట్ చేయాలి.
- అగ్రిగేటర్ సంస్థలు, కార్మిక సంఘాలు, ప్రభుత్వ ప్రతినిధులతో ఒక త్రైపాక్షిక బోర్డును ఏర్పాటు చేయాలి, ఆ బోర్డు ఆధ్వర్యంలో కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలి.
- అగ్రిగేటర్ల సంస్థల్లో జరిగే ఆర్థిక లావాదేవీలన్నిటిని కనిపెట్టి నిర్వహించేందుకు ఒక కేంద్రీకృత ఉమ్మడి పోర్టల్ ను ఏర్పాటు చేయాలి.
- ఈ వ్యవస్థ వ్యక్తిగత బిల్లులు, చార్జీలు, కమిషన్లు, కార్మికుల చెల్లింపులు, ఫీజులు, పన్నులతో సహా అన్ని వివరాలను అందజేసే విధంగా ఉండాలి.

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్
- సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

నాగోలు: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి సరూర్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో భద్రత, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు తమ వంతు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి సిబ్బందికి ఎప్పటికప్పుడు అవసరమైన సలహాలు. సూచనలను అందిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాచకొండ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామని, అక్రమంగా తరలిస్తున్న డబ్బును పట్టుకోవడానికి అవసరమైన చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఎల్‌బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ పంకజ, అధికారులు పాల్గొన్నారు.


సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఎమ్మెల్యే హర్షవర్ధన్, ఎమ్మెల్సీ చల్లా వేధిస్తున్నారు!

- కోకాపేటలోని 2.30 ఎకరాల భూ వివాదం
- గోల్డ్‌ఫిష్ కంపెనీతో చల్లా డెవలప్‌మెంట్ అగ్రిమెంట్
- కంపెనీ వాటాలను నిర్ధారించకుండా తాత్సారం
- పదేళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్ట్ నిర్మాణ పనులు
- గోల్డ్‌ఫిష్ అబోడ్ కంపెనీ ఎండీ చంద్రశేఖర్ వేగే ఆరోపణలు



సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి తనను వేధిస్తున్నారని, రాజకీయ పలుకుబడితో తనపై తప్పుడు కేసులు పెట్టి భయాందోళనలకు గురి చేస్తున్నారని గోల్డ్‌ఫిష్ అబోడ్ కంపెనీ ఎండీ చంద్రశేఖర్ వేగే ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా తమపై పీడీ యాక్ట్ నమోదు చేయిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తప్పుడు పత్రాలు, ఆరోపణలతో తనపై, తన కంపెనీపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కోకాపేటలోని స్థలంపై గోల్డ్ ఫిష్ సంస్థకు, ఎమ్మెల్సీ చల్లాకు మధ్య కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా చల్లా చేసిన ఆరోపణలపై వివరణ ఇస్తూ గురువారం బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్‌లో చంద్రశేఖర్ వేగే విలేకరుల సమావేశం నిర్వహించారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

- కోకాపేటలోని సర్వే నంబరు 85లో 2.30 ఎకరాల స్థలంలో ప్రాజెక్ట్‌ను నిర్మించాలని కంపెనీ భావించింది. ఈ క్రమంలో కంపెనీ డైరెక్టర్ కాటం అశ్వంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌కు ప్రధాన పెట్టుబడిదారుడిగా తన సమీప బంధువైన చల్లా వెంకట్రామిరెడ్డి ఆసక్తిగా ఉన్నారని చెప్పడంతో సంస్థ యాజమాన్యం అందుకు అంగీకరించింది. దీంతో కంపెనీ ప్రతినిధి వాసుదేవరెడ్డి, చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి సర్వే నంబరు-85లో ఉన్న 2.30 ఎకరాల వ్యవసాయ భూమిని అగ్రిమెంట్ ఆఫ్ సేల్ హోల్డర్స్‌గా 2013 మార్చిలో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. ఆ తర్వాత ఈస్థలాన్ని ఎమ్మెల్సీ, ఇతరుల పేర్లపై సేల్ డీడ్ పూర్తి చేశాం.
- నిబంధనల ప్రకారం 2013 మేలో చల్లా వెంకట్రామిరెడ్డి ఈ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు డెవలప్‌మెంట్ కమ్ జనరల్ పవరాఫ్ అటార్నీ చేస్తూ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో 4 బేస్‌మెంట్లు+గ్రౌండ్+38 అంతస్తులలో హైరైజ్ భవనాన్ని నిర్మించాలని నిర్ణయించాం.
- ఈ మేరకు ప్రొవిజన్ నిర్మాణ అనుమతుల కోసం 2014 జూన్‌లో దరఖాస్తు చేసుకోగా.. డిసెంబర్ 12 నాటికి భూ మార్పిడి, హెచ్ఎండీఏ నుంచి నిర్మాణ అనుమతులతో పాటు ఎయిర్‌పోర్ట్ అథారిటీ, ఫైర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, పర్యావరణ అనుమతులన్నీ లభించాయి. అయితే 2014లో రాష్ట్ర విభజనతో హైదరాబాద్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రతికూల పరిస్థితులు సద్దుమణిగే వరకూ కంపెనీ, ఎమ్మెల్సీ ఇరువురూ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను నెమ్మదించాలని నిర్ణయించుకున్నాం. అప్పటికే తొలుత పెట్టిన పెట్టుబడులకు అదనంగా రూ.12 కోట్లు ఖర్చు చేశాం.
- హెచ్ఎండీఏ నుంచి తుది అనుమతులు, కంపెనీ బిల్టప్ ఏరియా వాటాలను నిర్ధారించే సప్లిమెంటరీ అగ్రిమెంట్‌పై ఎమ్మెల్సీ సంతకాలు చేయకుండా తాత్సారం చేశారు. దీంతో ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మరోవైపు కరోనా మహమ్మారితో నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో ప్రాజెక్ట్ వ్యవహారం గందరగోళంలో పడిపోయింది. ప్రాథమిక ఒప్పందంలో లేని అంశాలను లేవనెత్తుతూ ప్రాజెక్ట్‌కు అడ్డుపడుతుండటంతో పరిస్థితులను చక్కదిద్దేందుకు కంపెనీ కొత్త ఒప్పందాన్ని ఎమ్మెల్సీ ముందు ఉంచింది. ప్రాజెక్ట్ కొనసాగించడం ఎమ్మెల్సీకి ఇష్టంలేని పక్షంలో వారు పెట్టిన పెట్టుబడికి పది రెట్లు అంటే రూ.40 కోట్లు చెల్లిస్తామని, ఆ తర్వాత ఒప్పందం నుంచి వైదొలిగితే ఆగిపోయిన ప్రాజెక్ట్‌ను కంపెనీ టేకోవర్ చేస్తుందని వివరించాం.
- అయితే ఈ ఒప్పందాన్ని అంగీకరించని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి తనకున్న రాజకీయ పలుకుబడితో గోల్డ్‌ఫిష్ కంపెనీ యాజమాన్యం, ఉద్యోగులపై కేసులు పెట్టించడం మొదలుపెట్టారు. దీంతో కంపెనీ ఎండీ అయిన నేను 21 రోజుల పాటు జైలులో గడపడమే కాకుండా పలు ప్రభుత్వ అధికారులు, నాయకుల నుంచి ప్రాజెక్ట్ నుంచి వైదొలగాలని తీవ్ర ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. నిజాలను ఎదుర్కోలేక చల్లా వెంకట్రామి రెడ్డి తమను మోసగాళ్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. వీరి ఆరాచకాలను చట్టబద్ధంగా ఎదుర్కొంటామని ఆయన పేర్కొన్నారు.

రాచకొండలో 12 మంది బైండోవర్



సాక్షి, సిటీబ్యూరో: శాసనసభ ఎన్నికలకు రాచకొండ పోలీసులు సన్నద్ధమయ్యారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన రౌడీ షీటర్లను ముందస్తుగా బైండోవర్ చేశారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో గురువారం కోర్ట్ ప్రొసీడింగ్స్ నిర్వహించి క్రిమినల్ ప్రొసీజర్ ప్రకారం 12 మందిని బైండోవర్ చేశారు. సత్ప్రవర్తనతో మెలగాలని, చట్ట విరుద్ధమైన నేర కార్యకలాపాలలో పాల్గొని భవిష్యత్తు పాడుచేసుకోవద్దని ఈ సందర్భంగా కమిషనర్ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు.

ఓయూ 83వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్‌కు గౌరవ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 83వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వీసీ ప్రొ.రవీందర్ తెలిపారు. గురువారం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 31న క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు స్నాతకోత్సవ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర గవర్నర్, ఓయూ ఛాన్స్‌లర్ తమిళి సై సౌందరరాజన్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి అమెరికాకు చెందిన అడోబ్ కంపెనీ సీఈవో, ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజీ పూర్వ విద్యార్థి పద్మ శ్రీ శంతన్‌నారాయణ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఓయూ అత్యున్నత గౌరవ డాక్టరేట్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. వివిధ పీజీ కోర్సుల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు, 979 మందికి పీహెచ్‌డీ పట్టాలను అందజేస్తామన్నారు. బంగారు పతకాలు సాధించిన వారిలో ఆరుగురు పురుషులు కాగా, 39 మంది మహిళలు ఉండటం విశేషం. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎంట్రీ పాస్‌లు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఎంట్రీ పాస్ తప్పని సరిగా వీసీ పేర్కొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సాక్షి,సిటీబ్యూరో : గొల్ల కుర్మ యాదవుల కోసం యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబుకు విజ్ఞప్తి చేసింది. గురువారం గాంధీభవన్‌లో సమితి అధ్యక్షులు వంశీ మోహన్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించింది. సమాజంలో 20 శాతం ఉన్న యాదవులకు ప్రాధాన్యత ఇవ్వాలని, సీట్ల కేటాయింపులలో ప్రధాన భాగస్వామ్యం కల్పించాలని, రాజకీయ, ఆర్థిక రంగాల్లో తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు.. బృందంలో మేకల రాములు యాదవ్ తదితరులు ఉన్నారు.

యువకుడి దారుణ హత్య


మహ్మద్ నవీద్ గఫార్ ఖురేషి (ఫైల్)

సంతోష్‌నగర్: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిని హత్య చేసిన సంఘటన గురువారం సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... ఈదిబజార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఘనీ ఖురేషి కుమారుడు మహ్మద్ నవీద్ గఫార్ ఖురేషి (19) మహ్మద్‌నగర్‌లోని తండ్రి మటన్ షాపులో పని చేసేవాడు. కాగా ఇటీవల నవీద్, మోయిజ్‌తో పాటు మరికొందరు శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడ్డారు. అప్పటి నుంచి వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం మధ్యాహ్నం నవీద్ షాప్‌లో కూర్చుని ఉండగా అక్కడికి వచ్చిన మోయిజ్ నవీద్‌పై కత్తితో దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన నవీద్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం ఓవైసీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి ఘనీ ఖురేషి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బి.రోహిత్ రాజు, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్ పి.శివచంద్రలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి హత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు.

బైక్ అదుపుతప్పి మహిళ మృతి



అరుణ (ఫైల్)

కుత్బుల్లాపూర్: బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదిరెడ్డిబండకు చెందిన ఒరుసుస్వామి, అరుణ(20) భార్యాభర్తలు. ఈ నెల 24న అరుణ సోదరుడు నాగరాజు బైక్‌పై తన సోదరిని ఎక్కించుకుని ఎల్లమ్మబండకు వెళుతుండగా కోణార్క్ ఆస్పత్రి రోడ్డులో స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పడంతో అరుణ కింద పడింది. ఆమె తలకు తీవ్రగాయం కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. తన భార్య మృతికి కారణమైన నాగరాజు, మైనర్‌కు బైక్ ఇచ్చిన సంపంగి శ్రీను లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురి రిమాండ్

డబీర్‌పురా: గుట్టుచప్పుడు కాకుండా డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను డబీర్‌పురా పోలీసులు గురువారం అరెస్ట్ చేసి వారి నుంచి 12 గ్రాముల డ్రగ్స్, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన మీర్జా అస్గర్ అలీ బేగ్, మహమ్మద్ సాజిద్, సైదాబాద్‌కు చెందిన మహమ్మద్ అబ్దుల్ సలామ్ ఖాన్ ఆలియాస్ ఫైజాన్ స్నేహితులు. వీరు ముగ్గురు గత రెండేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారు. వీరు తక్కువ ధరకు పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను కొనుగోలు చేసి అవసరమైన వారికి అధిక ధరలకు విక్రయించేరు. దీనిపై సమాచారం అందడంతో యాంటీ నార్కోటిక్ బ్యూరో పోలీసులు డబీర్‌పురా పోలీసులతో కలిసి స్థానిక రజియా మసీదు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 12 గ్రాముల డ్రగ్స్, బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం డబీర్‌పురా పోలీసులకు అప్పగించగా, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

స్కూల్ బస్సు ఢీ కొని మహిళ దుర్మరణం


జ్యోతి మృతదేహం


జ్యోతి (ఫైల్)

రసూల్‌పురా: బ్రేకులు ఫెయిలైన స్కూల్ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన కార్ఖాన పీఎస్ పరిధిలోని పల్లవి మోడల్ స్కూల్‌లో గురువారం చోటు చేసుకుంది. సీఐ విద్యాసాగర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూప్రాన్ మండలం, పోతారం గ్రామానికి చెందిన కుమ్మరి జ్యోతి భర్త యాదగిరి ఇద్దరు పిల్లలతో కలిసి హస్మత్‌పేటలో ఉంటూ గత పదేళ్లుగా పల్లవి మోడల్ హైస్కూల్‌లో ఆయాగా, బస్సు క్లీనర్‌గా పనిచేస్తోంది. దసరా సెలవుల అనంతరం గురువారం పాఠశాల పునఃప్రారంభం కావడంతో పాఠశాల ఆవరణలోని బస్సుల పార్కింగ్ స్థలం నుంచి స్కూల్‌లోకి వెలుతుండగా అదే సమయంలో బస్సు బ్రేకులు ఫెయిలై అదుపు తప్పి జ్యోతిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కార్ఖాన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదానికి కారకమైన బోయిన్‌పల్లి బాపూజీనగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ సంతోష్‌కు లైసెన్స్ లేదని పాఠశాలకు చెందిన పలు బస్సులు కండీషన్‌లో లేవని పలువురు డ్రైవర్లు ఆరోపించడం గమనర్హం.

చెస్‌తో ఏకాగ్రత.. జ్ఞాపకశక్తి వృద్ధి


విద్యార్థులతో చెస్ ఆడుతున్న గ్రాండ్ మాస్టర్ దీపన్ చక్రవర్తి

శ్రీనగర్‌కాలనీ: చెస్‌తో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మేధస్సు పెరుగుతుందని, ప్రపంచ మేధావుల్లో అధికశాతం చెస్ క్రీడాకారులేనని గ్రాండ్ ఏషియన్ జూనియర్ గోల్డ్ మెడలిస్ట్, కామన్‌వెల్త్ బ్రాంజ్ మెడల్ విజేత గ్రాండ్ మాస్టర్ జీఎం దీపన్ చక్రవర్తి, కెనెడా చెస్ ఫౌండేషన్ ఫౌండర్ రాహుల్ విశ్వనాథ్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న కోచింగ్ క్యాంప్‌ను గ్రాండ్ మాస్టర్ దీపన్ చక్రవర్తి, రాహుల్ విశ్వనాథ్ ప్రారంభించారు. గ్రాండ్ మాస్టర్ అకాడమీ చెస్ క్రీడాకారులతో కలిసి ఒకేసారి చెస్‌ను ఆడారు. అసాధారణ రీతిలో చిన్నారులు అతడితో పోటీపడ్డారు. అకాడమీ విద్యార్థుల్లో విశేష ప్రతిభ ఉందని, రానున్న రోజుల్లో దేశానికి ఖ్యాతి తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. చెస్ క్రీడాకారులకు పలు సలహాలు, సూచనలు, మెళకువలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏక్రాగ చెస్ అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు, శీతల్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన నగదుపై ఎప్పటికప్పుడు విచారణ

జిల్లా ఫిర్యాదుల కమిటీ చైర్మన్ మధుసూదన్

సాక్షి,సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ చెక్ పోస్టుల వద్ద సీజ్ చేసి ఎన్నికలకు సంబంధం లేని నగదు, బంగారం ఇతరాత్ర వస్తువులపై విచారణ జరిపి ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఫిర్యాదుల కమిటీ చైర్మన్, హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో కమిటీ సభ్యులు హైదరాబాద్ జిల్లా ట్రెజరీ అధికారి డిప్యూటీ డైరెక్టర్ వసుంధర, శానిటేషన్ జాయింట్ కమిషనర్ సంధ్య, మెంబర్ సెక్రెటరీ శరత్ చంద్ర లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ ముందుకు రూ.12.30 కోట్ల విలువైన 110 కేసులు వచ్చినట్లు తెలిపారు. వాటిపై విచారణ జరిపి 78 కేసులకు సంబంధించిన రూ.3.40 కోట్ల నగదు, బంగారం విడుదల చేశామన్నారు. అదే విధంగా 8 కేసులను ఐటీ కి సిఫార్సు చేశామని, 17 కేసులు పెండింగ్‌లో ఉండగా మరో ఐదుగురు హాజరు కాకపోవడంతో రూ. 66,83,139 విలువైన నగదు, వెండి బంగారం కేసులను పరిష్కరించలేదనిన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్ పోస్టుల వద్ద పట్టుకున్న నగదు, సీజ్ చేసిన ఇతర వస్తువుల కారణంగా ప్రజలకు ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశ్యంతో ఎన్నికల నిబంధనల మేరకు వాటిని ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం డబ్బు, బంగారం, వెండి తీసుకొని వెళ్లే సందర్భంలో రశీదులు, సంబంధిత పత్రాలను వెంట ఉంచుకోవాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు

సుపారీ కేసులో రౌడీషీటర్ అరెస్టు


నిందితుడు మహ్మద్ ఖైసర్

నాంపల్లి: హత్య చేసేందుకు సుపారీ తీసుకున్న రౌడీషీటర్‌ను హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గోల్కొండ పోలీసు స్టేషన్ ప్రాంతానికి చెందిన వానరసి రాజును హత్య చేసిన వ్యక్తులను అంతమొందించేందుకు అతడి సోదరుడు గుడిమల్కాపూర్ ప్రాంతానికి చెందిన వానరాసి యాదగిరి హబీబ్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖైసర్ అలియాస్ చోర్ ఖైసర్ (54)ను సంప్రదించాడు. తన సహచరులతో కలిసి ఈ పనిని పూర్తి చేసేందుకు గాను మహ్మద్ ఖైసర్ రూ.2 లక్షలు డిమాండ్ చేశాడు. దీంతో యాదగిరి సదరు మొత్తాన్ని రౌడీషీటర్ మహ్మద్ ఖైసర్‌కు ఇచ్చినా అతను పని పూర్తి చేయడంలో విఫలమయ్యాడు. దీంతో యాదగిరి తాను ఇచ్చిన రూ.2లక్షలు తిరిగి ఇవ్వాలని కోరాడు. అయితే ఖైసర్ డబ్బులు తిరిగి ఇవ్వకపోగా మరో రూ.4 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో యాదగిరి అతడికి పలు దఫాలుగా రూ.3.5 లక్షలు చెల్లించాడు. అయితే మిగతా రూ.50 వేలు ఇచ్చేదాకా పని మొదలుపెట్టనని చెప్పడంతో రూ.20 వేలు ఒకసారి, రూ.15వేలు చొప్పున అతడికి అప్పగించాడు. మొత్తం డబ్బులు చెల్లించినా పని పూర్తి చేయకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. తన దగ్గర సుపారీ తీసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.

జేబుదొంగగా నేర జీవితం మొదలు...

జేబు దొంగగా నేర ప్రస్థానాన్ని ప్రారంభించిన మహ్మద్ ఖైసర్ 1995లో తన స్నేహితుడు అఖిల్‌తో కలిసి అఫ్జల్ అనే వ్యక్తిని హత్య చేశాడు. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత ఒక ముఠా ఏర్పాటు చేసి అమాయకులను బెదిరించి డబ్బులు లాక్కునేవాడు. అతడిపై మొత్తం 22 భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, క్రిమినల్ కేసులు ఉన్నాయి. అతడి నేర చరిత్ర కారణంగా 2011లో నగర బహిష్కరణకు గురైన అతను శిక్షాకాలం పూర్తయ్యాక హైదరాబాద్‌కు తిరిగి వచ్చాడు. మళ్లీ నేరాలకు పాల్పడుతుండటంతో 2014లో పోలీసులు అతడిపై పీడీ యాక్టును నమోదు చేసి జైలుకు పంపించారు. బయటికి వచ్చినప్పటి నుంచి తన నేర సామ్రాజ్యాన్ని మరింత విస్తరించిన అతను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు.

పెట్టుబడి పేరుతో రూ. 28 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ. 28 లక్షలు టోకరా వేశారు. సైబర్ క్రైం ఏసీపీ శివమారుతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తికి వాట్సాప్ కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు తాము చెప్పినట్లుగా ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పారు. విడతల వారీగా అతడితో రూ. 28 లక్షలు పెట్టిబడి పెట్టించి కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిటీ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

ప్రశాంతంగా దుర్గామాత నిమజ్జనాలు


నెక్లెస్ రోడ్డులో అమ్మవారి విగ్రహాలు

బంజారాహిల్స్: దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర ఊరేగింపులు గురువారం కూడా ప్రశాంతంగా కొనసాగాయి. చాలా చోట్ల బుధవారం అర్ధరాత్రి నుంచి ఈ శోభాయాత్రలు ప్రారంభం కాగా గురువారం సాయంత్రం వరకు ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లలో నిమజ్జనాలు చేశారు. నెక్లెస్ రోడ్డులో దుర్గామాత విగ్రహాలతో వాహనాలు బారులు తీరాయి. పెద్ద ఎత్తున ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్లలో విగ్రహాలు రావడంతో ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌ను మూసివేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


పాల్గొన్న ఆలయ చైర్మన్ నరసింహం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం 18లోని శ్రీ సీతారామస్వామి ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ముగిశాయి. మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సీవీ నరసింహం సునీత దంపతులు పాల్గొన్నారు. రెండు రోజులుగా వార్షికోత్సవ వేడుకలు ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకాలు, కలశాభిషేకాలు, బలిప్రదానం, ప్రాయశ్చిత్త హోమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేవీవీ రాఘవాచార్యులు ఆధ్వర్యంలో 11 మంది వేద పండితులు చిర్రాబూరి శ్రీరామశర్మ ఈ క్రతువును నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఢిల్లీకి 'ఆప్' నాయకులు

లిబర్టీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ఢిల్లీ బయలుదేరి వెళ్లింది. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు వచ్చే శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై జాతీయ నాయకత్వంతో చర్చించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ సారథ్యంలోని ప్రతినిధి బృందం గురువారం ఢిల్లీ బయలుదేరింది. పార్టీ జాతీయ కన్వీనర్ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జీ శాసన సభ్యులు సోమనాథ్ భారతితో పాటు రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో సమావేశం కానున్నారు. బృందంలో కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము తదితరులు ఉన్నారు.

'రాజ్యాంగాన్ని'దేశాన్ని రక్షించుకుందాం: ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్: దేశ పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి, కె.ధర్మేంద్ర విమర్శించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభల సందర్భంగా 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం-దేశాన్ని రక్షించుకుందాం' అనే నినాదంతో వీధి నడక ప్రచారం నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లో ప్రతి ఇల్లు, వ్యాపార సముదాయాలు తిరిగి రాజ్యాంగాన్ని-దేశాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్, మాజీద్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఈద్గా మైదానంలో డంపింగ్ యార్డ్ తొలగించండి

బంజారాహిల్స్: ఎంఎస్ మక్తాలో ఉన్న మసీదు ఈద్గా మైదానంలో చెత్తను పెద్ద ఎత్తున డంపింగ్ చేస్తున్నారని దీన్ని అరికట్టాలంటూ మజీదు ప్రతినిధులు గురువారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హెచ్ఎండీఏ ప్రహరీ గోడ వద్దనే చెత్తను డంపింగ్ చేస్తుండటంతో దుర్గంధంతో మసీదుకు వచ్చేవారితో పాటు ఇక్కడే ఉన్న మదరసా విద్యార్థులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కురుమలకు పది ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర జనాభాలో రెండో అతి పెద్ద కులం, సుమారు 8 నుంచి 10 శాతం (40 లక్షల జనాభా) ఉన్న కురుమలకు అన్ని రాజకీయ పార్టీలు పది సీట్లు కేటాయించాలని కురుమ సంఘం రాష్ట్ర నాయకులు విజ్ఞప్తి చేశారు. రూ. 10 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. గురువారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కురుమ సంఘం నాయకులు దేవర శ్రీనివాస్, శ్రీనాథ్ మాట్లాడుతూ... కురుమలకు గొర్లు, బర్లు కాదు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని అన్నారు. బీఆర్ఎస్ ఒక్క సీటు కుడా కురుమలకు కేటాయించపోవడం దారుణం అన్నారు.

ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఖైరతాబాద్ రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటేష్ దోత్రే

- బీఎల్‌వోలకు ఎన్నికల అధికారి దిశా నిర్దేశం
- ప్రతి బూత్‌లో హోమ్ టూ ఓటుపై అవగాహన కల్పించాలి
- బీఎల్‌వోల సమావేశంలో ఖైరతాబాద్ ఆర్‌వో వెంకటేష్ దోత్రే


పాల్గొన్న బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు

బంజారాహిల్స్: ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర ఎంతో కీలకమని అందువల్ల ప్రతి ఒక్క బీఎల్‌వో వారికి కేటాయించిన బూత్‌లలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఖైరతాబాద్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి వెంకటేష్ దోత్రే అన్నారు.

- గురువారం బంజారాహిల్స్‌లోని ముఫకంజా కాలేజీ ఆడిటోరియంలో ఖైరతాబాద్ నియోజకవర్గం బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు చేసే పనులు ఎంతో కీలకమని వారు బీఎల్‌వో సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.
- పోలింగ్ బూత్‌ల స్థితిగతులతో పాటు అక్కడ స్థానికంగా ఉన్న పరిస్థితులను పై అధికారులకు పోలీసులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలని సూచించారు. అదే విధంగా అక్కడ మౌలిక వసతులపై కూడా పూర్తి అవగాహన ఉండాలని పోలింగ్ రోజు ఉరుకులు పరుగులు పెట్టకుండా ముందుగానే అన్ని పనులు సమన్వయంగా చేసుకోవాలని సూచించారు.
- సమావేశంలో ఈఆర్‌వో ప్రశాంతి, ఏఈఆర్‌వోలు అనితారెడ్డి, సంజయ్ సింగ్‌లు పాల్గొన్నారు.

హోమ్ టూ వోట్‌పై అవగాహన కల్పించాలి...

- ఈ ఎన్నికల్లో ఎన్నికల సంఘం కొత్తగా 80 సంవత్సరాలు దాటిన వారికి దివ్యాంగులకు హోమ్ టూ వోట్ అనే విధానాన్ని తీసుకొచ్చిందని దానిపై ఆయా బూత్‌లలో 80 సంవత్సరాలు దాటిన వారిని, పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు వేయాలని దివ్యాంగులను గుర్తించి ముందుగానే వారితో డిక్లరేషన్ తీసుకోవాలని ఖైరతాబాద్ ఆర్‌వో వెంకటేష్ దోత్రే సూచించారు. ఇంటి నుంచి ఓటు వేసే వారికి ఫామ్-12(డి)ని ముందుగానే అందించాలని రెండు రోజుల్లో వారి ఆ ఫామ్‌ను నింపి ఇస్తే ఓటింగ్ రోజున ఇంటి నుంచే ఓటు వేసే వెసులు బాటు కల్పించే విధానాన్ని వివరించాలని సూచించారు

ఇంటింటికీ ఐయామ్‌ఏ ఓటర్ స్టిక్కర్లు...

- ఈసారి వినూత్నంగా ఓటర్లలో చైతన్యం నింపేందుకు ప్రతి ఓటరు ఇంటి గోడపై, లేదా తలుపులపై ఐయామ్‌ఏ ఓటర్ అనే స్టిక్కర్లు ఇంటింటికీ తిరిగి అతికించాలని ఆర్‌వో సూచించారు. ఈ స్టిక్కర్‌పై ఆ ఓటరు ఓటు వేసే పోలింగ్ బూత్ వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు. దీంతో ఆయా ఓటరు ఏ పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయాలనే విషయం తేలికగా తెలుసుకుంటారని అన్నారు.
- అదే విధంగా ఈ నెల 31వ తేదీ వరకు నూతన ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నందున అర్హత ఉన్న ప్రతి ఒక్కరి దృష్టికీ వెళ్లేలా ప్రచారం చేయాలని సూచించారు.

ఎన్నికల విధులకు గైర్హాజరైతే చర్యలు

బంజారాహిల్స్: ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగీ తప్పనిసరిగా ప్రతి శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని, అప్పగించిన ప్రతి బాధ్యతనూ తప్పనిసరిగా పాటించాలని ఖైరతాబాద్ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటేష్ దోత్రే అన్నారు. విధుల్లో అలసత్వం వహించడంతో పాటు గైర్హాజరయ్యే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సంఘం ఉద్యోగుల గైర్హాజరుపై సీరియస్‌గా ఉందని అందువల్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పని చేయాలని ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్న కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


మాట్లాడుతున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఆర్‌వో వెంకటేష్

బంజారాహిల్స్: నవంబర్ 30 జరిగే ఎన్నికలకు సంబంధించి ఖైరతాబాద్ నియోజకవర్గం డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ అండ్ కౌంటింగ్ (డీఆర్‌సీ) సెంటర్‌ను యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసినట్లు ఖైరతాబాద్ అసెంబ్లీ ఆర్‌వో వెంకటేష్ దోత్రే తెలిపారు. గురువారం ఖైరతాబాద్‌లోని నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం అయ్యారు. డీఆర్‌సీ సెంటర్‌ను సిద్ధం చేశామని సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని ఫైర్ సేఫ్టీ పరికరాలు కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నియోజక వర్గ పరిధిలో 245 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని వెల్లడించారు. వీటికి సంబంధించి స్ట్రాంగ్‌రూమ్‌లు పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య తీర్చిదిద్దామన్నారు. ఈవీఎంలు తీసుకొచ్చే క్రమంలో పార్టీల నేతలు కూడా వచ్చి చూడవచ్చన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లలో లోపు పార్టీ కార్యాలయాలు ఉండకూడదని అన్నారు. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని లేకపోతే అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు రాజకీయ పార్టీల ఏజెంట్ల ఫోన్ నంబర్లు కలిగి ఉండాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించకూడదని ఫిర్యాదులు ఉంటే రిటర్నింగ్ అధికారికి తెలపాలన్నారు. నియోజకవర్గ ఏఆర్‌వోలు ప్రశాంతి, ఏఈఆర్‌వోలు అనితారెడ్డి, సంపత్, సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దానంను భారీ మెజార్టీతో గెలిపిస్తాం: మేయర్


మేయర్‌ను కలిసిన నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బంజారాహిల్స్ కార్పొరేటర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో విజయలక్ష్మితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... ప్రతి ఇంటికీ బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలయ్యాయని ప్రజలు పూర్తిగా కేసీఆర్, కేటీఆర్, దానంకు అండగా నిలబడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా మరోసారి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని అన్నారు.

అగ్రగామిగా హైదరాబాద్: మాగంటి


నాగార్జుననగర్‌కాలనీవాసులతో సమావేశమైన ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: దేశంలోనే అభివృద్ధి, సంక్షేమంలో హైదరాబాద్ నగరం అగ్రగామిని నిలుస్తుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం శ్రీనగర్‌కాలనీ, ఎల్లారెడ్డిగూడ, తవక్కల్‌నగర్‌లలో ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం నాగార్జుననగర్ కమ్యూనిటీహాల్‌లో నాగార్జుననగర్‌కాలనీవాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాలనీల్లో సీసీరోడ్లు, సీవరేజ్‌లైన్లను కోట్ల రూపాయలతో నిర్మించామని, కాలనీ సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేశామన్నారు. కాలనీ అధ్యక్షుడు సీతారామయ్య, వైస్‌ప్రెసిడెంట్ కెఎస్ మౌలి, సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళామండలి అధ్యక్షురాలు సత్యవతి, కాలనీ అసోషియేషన్ ప్రతినిధులు, నేతలు అప్పుఖాన్, సంతోష్‌గౌడ్, యాదయ్య, ఫయాజ్, మధుయాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే మాదిగల మద్దతు

ఫిలింనగర్: రానున్న ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మాదిగ సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. గురువారం టీఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షుడు నల్ల శివ మాదిగ ఆధ్వర్యంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ దండోరా ఫౌండర్ జన్ను కనకరాజు మాదిగతో పాటు పలువురు మాదిగ సంఘాల నేతలు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డబుల్ బెడ్‌రూమ్ పథకంతో పాటు దళిత బంధు పథకంలో చాలా తక్కువ మందికి మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి న్యాయం జరిగిందని ఎన్నికల తర్వాత ప్రకటించే జాబితాలో మాదిగలకు తగు న్యాయం చేయాలని కోరారు. ఇదే విషయాన్ని తాము మంత్రి హరీష్‌రావు దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దళిత బంధుతోపాటు గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్ పథకాలు నిరంతర ప్రక్రియ అని, ఎన్నికలు ముగిసిన వెంటనే లబ్ధిదారుల్లో మాదిగలకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నేతలు బాలరాజు, గోపి, నర్సింగ్‌రావు, అశ్విన్, మహేష్, మైలారం సూరి పాల్గొన్నారు.

ఆజాలో కల్ట్ కలెక్షన్



సాక్షి, సిటీబ్యూరో: నాఫ్స్ ఆధ్వర్యంలో నగరంలోని ఆజా వేదికగా అద్భుతమైన 'కల్ట్ కలెక్షన్'ను గురువారం ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో మిసెస్ ఇండియా-2020 నీరూ మోహన్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రిజ్వాన్, షమ్సజ్ మాట్లాడుతూ... పాతకాలపు సోయగాలను ఆధునికీకరించి మరింత సౌందర్య హంగులను నగరవాసులకు అందిచడానికి ఈ కలెక్షన్‌ను ఆవిష్కరించామని తెలిపారు.

ఆరోగ్యవంతులందరూ రక్తదానం చేయాలి


రక్తదాన శిబిరంలో పాల్గొన్న టీఎస్ఎస్‌పీ అధికారులు

వెంగళరావునగర్: ఆరోగ్యవంతులందరూ ప్రతి ఆరు నెలలకొకసారైనా రక్తాన్ని దానం చేయాలని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ తెలిపారు. యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్‌లో గురువారం తలసీమియా, ఉప్పల వెంకయ్య మెమోరియల్ బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ... ఆరోగ్యవంతులైన వ్యక్తులు ప్రతి ఒక్కరూ తమ రక్తాన్ని దానం చేయాలన్నారు. ఈ విధంగా రక్తాన్ని దానం చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండటంతో పాటుగా తోటి వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చని, అత్యవసర సమయంలో మనం చేసే ఈ దానం వల్ల కుటుంబం నిలబడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాదాపు వంద మంది అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. డాక్టర్ దుర్గ, టీఎస్ఎస్‌పీ అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ రామదాసు, సత్యనారాయణ, రంగారెడ్డి, జవహర్‌లాల్, నర్సింహరాజు, ఆర్ఐలు ధర్మారావు, సాంబయ్య, ఆర్.శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

భారీ భద్రత నడుమ స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు


ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న ఖైరతాబాద్ నియోజకవర్గ ఆర్‌ఓ

బంజారాహిల్స్: ఎన్నికల అధికారులు గురువారం ఈవీఎంలను భారీ భద్రత నడుమ డీఆర్‌సీ సెంటర్లకు తరలించారు. అందులోభాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల తరలింపులో ఆర్‌ఓ వెంకటేష్ దోత్రే పాల్గొన్నారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 245 పోలింగ్ స్టేషన్లు ఉండగా 306 కంట్రోల్ యూనిట్లు, 306 బ్యాలెట్ యూనిట్లు 343 వీవీ ప్యాట్లను కేటాయించారు.



కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలు

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్


మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

లిబర్టీ: కాళేశ్వరం ప్రాజెక్టులో వేల కోట్ల రూపాయల అవినీతి చోటుచేసుకొని మేడిగడ్డ వంతెన పిల్లర్లు కుంగి పోయేందుకు కారణమైన సీఎం కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి, ప్రభుత్వ కార్యదర్శిలు, ఇంజినీర్‌లు, నిర్మాణ సంస్థపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఈ మొత్తం అవినీతి, అక్రమాలన సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ చేపట్టాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. కేసీఆర్ అక్రమ ఆస్తులను జాతీయం చేయటానికి రాష్ట్రపతి, సుప్రీం కోర్టు చర్యలు చేపట్టాలని కోరారు. గురువారం దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రూ. 17 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే రూ. 6 లక్షల కోట్ల మేర అప్పులు చేసి రాష్ట్ర ఖజానాని కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆయన ఆరోపించారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ వ్యాపార వర్గానికి దోచిపెట్టారని ఆరోపించారు. దళితుల సబ్ ప్లాన్ నిధులను రూ. 2 లక్షల కోట్లు దోచుకొని దళిత జాతి అభివృద్ధిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై విచారణ చేసి వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇద్దరితో ప్రేమాయణం.. మరో యువతితో నిశ్చితార్థానికి సిద్ధం

- నా వాడంటే నావాడంటూ యువతుల పోట్లాట
- తలలు పట్టుకున్న పోలీసులు
- నిందితుడి అరెస్టు: రిమాండుకు తరలింపు

వెంగళరావునగర్: ఇద్దరు యువతులను మోసం చేసి మూడో యువతితో పెళ్లి తంతుకు సిద్ధమైన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఆ వ్యక్తి తనకు మాత్రమే సొంతమంటూ మహిళలు కేసు పెట్టిన విచిత్రమైన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీలోని రాయచోటి ప్రాంతానికి చెందిన బాబా ఫక్రుద్దీన్ అనే యువకుడు మాదాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తుంటాడు. అదే ఆస్పత్రిలో పని చేసే యువతి రెండేళ్ల క్రితం అతనికి పరిచయం అయింది. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వెంగళరావునగర్ డివిజన్‌లోని ఒక బస్తీలో నివాసం ఉంటున్న యువతి రూముకు అనేకమార్లు వచ్చి తన కోర్కెను తీర్చుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత ఆమెకు చెప్పకుండా కార్ఖానాలోని మరో ఆస్పత్రిలో చేరాడు. అక్కడ పనిచేసే ఇంకో యువతితో సేమ్ సీన్ రిపీట్ చేశాడు. కట్ చేస్తే... (ఈ నెల 6న) ఎవరికీ చెప్పకుండా స్వగ్రామం వెళ్లాడు. అక్కడ తన ఇంటి పక్కనే ఉంటున్న యువతిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడు. ఈ నెల 24న నిశ్చితార్థం చేసుకోవాలనుకుని అనుకున్నాడు. పక్కాగా ప్లానింగ్ చేసి ఉంగరాలు, దండలు మార్చుకోవాలనుకునే సమయంలో సినీ ఫక్కీలో మధురానగర్ ఎస్ఐ ఇక్బాల్ షడన్‌గా రంగ ప్రవేశం చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిశ్చితార్థాన్ని చివరి నిమిషంలో అడ్డుకున్నాడు. అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగా వారికి అతని ఫ్లాష్‌బ్యాక్ మొత్తం చెప్పి నిందితుడిని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం అయిందనుకున్నారంతా... అయితే ఇక్కడే అసలు కథ మొదలైంది. ఫక్రుద్దీన్‌ను మధురానగర్‌కు తీసుకువచ్చారని తెలుసుకున్న బాధిత యువతులు బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అర్ధరాత్రి వరకు వీడు నా వాడు అంటే కాదు నా వాడంటూ ఇరువురు యువతులు వాదులాడుకున్నారు. దీంతో పోలీసులు అయోమయంలో పడ్డారు. ముందుగా నేను మోసపోయాను, కాబట్టి నాకే సొంతమంటూ ఒకరు, కాదు నేనూ సర్వస్వం అర్పించాను పెళ్లి చేసుకుంటానన్నాడు నాకు న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకున్నారు. సమస్య ఎలా పరిష్కరించాలో అర్థంకాక మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తోపాటు ఎస్ఐ ఇక్బాల్ తలలు పట్టుకున్నారు. ఎట్టకేలకు బాబా ఫక్రుద్దీన్‌ను పోలీసులు రిమాండ్ తరలించి ఊపిరిపీల్చుకున్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి

వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్


కవాతులో పాల్గొన్న డీసీపీ జోయల్ డేవిస్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ గురువారం ఆధ్వర్యంలో పోలీసుల కవాతు నిర్వహించారు. రౌడీ షీటర్ల నివాసాలకు వెళ్లి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ర్యంగా డీసీపీ మాట్లాడుతూ... ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రౌడీ షీటర్లు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్ట పరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. రౌడీ షీటర్ల కదలికలపై దృష్టి సారించాలని పోలీసు అధికారులకు సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు మరింత గస్తీని పెంచాలని ఆదేశించారు. ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏపీసీ వెంకటేశ్వరావు, బోరబండ డీఐ భూపాల్‌గౌడ్, సెక్టార్ ఎస్ఐలు సర్దార్‌జమాల్, మనోజ్‌కుమార్, తుల్జారాం, సప్నారెడ్డి, టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసు అధికారులు పాల్గొన్నారు. బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, హబీబ్‌ఫాతిమానగర్‌ల మీదుగా శ్రీరాంనగర్ వరకు కవాతు కొనసాగింది.

ఇరువర్గాల ఘర్షణ: కేసుల నమోదు

బంజారాహిల్స్: దుర్గామాత శోభాయాత్ర జరుగుతుండగా అటు నుంచి వెళ్తున్న యువకులపై దాడి జరిగిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని వడ్డె శ్రీధర్, తన స్నేహితుడు సాయి దేవ్, శివరాజ్, ఆనంద్, నాని, వంశీతో కలిసి గురువారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో వెంకటగిరిలో టిఫిన్ చేసి జూబ్లీహిల్స్ రోడ్ నెం. 92 స్టార్ బక్స్ హోటల్ మీదుగా ఇన్నోవాలో ఎన్బీటీనగర్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో దుర్గా మాత ఊరేగింపులో ఉన్న 50 మంది వరకు వీరు వెళ్తున్న వాహనాన్ని చూసి ఆపి మీరు పీజే టీమ్‌కు చెందిన వారంటూ తీవ్రంగా కొట్టారు. అతి స్పీడ్‌గా ఎందుకు వెళ్తున్నారంటూ ఊరేగింపులో వెళ్తున్న వారు ప్రశ్నించగా ఈ గొడవ జరిగినట్లు సమాచారం. ఈ దాడిలో శ్రీధర్‌తో పాటు మిగతా వారందరికీ గాయాలు కాగా వీరిచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపీసీ సెక్షన్ 341, 324,506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే తమ మీద కూడా దాడి చేశారంటూ ఫిలింనగర్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఫిలింనగర్ పోలీసులకు ఉదయం ఫిర్యాదు చేశారు. ఘటన జరిగిన ప్రదేశం తమ ప్రాంతంలో లేదని ఫిలింనగర్ పోలీసులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదును పంపించారు. ఈ ఘటనపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య గొడవగా తెలుస్తున్నది.

బీసీలు, మహిళలకు సీట్లు ఇవ్వాలి

పంజగుట్ట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు 50 శాతం, మహిళలకు 50 శాతం టిక్కెట్లు అన్ని పార్టీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జై భారత్, జ్వాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష సెల్ఫీల ఉద్యమం విజయవంతం కావడం కోట్లాది ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం అని ఆయా సంఘాల ప్రతినిదులు పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జై భారత్ జాతీయ కార్యదర్శి రజని, తెలంగాణ అధ్యక్షుడు సత్యనారాయణ, బీసీ నాయకులు నారగోని మాట్లాడుతూ... రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో జై భారత్ సామాజిక విప్లవ రణభేరి పేరుతో తమ ప్రచారం నిర్వహించామని సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 18 వరకు అన్ని నియోజకవర్గాల్లో సుమారు 10 లక్షల మందికి పైగా కలిశామని అందరూ బీసీలకు 50 శాతం, మహిళలకు 50 శాతం టిక్కెట్లు కేటాయించాలని సంపూర్ణ మద్దతు పలికారని తెలిపారు.



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి గురువారం శ్రీవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

వెల్లివిరిసిన సామాజిక చైతన్యం

- జగన్నినాదాల మధ్య 'సామాజిక సాధికార యాత్ర'కు శ్రీకారం
- ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమలలో ఘనంగా ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర
- తొలి రోజు యాత్ర, బహిరంగ సభలకు వేలాదిగా తరలివచ్చిన పేదలు
- అడుగడుగునా ఘన స్వాగతం.. సీఎం జగన్‌కు జేజేలు



అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం వద్ద సామాజిక సాధికార యాత్రకు స్వాగతం పలుకుతున్న జనసందోహం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలు.. రాష్ట్రంలో నేడు ఏ రంగంలో చూసినా వీరిదే అగ్రస్థానం. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన సామాజిక న్యాయం. అదే ఇప్పుడు రాష్ట్రమంతటా చైతన్యాన్ని రగిలించింది. జగన్నినాదమై మార్మోగుతోంది. సామాజిక సాధికారతై వెలుగులీనుతోంది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ 'సామాజిక సాధికార' బస్సుయాత్ర ప్రజల్లోకి చొచ్చుకెళ్లింది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమలో ఏకకాలంలో ప్రారంభమైన ఈ బస్సు యాత్ర రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన సామాజిక విప్లవాన్ని ప్రజల్లోకి విజయవంతంగా తీసుకెళ్తోంది. పార్టీకి చెందిన కోఆర్డినేటర్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతల ఆధ్వర్యంలో సాగుతున్న యాత్రకు ప్రజలు అడగడుగునా ఘన స్వాగతం పలుకుతు న్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తమకు పట్టంకట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఏకమై కదలివచ్చారు. తమకు జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రతిధ్వనించారు. రాష్ట్రంలో గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న సామాజిక న్యాయాన్ని.. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు ఆ వర్గాలకు చేసిన ద్రోహాన్ని వివరించి.. ఆ వర్గాలను ఏకం చేయడం ద్వారా 2024 ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను చేపట్టింది. ఈ యాత్ర గురువారం ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, కోస్తాలో గుంటూరు జిల్లా తెనాలి, రాయలసీమలో అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గాల నుంచి ప్రారంభమైంది. ఇచ్ఛాపురంలో ఆ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, తెనాలిలో ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్, శింగనమలలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఈ యాత్రకు నేతృత్వం వహించారు. ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమస నియోజకవర్గం బుక్కరాయసముద్రంలో సభలు జరిగాయి. ఈ సభలకు ప్రజలు పోటెత్తారు. సీఎం వైఎస్ జగన్ చేసిన సామాజిక న్యాయానికి నీరాజనాలు పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును మంత్రులు, నేతలు వివరించారు. ఆ ప్రసంగాలను ప్రజలు ఆసక్తిగా విన్నారు. ప్రసంగాల్లో నేతలు సీఎం వైఎస్ జగన్ పేరు ఎత్తుగానే.. 'మా నమ్మకం నువ్వే జగన్'.. 'జగనన్నే మా భవిష్యత్తు'.. 'జగనే రావాలి – జగనే కావాలి' అంటూ జనం ప్రతిస్పందించారు. సామాజిక సాధికార యాత్ర రెండో రోజు శుక్రవారం ఉత్తరాంధ్రలో గజపతినగరం, కోస్తాలో నరసాపురం, రాయలసీమలో తిరుపతిలో జరగనుంది.

క్లుప్తంగా...

లచ్చయ్య ఇంటి కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

- కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశం... తదుపరి విచారణ వచ్చేనెల 20కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కిష్టంపల్లిలో షెడ్యూల్ కులానికి చెందిన జి.లచ్చయ్య ఇచ్చిన వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని..ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. లచ్చయ్యకు గ్రామంలో తగిన రక్షణ కల్పించాలని స్పష్టం చేసింది. ఆధిపత్య కులాలకు చెందిన గృహాలకు పైభాగంలో తాను ఇల్లు కట్టుకున్నందుకు కూల్చివేశారని, తమపై దాడి కూడా చేశారని వివరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ లచ్చయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. తమపై దాడితో పాటుగా ఇల్లు కూల్చివేతపై పోలీసులు, కలెక్టర్ ఎవరూ స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పిటిషనర్ తరఫు న్యాయవాది చిల్లా రమేశ్ వాదనలు వినిపించారు. సెప్టెంబర్ 8న పోలీసులు కేసు నమోదు చేశారని, దర్యాప్తు జరుగుతోందని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశిస్తూ.. విచారణను నవంబర్ 20కి వాయిదా వేసింది.

ఆ ఇద్దరు ఖైదీల క్షమాభిక్షపై నిర్ణయం తీసుకోండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఓ కేసులో యావజ్జీవశిక్ష పడి 27 ఏళ్లుగా జైలుశిక్ష అనుభవిస్తున్న ఇద్దరు ఖైదీలు క్షమాభిక్ష కోసం పెట్టుకున్న అర్జీపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల గడువు ఇస్తున్నామని, ఈలోగా నిర్ణయం తెలియజేయాలని స్పష్టం చేసింది. ఒకే కేసులో ఖైదీలుగా ఉన్న ముగ్గురికి క్షమాభిక్ష ప్రసాదించి.. తమను పట్టించుకోవడంలేదని అషారఫ్ అలీ, ఆరిఫ్‌ఖాన్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. 1997లో నమోదైన ఓ కేసులో కిందికోర్టు ఈ ఇద్దరితోపాటు మరో ముగ్గురికి యావజ్జీవ జైలుశిక్ష విధించిందని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. హైకోర్టులో అప్పీలు చేసుకున్నా కొట్టివేసిందని చెప్పారు. ఈ ఐదుగురిలో ముగ్గురికి క్షమాభిక్ష ప్రసాదిస్తూ ఆగస్టు 19న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఒకే కేసులో శిక్ష అనుభవిస్తున్న ఐదుగురిలో ముగ్గురిని విడుదల చేసి, ఇద్దరి వినతి పత్రాన్ని పట్టించుకోకపోవడం సరికాదని వ్యాఖ్యానించింది. అనంతరం విచారణను నవంబర్ 21వ తేదీకి వాయిదా వేసింది.



బయట నేను.. లోపల ఆయన..!

చంద్రబాబును ఉద్దేశించి డైరెక్టర్ రాంగోపాల్‌వర్మ పోస్ట్

సాక్షి, రాజమహేంద్రవరం: సంచలన దర్శకుడు రాంగోపాల్ వర్మ ఆసక్తికర ట్వీట్ చేశారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్ వద్ద సెల్ఫీ దిగిన ఆయన ఆ ఫొటోను ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. 'నేను బయట.. ఆయన లోపల' అని స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న బాబును ఉద్దేశించి ట్వీట్ చేశారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు జక్కంపూడి గణేష్ రిసెప్షన్‌కు వచ్చిన ఆయన సెంట్రల్ జైల్ వద్ద ఆగి.. ఫొటో దిగారు.

సీజే రోస్టర్‌కే జడ్జీలు కట్టుబడి ఉండాలి

- సీజే కేటాయించని కేసుపై విచారణ జరపడం తీవ్ర అనౌచిత్యం
- ఓ న్యాయమూర్తి ముందు కేసు రాకుండా ఎత్తుగడ
- ఆక్షేపించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. వారికి రూ.50వేల జరిమానా
- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఏపీలో ఫోరం షాపింగ్‌లో ఆరితేరిన చంద్రబాబు అండ్ కో

సాక్షి, అమరావతి: ప్రధాన న్యాయమూర్తి (సీజే) మాత్రమే నిర్ణయించే రోస్టర్ (ఏ న్యాయమూర్తులు ఏ రకమైన కేసులు వినాలి)ను అనుసరించే విషయంలో సుప్రీంకోర్టు ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి కేటాయించని కేసుపై న్యాయమూర్తులు విచారణ జరపడం తీవ్రమైన అనౌచిత్యమని స్పష్టంచేసింది. న్యాయమూర్తులందరూ కూడా ప్రధాన న్యాయమూర్తి నిర్దేశించిన రోస్టర్‌కు కట్టుబడి ఉండాలని తేల్చిచెప్పింది. అలాగే, వారంతా క్రమశిక్షణతో వ్యవహరించాలని, సీజే కేటాయించిన కేసు తప్ప మరే ఇతర కేసును విచారించడానికి వీల్లేదని తెలిపింది. రోస్టర్ ప్రకారం నిర్దిష్ట కేటగిరి కింద తమ ముందుకొచ్చిన కేసును విచారించడం లేదా సీజే నిర్దిష్టంగా అప్పగించిన కేసును విచారించడం మాత్రమే న్యాయమూర్తులు చేయాల్సి ఉంటుందని 'సుప్రీం' స్పష్టంచేసింది. అలాగే, కొందరు కక్షిదారులు తాము అనుకున్న ఉత్తర్వులు పొందేందుకు తమ కేసును నిర్దిష్టంగా ఓ న్యాయమూర్తి వద్దకు వచ్చేలా చేయడం.. ఉత్తర్వులిచ్చే అవకాశంలేని న్యాయమూర్తి ముందు నుంచి తమ కేసును తప్పించడం వంటి అనైతిక చర్యలకు పాల్పడుతుండటాన్ని కూడా సుప్రీంకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. ఈ విధంగా ఫోరం షాపింగ్ (కావాల్సిన జడ్జి వద్దకు కేసు వచ్చేలా చేయడం, కేసు రాకుండా చేయడం)కు పాల్పడం ఎంతమాత్రం సరికాదంది. తమ ముందున్న కేసులో కక్షిదారులు వ్యవహరించిన తీరు విస్మయకరమంటూ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఫోరం షాపింగ్‌కు పాల్పడినందుకు ఆ కక్షిదారులకు రూ.50వేల జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్ ఇటీవల తీర్పు వెలువరించారు.

మొదట క్వాష్.. పనికాకపోవడంతో రిట్ పిటిషన్..

ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజస్థాన్‌కు చెందిన నలుగురు వ్యక్తులపై వేర్వేరుగా ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మరికొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలంటూ నలుగురు వ్యక్తులు రాజస్థాన్ హైకోర్టులో సీఆర్‌పీసీ సెక్షన్–482 కింద క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఈ ఏడాది ఏప్రిల్ 28న విచారణ జరిపిన న్యాయమూర్తి ఆ నలుగురు వ్యక్తులు కోరిన విధంగా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో ఆ నలుగురు వ్యూహం మార్చి ఆరు ఎఫ్ఐఆర్‌లను కలిపేసి, వాటన్నింటినీ ఒకే ఎఫ్ఐఆర్‌గా పరిగణించాలని కోరుతూ 8 మే 2023న సివిల్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన మరో న్యాయమూర్తి ఆ నలుగురు వ్యక్తులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఫిర్యాదుదారు అంబలాల్ పరిహార్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. ఆ నలుగురు వ్యక్తులు కూడా గతంలో తమకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరించిన న్యాయమూర్తి ముందు తిరిగి తమ కేసు రాకుండా చేసేందుకే ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలపాలంటూ పిటిషన్ దాఖలు చేశారని అంబలాల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. అంతేకాక.. ఎనిమిది ఎఫ్ఐఆర్‌లలో తమపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని కూడా కోరారని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పైపెచ్చు ఫిర్యాదుదారులను అసలు ప్రతివాదులుగా చేర్చలేదని వివరించారు.

ఫోరం షాపింగ్‌కు ఈ కేసు ఓ ఉదాహరణ..

వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం.. గతంలో ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలంటూ క్రిమినల్ పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది, ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలిపేయాలంటూ సివిల్ పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది ఒకరేనని గుర్తించింది. ఫోరం షాపింగ్‌కు ఈ కేసు ఓ ప్రామాణిక ఉదాహరణని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. అంతేగాక.. న్యాయ ప్రక్రియ దుర్వినియోగానికి ఈ కేసు ఓ మచ్చుతునకని కూడా తెలిపింది. ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలిపేయాలంటూ దాఖలు చేసిన సివిల్ రిట్ పిటిషన్‌ను అసలు ఎలా విచారించారంటూ విస్మయం వ్యక్తంచేసింది. క్రిమినల్ కేసులను విచారించేందుకు సీజే నిర్దిష్ట రోస్టర్‌ను ఖరారు చేశారని.. ఈ కేసులో నలుగురు నిందితులు దాఖలు చేసినటువంటి పిటిషన్లను న్యాయస్థానాలు అనుమతిస్తూ వెళ్తే సీజే నిర్దేశించే రోస్టర్‌కు ఎంతమాత్రం విలువ ఉండదని తేల్చిచెప్పింది. ఆ నలుగురు వ్యక్తులు మరో న్యాయమూర్తి ముందు దాఖలు చేసిన సివిల్ రిట్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తెలిపింది. ఈ నలుగురు వ్యక్తుల వ్యవహారశైలిని సెక్షన్–482 కింద వీరి పిటిషన్లను విచారిస్తున్న న్యాయమూర్తి దృష్టికి తీసుకురావాలని స్పష్టంచేసింది.

'ఫోరం షాపింగ్' బాబు బ్యాచ్‌కు కొట్టిన పిండి..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు విభజిత ఏపీ హైకోర్టులో కూడా ఫోరం షాపింగ్, నాట్ బిఫోర్ మి అనగానే వెంటనే గుర్తొచ్చేది చంద్రబాబు అండ్ కోనే. గతంలో ఎన్నడూ వినని, తెలియని ఫోరం షాపింగ్, నాట్ బిఫోర్ వంటి వాటిని సామాన్య జనానికి తెలిసేలా చేసింది ఆ బ్యాచే. గతంలో చంద్రబాబు ఈ 'ఫోరం షాపింగ్' ను అడ్డంపెట్టుకుని ఎన్నో కేసుల నుంచి బయటపడ్డ ఉదంతాలున్నాయి.

- అక్రమాస్తులకు సంబంధించి లక్ష్మీపార్వతి దాఖలు చేసిన పిటిషన్‌లో చంద్రబాబు ఏ రకంగా వ్యవహరించారో రాష్ట్ర ప్రజలందరూ చూశారు.
- రామోజీ, చంద్రబాబు తదితరుల అక్రమార్జనపై వైఎస్ విజయమ్మ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలోనూ చంద్రబాబు అండ్ కో వేసిన నాట్ బిఫోర్ నాటకాలతో న్యాయవ్యవస్థే విస్మయం చెందింది.
- ఫలానా న్యాయమూర్తి తమకు అనుకూలంగా ఉత్తర్వులివ్వరని భావిస్తే, అతనిపైకి కొందరు న్యాయవాదులను ఉసిగొల్పి, ఆ న్యాయమూర్తితో ఉద్దేశపూర్వకంగా గొడవ పెట్టుకుని ఆ కేసు విచారణ నుంచి ఆ న్యాయమూర్తులు తప్పుకునేలా చేసిన కేసులూ ఎన్నో.
- ఇలా న్యాయమూర్తులతో గొడవలు పెట్టుకున్నందుకు ఆ న్యాయవాదులకు పెద్ద మొత్తాల్లో డబ్బు ముట్టజెప్పిన సంగతి న్యాయవర్గాల్లో అందరికీ తెలుసు.
- తాజాగా.. ఓ కేసులో కూడా చంద్రబాబు బృందం ఇలానే ఫోరం షాపింగ్‌కు పాల్పడింది. దీనిపై ప్రస్తుతం న్యాయవర్గాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.

మంచినీళ్లు, కరెంటూ ఆపమంటారేమో?

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గ స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

కాంగ్రెస్ తోకలను ప్రజలు కత్తిరించడం ఖాయం..

రైతుబంధు పథకాన్ని అపాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం ద్వారా రైతులను కాంగ్రెస్ పార్టీ ఆగం చేసే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ రైతు విరోధిగా మారడంతోపాటు అన్నదాతలపాలిట నంబర్ వన్ విలన్‌గా మారిందన్నారు. అన్నదాతల పొట్టకొట్టే కుటిల కాంగ్రెస్ కుతంత్రాలను ఎట్టిపరిస్థితుల్లోనూ తెలంగాణ రైతులు భరించబోరని, రైతుబంధును ఆపాలని లేఖలు రాసిన కాంగ్రెస్ తోకలను ప్రజలు కత్తిరించడం ఖాయమని పేర్కొన్నారు. నమ్మి ఓట్లు వేసిన కర్ణాటక రైతులను కాంగ్రెస్ అరిగోస పెడుతోందని, ఇక్కడ మూడు గంటల కరెంటు మోసానికి తెరతీసిందని కేటీఆర్ అన్నారు. రైతుబంధు పథకానికి కూడా పాతరేసేలా ద్రోహం చేస్తున్న కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సంక్షేమ పథకాలు ఆపుతారా?
రైతుల జోలికొస్తే ఖబడ్దార్

▶ మొదటి పేజీ తరువాయి

కట్టించుకుంటే కేసీఆర్ మాత్రం రైతుల ఖాతాల్లో డబ్బులు వేశారని చెప్పారు.

పెన్షన్లు కూడా ఆపమంటారేమో?

ఆసరా పెన్షన్లు, కేసీఆర్ కిట్లు కూడా ఆపాలని కాంగ్రెస్ నేతలు అంటారేమోనని మంత్రి హరీశ్‌రావు అనుమానం వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావట్లేదని, అక్కడి రైతులు కొడంగల్, గద్వాలలో కరెంట్ విషయంలో ఆందోళన చేశారన్నారు. కర్ణాటకలో మూడు గంటల కరెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. రైతులపై కాంగ్రెస్ కక్షగట్టి వారిపాలిట శత్రువులా తయారైందని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు స్వస్తిపలికి, వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరఫరాకే పరిమితమవుతుందని హరీశ్ ఆరోపించారు. కరోనా కష్టకాలంలోనూ కేసీఆర్ రైతుబంధు సాయం చేశారని, కాంగ్రెస్ కుట్రలతో ప్రస్తుతం ఈ పథకం నిలిచిపోయినా తాము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము వేస్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు పదకొండుసార్లు అధికారం ఇస్తే సయాపైసా ఇవ్వలేదని, తాము మాత్రం రెండుసార్లు అధికారం ఇస్తే 11 సార్లు రైతుబంధు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులు కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నారని, వారు కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. రైతు రుణమాఫీ కోసం ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు హరీశ్‌రావు వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్ గురువారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

కేసీఆర్‌కు అఖండ మెజార్టీ ఇవ్వాలి: హరీశ్

గజ్వేల్: ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు వంద సీట్లు రావడం ఖాయమని, ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది స్థానాలను గెలవబోతున్నామని మంత్రి టి.హరీశ్‌రావు జోస్యం చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే గజ్వేల్‌ను అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో అఖండ మెజార్టీని అందించాలని పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో కేసీఆర్ పోటీ చేయకుంటే ఇక్కడ జరిగిన అభివృద్ధిని కొనసాగించే వారుంటారా? అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ రాకముందు, కేసీఆర్ ప్రాతినిధ్యం తర్వాత గజ్వేల్ ప్రాంతంలో వచ్చిన మార్పును బేరీజు వేసి ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. గజ్వేల్ ప్రజలు నిజాయితీకి మారు పేరని, ఈసారి ఎన్నికల్లో కచ్చితంగా అత్యధిక మెజార్టీ ఇస్తారనే నమ్మకం తనకుందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నవంబర్ 2లోపు రైతుబంధు ఇవ్వు

▶ మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృద్ధులపై శ్రద్ధ ఉంటే నవంబర్ 2 లోపు పింఛను, ఉద్యోగులందరికీ జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని తాము ఎలక్షన్ కమిషన్‌కు చెప్పామని స్పష్టం చేసిన రేవంత్.. 'డ్రామాలు ఆపి నవంబర్ 2 లోపు లబ్ధిదారులకు నిధులు ఇవ్వు.. లేదంటే కాంగ్రెస్ వచ్చాం పెంచిన మొత్తంతో కలిపి ఇస్తుంది'.. అని ట్వీట్ చేశారు. 'నీలాంటి వాడిని చూసే.. 'నిజం చెప్పులు తొడుక్కునే లోపు.. అబద్ధం ఊరంతా తిరిగొస్తుందనే సామెత పుట్టింది'.. అని రేవంత్ వ్యాఖ్యానించారు.

కేసీఆర్ రైతుబంధు తీసుకుంటున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఉద్యోగస్తులు కోల్పోయిన ఐఆర్, ఇతర సౌకర్యాలు పునరుద్ధరిస్తామని, వీఆర్ఏ, వీఆర్‌వోలతో పాటు ఇతర చిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని, గల్ఫ్ బాధితుల కోసం రూ.1,000 కోట్లు కేటాయించి వారి ఇబ్బందులు తీరుస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పేరిట విధ్వంసం

సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో అభివృద్ధి పేరిట విధ్వంసం జరిగిందని, భూములు కోల్పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఈటల ఆరోపించారు. మల్లన్నసాగర్ నిర్వాసితులు చెట్టుకొకరు.. పుట్టకొకరు అయ్యారని, వారి కన్నీళ్లు తుడిచే నాథుడే కరువయ్యాడని అన్నారు. గజ్వేల్‌లో ధర్మ యుద్ధం సాగిస్తానని, గరీబు బిడ్డగా తాను వారి డబ్బులతో పోటీ పడలేనని చెప్పారు. ధర్మం గెలవాలంటే తనతో కలసిరావాలని, అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఈటల రాకతో సీఎం కేసీఆర్‌కు, గజ్వేల్‌కు ఉన్న పేగుబంధం తెగిపోనున్నదని ఎమ్మెల్యే రఘునందన్‌రావు చెప్పారు. గజ్వేల్‌లో ఓటమి తప్పదని కేసీఆర్ ముందుగానే ఊహించారని, కామారెడ్డిలో పోటీ చేయడం వెనుక అసలు మతలబు ఇదేనన్నారు. మంత్రి హరీశ్‌రావు కడుపులో కత్తులు పెట్టుకొని తిరిగే వ్యక్తి అని విమర్శించారు. కాగా, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నేతలు ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభ లో జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, కర్ణాటక మాజీ ఎమ్మె ల్యే రాజ్ కుమార్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ కలలు సాకారమవుతున్న వేళ...

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకొని అమెజాన్‌లో 9 మందికి కొలువులు
- 13 మంది నిరుపేద విద్యార్థులకు రూ.26 లక్షల భారీ ప్యాకేజీ
- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య



ఎంపికైన విద్యార్థులతో లావు రత్తయ్య, కృష్ణదేవరాయలు

అగనంపూడి (గాజువాక): ప్రతీ పేదింటి బిడ్డ ఉన్నత చదువుల్లో రాణించాలని..ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని సీఎం జగన్ తపన..ఆరాటం సఫలీకృతమవుతుండటం సంతోషంగా ఉందని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు కృష్ణదేవరాయలు అన్నారు. అమెజాన్ ప్రాంగణ ఎంపిక ప్రక్రియలో ఎంపికైన 13 మందిలో 9 మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకున్నట్లు తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.26 లక్షలు అని చెప్పారు. వీరితోపాటు మరో 13 మంది కూడా 3 సంస్థల్లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఒకరు రూ.12 లక్షల వార్షిక వేతనం, 12 మందికి రూ.10 లక్షల ప్యాకేజీతో దేవరెవ క్లౌడ్ ఇండియా, ఇన్సిర్క్స్, ఎటర్నల్ రోబోటిక్స్ సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు వివరించారు. సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్‌తోపాటు విద్యార్థులను మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంచడటంతోపాటు నైతిక విలువలూ పెంపొందిస్తున్నామని చెప్పారు. విజ్ఞాన్ సీఈవో ఎన్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ నిద్రమత్తు, పొగమంచు..
ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన వాహనం

13 మంది అక్కడికక్కడే దుర్మరణం

- కర్ణాటకలోని చిక్కబళ్లాపుర వద్ద ఘటన
- మృతుల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 10 మంది.. కర్ణాటక వాసులు ముగ్గురు



లారీని ఢీకొట్టిన సుమో

సాక్షి, పుట్టపర్తి: విజయదశమి పండుగ తాలూకు ఆనందం వారి మోముల్లో ఇంకా చెక్కు చెదరలేదు. అంతలోనే మృత్యువు వారిని కబళించింది. ఏకంగా 13 మందిని పొట్టనబెట్టుకుంది. మృతుల్లో 10 మంది శ్రీసత్యసాయి జిల్లా వాసులు కాగా, మరో ముగ్గురు కర్ణాటకకు చెందినవారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల, పెనుకొండ, ఓడీ చెరువు, కొత్తచెరువు మండలాలకు చెందినవారు బెంగళూరులో కూలి పనులు, ఉద్యోగాలు చేస్తున్నారు. విజయదశమి సందర్భంగా సొంతూళ్లకు వచ్చి తిరిగి బెంగళూరు వెళుతున్నారు. అలాగే కర్ణాటకకు చెందిన వారు కూడా బంధువుల ఇంట శుభకార్యానికి వచ్చి తిరిగి వెళుతున్నారు. మొత్తం 13 మంది(డ్రైవర్‌తో కలిపి) గురువారం తెల్లవారు జామున శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల నుంచి టాటా సుమోలో బయలుదేరారు. ఉదయం 6.30 గంటల సమయంలో కర్ణాటకలోని చిక్కబళ్లాపుర వద్ద ఆగి ఉన్న లారీ(ట్యాంకర్)ను వీరి వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. విషయం తెలుసుకున్న చిక్కబళ్లాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీసి చిక్కబళ్లాపురం ఆస్పత్రికి తరలించారు. మృతుల బంధువుల ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం మార్మోగిపోయింది. కాగా, నాగాలాండ్ రిజిస్ట్రేషన్ ఉన్న లారీ డ్రైవర్ దానిని అక్కడే నిలిపి పరారయ్యాడు. తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదానికి పొగమంచే కారణమని పోలీసులు భావిస్తున్నారు. మృతుల్లో గోరంట్ల మండలం వానవోలుకు చెందిన బోయ వెంకటాద్రి(27), ఆయన భార్య లక్ష్మి(23), కలిగిరి గ్రామానికి చెందిన హరిజన నరసింహులు(45), కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పవన్‌కుమార్(32), ఓడీ చెరువు మండలం నవాబుకోటకు చెందిన వెంకటనారాయణ(51), ఆయన భార్య వెంకట సుబ్బమ్మ(48), మలకవారిపల్లికి చెందిన నారాయణప్ప(50), పెనుకొండ మండలం గోనిపెంటకు చెందిన గొల్ల శాంతమ్మ(37), గొల్ల రాజవర్ధన్(15), చిలమత్తూరు మండలం మరువపల్లికి చెందిన గొల్ల గణేశ్(17), కర్ణాటకలోని మరగనిగుంటకు చెందిన మంగళమూర్తి(37), బెంగళూరుకు చెందిన నేసే అరుణ(38), ఆమె కుమారుడు రుత్విక్ సాయి (7) ఉన్నారు. మృతుల కుటుంబాలను ఆస్పత్రిలో స్థానిక ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఆర్థిక సాయం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబాలకు అప్పగించారు. ఈ మేరకు చిక్కబళ్లాపుర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండ : సీఎం వైఎస్ జగన్

కర్ణాటకలోని చిక్కబళ్లాపుర వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్యసాయి జిల్లాకు చెందినవారు దుర్మరణం చెందడంపై ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటన తనను ఎంతో కలచివేసిందంటూ ట్వీట్ చేశారు. 'మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. బాధిత కుటుంబాలకు మన ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది' అంటూ గురువారం సీఎం జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కార్వీ కేసులో రూ.134.02 కోట్ల విలువైన షేర్లు జప్తు

తాజా అటాచ్‌మెంట్‌తో రూ. 2,229.56 కోట్లకు చేరిన జప్తు మొత్తం

సాక్షి, హైదరాబాద్: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల జప్తుల పర్వం కొనసాగుతోంది. కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ ఎండీ పార్థసారథి కుమారుడు అదిరాజ్ పార్థసారథి పేరిట ఉన్న రూ.134.02 కోట్ల విలువైన వెయ్యి నాన్ కన్వర్టబుల్ రీడీమబుల్ షేర్లను ఈడీ అధికారులు గురువారం జప్తు చేశారు. తాజాగా చేసిన జప్తుతో కలిపి ఈ కేసులో ఇప్పటివరకు జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.2,229.56 కోట్లకు చేరింది. ఈ మేరకు ఈడీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్వీ సీఎండీ సి.పార్థసారథి నిబంధనలకు విరుద్ధంగా తన కుమారుడు అదిరాజ్ పార్థసారథికి చెందిన కేఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు షేర్ల కొనుగోలు రూపంలో నిధులు మళ్లించినట్టు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ మొత్తం అవకతవలకు సంబంధించిన ఆధారా లు సేకరించిన ఈడీ అధికారులు రూ.134.02 కోట్ల విలువైన నాన్ కన్వర్టబుల్ రీడీమబుల్ షేర్లను జప్తు చేశారు. కార్వీ స్టాక్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ సి.పార్థసారథి మదుపరుల షేర్లను వారి అనుమతి లేకుండానే బ్యాంకుల్లో తాకట్టు పెట్టి తీసుకున్న వందల కోట్ల రూపాయల మొత్తాన్ని షెల్ కంపెనీల్లోకి మళ్లించిన ఆరోపణలపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. దీని ఆధారంగా ఈ కేసులో మనీలాండరింగ్‌పై ఈడీ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలు కీలక ఆధారాలు సేకరించిన ఈడీ అధికా రులు, ఆ ఆధారాల మేరకు ఎప్పటికప్పుడు ఆస్తులను జప్తు చేస్తున్నారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
27-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
901	265
63,148	18,857

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	12,557	▽	264
డోజోన్స్	32,782	▽	254
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,378	▽	37
డాక్స్	14,731	▽	161
షాంఘై	2,988	△	14
నికాయ్	30,602	▽	668

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	60,984
బంగారం (99.5 స్వచ్ఛత)	60,740
వెండి (కేజీ)	71,560

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.45	84.12
£	బ్రిటన్ పౌండ్	98.97	102.27
€	యూరో	86.27	89.36
¥	జపాన్ ఎన్ (100)	54.51	56.21
AUS	ఆస్ట్రేలియా డాలర్	51.20	53.51
S$	సింగపూర్ డాలర్	59.72	61.64
SAR	సౌదీ రియాల్	21.24	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	21.76	23.56
¥	చైనా యువాన్	10.25	12.32

వొడాఫోన్ ఐడియా నష్టాలు అప్

క్యూ2లో రూ. 8,738 కోట్లు




న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నష్టం పెరిగి రూ. 8,738 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,596 కోట్ల నష్టం నమోదైంది. పన్ను లయబిలిటీ కింద రూ. 822 కోట్ల ప్రొవిజనింగ్ చేపట్టింది. మొత్తం ఆదాయం రూ. 10,656 కోట్ల నుంచి నామమాత్ర వృద్ధితో రూ. 10,716 కోట్లను తాకింది. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 2 శాతం మెరుగుపడి రూ. 142కు చేరింది. ఆదాయం, ఏఆర్‌పీయూలలో మరోసారి వృద్ధిని అందుకున్నట్లు కంపెనీ సీఈవో అక్షయ మూంద్రా తెలియజేశారు. మొత్తం వినియోగదారుల సంఖ్య 6 శాతం క్షీణించి 21.98 కోట్లకు పరిమితమైంది. అయితే 4జీ సబ్‌స్క్రయిబర్లు 12 కోట్ల నుంచి 12.47 కోట్లకు పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. వీరి డేటా సగటు వినియోగం 15 జీబీ నుంచి 15.8 జీబీకి వృద్ధి చెందింది. సెప్టెంబర్‌కల్లా మొత్తం రుణ భారం రూ. 2,12,785 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ఎన్‌ఎస్‌ఈలో 1.4% క్షీణించి రూ. 10.7 వద్ద ముగిసింది.

ఆరో రోజూ 'బేర్ కల్లోలం'

- కొనసాగిన నష్టాల పరంపర
- 64 వేల దిగువకు సెన్సెక్స్
- 19,000 స్థాయిని కోల్పోయిన నిఫ్టీ
- 4 నెలల కనిష్టానికి సూచీలు



ముంబై: స్టాక్ మార్కెట్ 'బేర్ కల్లోలం' ఆరో రోజూ కొనసాగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రం కావడం, అమెరికా ట్రెజరీ బాండ్లపై రాబడులు ఐదు శాతానికి చేరుకోవడం ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. మిశ్రమ కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల పరంపర, క్రూడాయిల్ పెరుగుదల, రూపాయి రికార్డు కనిష్టానికి చేరుకోవడం బేర్ కల్లోలానికి తమ ప్రభావాన్ని జోడించాయి. అస్థిరతను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ 3.69 శాతానికి పైగా పెరిగి 11.73 స్థాయికి చేరింది. అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఈక్విటీ సూచీలు నాలుగు నెలల కనిష్ట స్థాయికి దిగివచ్చాయి. సెన్సెక్స్ 901 పాయింట్లు నష్టపోయి 64 వేల స్థాయి దిగువన 63,148 వద్ద స్థిరపడింది. నిఫ్టీ జూన్ 27 తర్వాత తొలిసారి 19 వేల స్థాయిని కోల్పోయింది. మొత్తంగా 265 పాయింట్లు క్షీణించి 18,857 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాల ప్రభావంతో ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఆసక్తి చూపారు. ఒక దశలో సెన్సెక్స్ 956 పాయింట్లు క్షీణించి 63,093 వద్ద, నిఫ్టీ 284 పాయింట్లు పతనమై 18,838 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. విదేశీ ఇన్వెస్టర్లు ఈ ఏడాదిలోనే ఒకరోజులో అత్యధికంగా రూ.7,703 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.6,558 కోట్ల షేర్లను కొన్నారు. ఈసీబీ సమావేశం, అమెరికా సెప్టెంబర్ క్వార్టర్ జీడీపీ డేటా వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా కదలాడుతున్నాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు అర శాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కెట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

› నష్టాల మార్కెట్లోనూ యాక్సిస్ బ్యాంక్ రాణించింది. మెరుగైన సెప్టెంబర్ క్వార్టర్ ఫలితాల ప్రకటన ఇందుకు నేపథ్యం. క్యూ2లో నికర లాభం 10% రెట్ల వృద్ధిని సాధించడంతో ఈ ప్రైవేట్ రంగ బ్యాంక్ షేరు 2% లాభపడి రూ.971 వద్ద స్థిరపడింది. షేరు ర్యాలీతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.5,144 కోట్లు పెరిగి రూ.3 లక్షల కోట్లకు చేరింది.

› రెండో క్వార్టర్ ఫలితాలు నిరాశపరచడంతో టెక్ మహీంద్రా షేరు 2% నష్టపోయి రూ.1,116 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగున్నర శాతం నష్టపోయి రూ.1,089 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు పతనంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.2,501 కోట్లు తగ్గి రూ.1.09 లక్షల కోట్లకు దిగివచ్చింది.

› సెన్సెక్స్ సూచీ ఆరు ట్రేడింగ్ సెషన్లలో 3,280 పాయింట్లు(5%) క్షీణించడంతో బీఎస్‌ఈలో రూ.17.77 లక్షల కోట్లు ఆవిరియ్యాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.306 లక్షల కోట్లకు దిగివచ్చింది. గురువారం ఒక్కరోజే రూ.2.95 లక్షల కోట్లు మాయమమ్యాయి.

› సెన్సెక్స్ సూచీలో 30 షేర్లలో యాక్సిస్ బ్యాంక్ 2%, ఐటీసీ 0.35%, హెచ్‌సీఎల్ టెక్ 0.20%, ఇండస్ ఇండ్ 0.10% షేర్లు మాత్రమే లాభపడ్డాయి. రంగాల వారీగా అత్యధికంగా ఆటో ఇండెక్స్ 2% నష్టపోయింది. ఆయిల్అండ్‌గ్యాస్, మెటల్, ఫైనాన్షియల్ సర్వీసెస్, వినిమయ రంగాల సూచీలు 1.50% క్షీణించాయి. కాగా టెలి కమ్యూనికేషన్, రియల్టీ, ఐటీ ఇండెక్సులు ఒకశాతానికి పైగా నష్టపోయాయి.

› గ్యాస్ పంపిణీ కంపెనీ ఐఆర్‌ఎం ఎనర్జీ షేరు లిస్టింగ్ రోజే నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.505)తో పోలిస్తే 5.49% డిస్కౌంట్‌తో రూ.479 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో 11% క్షీణించి రూ.450 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 6.34% నష్టపోయి రూ.472 వద్ద నిలిచింది.

అమెరికా ఎకానమీ పటిష్టం

మూడో త్రైమాసికంలో 4.9 శాతం వృద్ధి

వాషింగ్టన్: ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అమెరికా మూడవ త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్) పటిష్ట స్థాయిలో 4.9 శాతం వృద్ధి రేటును సాధించింది. 4.2 శాతం అంచనాలకు మించి వృద్ధి నమోదుకావడం విశేషం. అధిక ధరలు, పెరుగుతున్న వడ్డీరేట్లు నేపథ్యంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుతోందన్న వార్తలను తోసిపుచ్చుతూ ఎకానమీ వృద్ధి పటిష్టంగా నమోదుకావడం గమనార్హం. రెండవ త్రైమాసికంలో ఎకానమీ 2.1 శాతం వృద్ధిని నమోదుచేసుకుంది. కాగా, భారీ వృద్ధి రేటుకు లోబేస్ ఎఫెక్ట్ కారణంగా కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి.

పీఎన్‌బీ లాభం హైజంప్

క్యూ2లో రూ. 1,756 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం నాలుగురెట్లు ఎగసి రూ. 1,756 కోట్లను అధిగమించింది. ఇది గత 14 త్రైమాసికాలలోనే అత్యధికంకాగా.. వడ్డీ ఆదాయం పుంజుకోవడం, ప్రొవిజన్లు తగ్గడం, రుణ నాణ్యత మెరుగుపడటం ఇందుకు తోడ్పాటునిచ్చాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 411 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధితో రూ. 9,923 కోట్లను తాకింది. రానున్న త్రైమాసికాలలో రుణ వ్యయాలు తగ్గనుండటంతో లాభదాయకత మరింత పుంజుకోనున్నట్లు బ్యాంక్ ఎండీ, సీఈవో అతుల్ కుమార్ గోయెల్ పేర్కొన్నారు.

ఎన్‌పీఏలు డౌన్

ప్రస్తుత సమీక్షా కాలంలో పీఎన్‌బీ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 10.48 శాతం నుంచి రూ. 6.96 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు సైతం 1.47 శాతం నుంచి 1 శాతానికి తగ్గాయి. ప్రొవిజన్లు రూ. 4,906 కోట్ల నుంచి భారీగా క్షీణించి రూ. 3,444 కోట్లకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం బలపడి రూ. 70 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 3,606 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023– 24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 43 శాతం జంప్‌చేసి రూ. 3,606 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం, ప్రొవిజన్లు తగ్గడం ఇందుకు సహకరించాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 2,525 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం సైతం 20 శాతం వృద్ధితో రూ. 8,903 కోట్లకు చేరింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,637 కోట్ల నుంచి భారీగా క్షీణించి రూ. 2,608 కోట్లకు పరిమితమయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 6.37 శాతం నుంచి రూ. 4.76 శాతానికి దిగివచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3 శాతం బలపడి రూ. 360 వద్ద ముగిసింది.

5జీ వినియోగంలో మార్గదర్శిగా భారత్

ఎరిక్సన్ ఇండియా ఎండీ నితిన్ బన్సల్



న్యూఢిల్లీ: ఇతర మార్కెట్ల అడుగుజాడల్లో నడవకుండా, 5జీ టెక్నాలజీని వివిధ అవసరాల కోసం వినూత్న రీతుల్లో వినియోగించుకోవడంలో ప్రపంచానికి భారత్ మార్గదర్శకత్వం వహించగలదని స్వీడన్ టెలికం పరికరాల దిగ్గజం ఎరిక్సన్ ఇండియా విభాగం ఎండీ నితిన్ బన్సల్ అభిప్రాయపడ్డారు. ఇతరత్రా ఏ దేశంలోనూ జరగనంత వేగంగా 5జీ నెట్‌వర్క్‌ను భారత్ విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. బ్యాంకింగ్‌తో పాటు వివిధ రంగాల సంస్థల అప్లికేషన్లకు డేటా కీలకంగా ఉంటున్న నేపథ్యంలో టెలికం నెట్‌వర్క్‌లు సురక్షితమైనవిగా ఉండటం చాలా ముఖ్యమని బన్సల్ చెప్పారు. 5జీ సేవలకు సంబంధించి ఇటు వినియోగదారులు, అటు సంస్థల నుంచి గణనీయంగా ఆసక్తి వ్యక్తమవుతోందని ఆయన పేర్కొన్నారు. డిజిటలైజేషన్ పెరగడం, వినియోగదారుల నుంచి డిమాండ్, ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టడం తదితర అంశాల కారణంగా ఈ సేవల వినియోగం వేగవంతం అవుతోందని బన్సల్ వివరించారు. క్రీడలు, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి విభాగాల్లో టెక్నాలజీని మరింత సమర్థంగా వినియోగించుకోవడంపై మొత్తం వ్యవస్థ కసరత్తు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. 5జీ సాంకేతికతతో నాణ్యత మెరుగుపడటంతో పాటు నెట్‌వర్క్‌లపై భారం కూడా తగ్గగలదని బన్సల్ చెప్పారు.

రికవరీ ఏజెంట్లు సమయాలు పాటించాలి!

- రుణ గ్రహీతలతో సంప్రదింపుల విషయంలో ఆర్‌బీఐ ప్రతిపాదనలు
- ఉదయం 8 గంటల ముందు చర్యలు నిషిద్ధం
- రాత్రి 7 తర్వాతా ఇదే వర్తిస్తుంది



ముంబై: రుణ గ్రహీతలు, గ్యారంటర్లపై ఫైనాన్షియల్ సంస్థలు, వారి రికవరీ ఏజెంట్ల ఒత్తిళ్లు, వేధింపులు పెరిగిపోతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో వీటి నియంత్రణకు బ్యాంకింగ్ రెగ్యులేటర్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక ప్రతిపాదనలతో ముందుకు వచ్చింది. రాత్రి 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకూ రుణ గ్రహీతలతో రికవరీ ఏజెంట్లు ఎటువంటి సంప్రదింపులూ జరపరాదన్న నిబంధన ఇందులో ఒకటి. ఆయా ప్రతిపాదనలపై సంబంధిత వర్గాలు నవంబర్ 28వ తేదీలోపు తన అభిప్రాయాలను తెలియజేయాలని ఆర్‌బీఐ సూచించింది. బ్యాంకులు, బ్యాంకింగ్‌యేతర ఫైనాన్షియల్ సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) వంటి నియంత్రిత సంస్థలు కోర్ మేనేజ్‌మెంట్ కార్యకలాపాలను అవుట్‌సోర్స్‌కు అప్పగించకూడదు. విధాన రూపకల్పన, కేవైసీ నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు, రుణాల మంజూరు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఫైనాన్షియల్ సంస్థలు, వాటి రికవరీ ఏజెంట్లు తమ రుణ సేకరణ ప్రయత్నాలలో ఏ వ్యక్తిపైనైనా ఎలాంటి బెదిరింపులు లేదా వేధింపులకు పాల్పడకూడదు. అలాగే రుణగ్రహీతలు, వారి హామీదారులు వారి కుటుంబ సభ్యుల గోప్యతను బహిరంగ పరచకూడదు. బహిరంగంగా అవమానపరచడం, గోప్యతాంశాల్లోకి చొరబాట్లు కూడదు. మొబైల్‌లో లేదా సోషల్ మీడియా ద్వారా అనుచిత సందేశాలను పంపకూడదు.

డిపాజిట్ల ముందస్తు ఉపసంహరణకు అనుమతి

కాగా అన్ని రకాల టర్మ్ డిపాజిట్లు (రూ. కోటి వరకు) వాటి గడువు కంటే ముందుగానే ఉపసంహరించుకునే అవకాశాన్ని కల్పించాలని బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. ప్రస్తుతం రూ.15 లక్షల వరకు టర్మ్ డిపాజిట్లు వాటి గడువు ముగియకుండా, ఎప్పుడు కావాలన్నా ఉపసంహరించుకునే అవకాశం ఉంది. ఈ పరిమితిని ఆర్‌బీఐ రూ. కోటికి పెంచింది. తాజా ఆదేశాలు ఎన్ఆర్/ఎన్ఆర్‌వో టర్మ్ డిపాజిట్లకు సైతం వర్తిస్తుంది.

సాక్షి స్పోర్ట్స్



నేటి నుంచి ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ

స్వదేశంలో తొలిసారి జరుగుతున్న ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో టైటిల్ నెగ్గడమే లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. ఆరు జట్ల మధ్య జరిగే ఈ టోర్నీ నేడు రాంచీలో మొదలవుతుంది. తొలి రోజు థాయ్‌లాండ్ జట్టుతో సవితా పూనియా కెప్టెన్సీలోని భారత జట్టు ఆడనుంది. మ్యాచ్ రాత్రి గం. 8:30 నుంచి జరుగుతుంది. చైనా, జపాన్, కొరియా, మలేసియా జట్లు కూడా ఈ టోర్నీలో పోటీపడుతున్నాయి. థాయ్‌లాండ్‌తో మ్యాచ్ తర్వాత భారత్ 28న మలేసియాతో, 30న చైనాతో, 31న జపాన్‌తో, నవంబర్ 2న కొరియాతో ఆడుతుంది. లీగ్ దశ ముగిశాక టాప్–4లో నిలిచిన జట్లు నవంబర్ 4న సెమీఫైనల్లో తలపడతాయి. నవంబర్ 5న ఫైనల్‌తో టోర్నీ ముగుస్తుంది. ఈ టోర్నీ మ్యాచ్‌లను సోనీ స్పోర్ట్స్ టెన్–5 చానెల్‌లో, సోనీ లివ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ఇంగ్లండ్ మళ్లీ బోల్తా

- శ్రీలంక చేతిలో 8 వికెట్ల తేడాతో ఓడిన డిఫెండింగ్ చాంపియన్
- ఇక సెమీస్ చేరడం చాలా కష్టం
- దెబ్బతీసిన లహిరు, మాథ్యూస్
- నిసాంక, సమరవిక్రమ అర్ధ సెంచరీలు



విజయానంతరం శ్రీలంక బ్యాటర్లు నిసాంక, సమరవిక్రమ... నిరాశలో బెయిర్‌స్టో, మెయిన్ అలీ, కెప్టెన్ బట్లర్

బెంగళూరు: గత మెగా ఈవెంట్ ఫైనల్లో న్యూజిలాండ్‌తో సూపర్ ఓవర్‌దాకా పోరాడి మరీ పుట్టింటికి ప్రపంచకప్‌ను పట్టుకెళ్లిన ఇంగ్లండ్ ఈసారి మాత్రం లీగ్ దశలోనే ఇంటికెళ్లే ప్రమాదంలో పడింది. సగం మ్యాచ్‌లు పూర్తయినా ఒక్కటి మాత్రమే గెలిచి నాలుగు మ్యాచ్‌ల్లో ఓడింది. ఇకపై ఆడాల్సిన నాలుగు వరుసబెట్టి గెలిచినా... రేసులో నిలవడమైతే అసాధ్యమే! ఇప్పటికే అఫ్గానిస్తాన్ జట్టు చేతిలో అనూహ్యంగా ఓడిన ఇంగ్లండ్ జట్టును గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో 8 వికెట్ల తేడాతో బోల్తా కొట్టించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బట్లర్ బృందం 33.2 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలింది. బెంగళూరులాంటి చిన్నస్వామి స్టేడియంలో ఇది టి20లకు సైతం చిన్న స్కోరు. అలాంటిది వన్డేలకు ఏం సరిపోతుంది. బెన్ స్టోక్స్ (73 బంతుల్లో 43; 6 ఫోర్లు) చేసిందే టాప్ స్కోర్! ఇంకో ఇద్దరు ఓపెనర్లు బెయిర్‌స్టో (31 బంతుల్లో 30; 3 ఫోర్లు), మలాన్ (25 బంతుల్లో 28; 6 ఫోర్లు)లవి చెప్పుకోదగ్గ స్కోర్లే తప్ప జట్టుకు ఉపయోగపడే పరుగులేమీ కావు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లహిరు కుమార 3, మాథ్యూస్, కసున్ రజిత చెరో 2 వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు. అనంతరం శ్రీలంక 25.4 ఓవర్లలోనే రెండే వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ నిసాంక (83 బంతుల్లో 77 నాటౌట్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), సమరవిక్రమ (54 బంతుల్లో 65 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) గెలిపించారు. నిసాంక 54 బంతుల్లో, సమరవిక్రమ 44 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తిచేశారు. శ్రీలంక 23 పరుగులకు 2 వికెట్లు కోల్పోయిన దశలో వీరిద్దరు కుదురుగా ఆడి అబేధ్యమైన మూడో వికెట్‌కు 137 పరుగులు జోడించి జట్టును విజయతీరానికి చేర్చారు.

నిర్లక్ష్యమే నిండా ముంచింది!

ఈ మెగా టోర్నీలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, పాకిస్తాన్, శ్రీలంకలాంటి గట్టి జట్లు 400, 350 పైచిలుకు స్కోర్లను అవలీలగా చేసేస్తుంటే చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ కనీసం 160 పరుగులైనా చేయలేకపోయింది. ఓపెనర్ బెయిర్‌స్టో నుంచి లోయర్ ఆర్డర్‌లో ఎనిమిదో స్థానం వోక్స్ (0) దాకా బ్యాటింగ్ సామర్థ్యమున్న జట్టు... మేం ఆడేది వరల్డ్‌కప్ మ్యాచ్ కాదన్నట్లు, మాకేం పట్టనట్లు ఆద్యంతం నిర్లక్ష్యం కనబరిచింది. స్టోక్స్ ముందు, తర్వాత ఇంకెవరూ అసలు చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. రూట్ (3), కెప్టెన్ బట్లర్ (8), లివింగ్‌స్టోన్ (1), మొయిన్ అలీ (15) అంతా లంక బౌలింగ్‌కు దాసోహమయ్యారు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (సి) ధనంజయ (బి) రజిత 30; మలాన్ (సి) కుశాల్ మెండిస్ (బి) మాథ్యూస్ 28; జో రూట్ (రనౌట్) 3; స్టోక్స్ (సి) హేమంత (సబ్) (బి) లహిరు 43; బట్లర్ (సి) కుశాల్ మెండిస్ (బి) లహిరు 8; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లహిరు 1; అలీ (సి) పెరీరా (బి) మాథ్యూస్ 15; వోక్స్ (సి) సమరవిక్రమ (బి) రజిత 0; విల్లే (నాటౌట్) 14; ఆదిల్ రషీద్ (రనౌట్) 2; వుడ్ (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) తీక్షణ 5; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (33.2 ఓవర్లలో ఆలౌట్) 156. వికెట్ల పతనం:** 1–45, 2–57, 3–68, 4–77, 5–85, 6–122, 7–123, 8–137, 9–147, 10–156. **బౌలింగ్:** మదుషంక 5–0–37–0, కసున్ రజిత 7–0–36–2, తీక్షణ 8.2–1–21–1, మాథ్యూస్ 5–1–14–2, లహిరు కుమార 7–0–35–3, ధనంజయ 1–0–10–0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (నాటౌట్) 77; కుశాల్ పెరీరా (సి) స్టోక్స్ (బి) విల్లే 4; కుశాల్ మెండిస్ (సి) బట్లర్ (బి) విల్లే 11; సమరవిక్రమ (నాటౌట్) 65; ఎక్స్‌ట్రాలు 3, **మొత్తం (25.4 ఓవర్లలో 2 వికెట్లకు) 160. వికెట్ల పతనం:** 1–9, 2–23. **బౌలింగ్:** వోక్స్ 6–0–30–0, డేవిడ్ విల్లే 5–0–30–2, ఆదిల్ రషీద్ 4.4–0–39–0, మార్క్ వుడ్ 4–0–23–0, లివింగ్‌స్టోన్ 3–0–17–0, మొయిన్ అలీ 3–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X దక్షిణాఫ్రికా

వేదిక: చెన్నై

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	5	5	0	10	1.353
దక్షిణాఫ్రికా	5	4	1	8	2.370
న్యూజిలాండ్	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	5	3	2	6	1.193
శ్రీలంక	5	2	3	4	-0.025
పాకిస్తాన్	5	2	3	4	-0.400
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
బంగ్లాదేశ్	5	1	4	2	-1.253
ఇంగ్లండ్	5	1	4	2	-1.634
నెదర్లాండ్స్	5	1	4	2	-1.902

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్



ఆదిల్ ఆదమరుపు కీపర్ డైరెక్ట్ త్రో మెరుపు

ఇంగ్లండ్ ప్లేయర్ ఆదిల్ రషీద్ తన నిర్లక్ష్యంతో నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో వికెట్‌ను పారేసుకున్నాడు. 32వ ఓవర్లో తీక్షణ వేసిన ఐదో బంతి లెగ్‌సైడ్ దిశగా నేరుగా కీపర్ కుశాల్ మెండిస్ చేతుల్లో పడింది. అవతలి వైపున్న రషీద్ క్రీజు వెలుపల ఉన్నాడు. ఇది గమనించిన మెండిస్ గ్లౌజ్ తీసి బుల్లెట్ వేగంతో నాన్‌స్ట్రయిక్ ఎండ్ వికెట్లను గిరాటే వేయడంతో రషీద్ రనౌటయ్యాడు. రషీద్ అవుటయ్యాక మరో తొమ్మిది బంతులకు ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది.

భారత్ కొత్త చరిత్ర

ఆసియా పారా క్రీడల్లో అత్యధిక పతకాలు సొంతం



స్వర్ణ పతకాలతో శీతల్ దేవి, రాకేశ్ కుమార్

హాంగ్జౌ: వరుసగా నాలుగో రోజు తమ పతకాల వేటను కొనసాగిస్తూ ఆసియా పారా క్రీడల్లో భారత బృందం కొత్త చరిత్ర సృష్టించింది. ఈ క్రీడల చరిత్రలో అత్యధిక పతకాలను సొంతం చేసుకుంది. 2018 జకార్తా ఆసియా పారా క్రీడల్లో భారత్ అత్యధికంగా 72 పతకాలను దక్కించుకోగా... హాంగ్జౌలో నాలుగో రోజు పోటీలు ముగిసేసరికి భారత బృందం 18 స్వర్ణాలు, 23 రజతాలు, 41 కాంస్యాలతో కలిపి 82 పతకాలతో ఎనిమిదో స్థానంలో ఉంది. మరో రెండు రోజులపాటు కొనసాగే ఈ క్రీడల్లో ఈసారి భారత్ పతకాల్లో 'సెంచరీ'ని దాటే అవకాశముంది. గురువారం భారత్‌కు మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, 12 కాంస్యాలతో కలిపి మొత్తం 18 పతకాలు వచ్చాయి. అథ్లెటిక్స్‌లో పురుషుల ఎఫ్46 కేటగిరీ షాట్‌పుట్ ఈవెంట్‌లో సచిన్ సర్జేరావు ఖిలారి ఇనుప గుండును 16.03 మీటర్ల దూరం విసిరి స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. అనంతరం ఆర్6 మిక్స్‌డ్ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఎస్‌హెచ్1 విభాగంలో భారత షూటర్ సిద్ధార్థ బాబు 247.7 పాయింట్లు స్కోరు పసిడి పతకాన్ని సాధించాడు. ఆర్చరీలో శీతల్ దేవి–రాకేశ్ కుమార్ జోడీ కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో 151–149తో లిన్ యుషాన్–అయ్ జిన్‌లియాంగ్ (చైనా) జంటపై నెగ్గి బంగారు పతకాన్ని దక్కించుకుంది.

ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ సిద్ధం: ప్రధాని మోదీ

- గోవాలో జాతీయ క్రీడలు షురూ
- వచ్చే నెల 9 దాకా ఆటల పండగ



పనాజీ: జాతీయ ఆటల పండగ గోవాలో అట్టహాసంగా మొదలైంది. గురువారం భారత ప్రధాని నరేంద్ర మోదీ 37వ జాతీయ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'భారత క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. మేం వచ్చాక ప్రత్యేకించి క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు అమలు చేశాం. ప్రతిభావంతుల్ని గుర్తించి ఆర్థిక అండదండలు అందజేస్తూనే ఉన్నాం. ఈ ఏడాది క్రీడల బడ్జెట్‌ను భారీగా పెంచాం. గత తొమ్మిదేళ్ల బడ్జెట్‌తో పోల్చితే ఇది మూడు రెట్లు ఎక్కువ. ఆచరణ, అమలు తీరుతెన్నులతో భారత క్రీడల ముఖచిత్రం మారుతోంది. మన దేశంలో ప్రతిభకు కొదవలేదు. చాంపియన్లతో అది ఎప్పుడో నిరూపితమైంది. ఒలింపిక్, ఆసియా, కామన్వెల్త్ క్రీడల చాంపియన్లు ఎందరో దేశప్రతిష్టను పెంచారు. ఇక మిగిలింది విశ్వక్రీడల ఆతిథ్యమే! 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యమిచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని ఆయన అన్నారు. జాతీయ క్రీడలను వచ్చేనెల 9 వరకు 15 రోజుల పాటు 28 వేదికల్లో 43 క్రీడాంశాల్లో నిర్వహిస్తారు. రాష్ట్రాలు, సర్వీసెస్‌లకు చెందిన 37 జట్లు బరిలో ఉన్నాయి. 10 వేల పైచిలుకు అథ్లెట్లు పతకాల కోసం శ్రమించనున్నారు. ప్రారంభోత్సం కంటే ముందుగానే వెయిట్‌లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, నెట్‌బాల్, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, బాస్కెట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు మొదలయ్యాయి.

సాత్విక్–చిరాగ్ జోడీకి షాక్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారుల కథ ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్స్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీకి ప్రిక్వార్టర్ ఫైనల్లో చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ పీవీ సింధు గాయం కారణంగా మ్యాచ్ మధ్యలో వైదొలిగింది. డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 23–25, 21–19, 19–21తో మొహమ్మద్ అహసాన్–హెంద్రా సెతియవాన్ (ఇండోనేసియా) జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. సుపనిద కటెథోంగ్ (థాయ్‌లాండ్)తో జరిగిన మ్యాచ్‌లో సింధు తొలి గేమ్‌ను 21–18తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో స్కోరు 1–1 వద్ద సింధు మోకాలికి గాయం కావడంతో ఆమె మ్యాచ్ నుంచి వైదొలిగింది.



జపాన్ చేతిలో భారత్ పరాజయం

తాష్కెంట్: ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ) మహిళల 2024 పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌ను భారత జట్టు భారీ ఓటమితో ప్రారంభించింది. తాష్కెంట్‌లో గురువారం జరిగిన గ్రూప్ 'సి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 0–7 గోల్స్ తేడాతో ప్రపంచ మాజీ చాంపియన్ జపాన్ జట్టు చేతిలో ఓడిపోయింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి జపాన్‌కు ఒక్క గోల్ మాత్రమే ఇచ్చిన భారత్ రెండో అర్ధభాగంలో ఏకంగా ఆరు గోల్స్‌ను సమర్పించుకుంది. తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ 46వ నిమిషంలో స్ట్రయికర్ బాలాదేవి స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా బరిలోకి దిగింది. ఈ నెల 29న జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో వియత్నాంతో భారత్ ఆడుతుంది.

క్లుప్తంగా...

క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ఐఎస్‌బీకి 78వ ర్యాంకు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ దేశాల్లోని అగ్రశ్రేణి మేనేజ్‌మెంట్ కాలేజీల జాబితాతో కూడిన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్–2024లో హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సత్తా చాటింది. ప్రపంచ టాప్–100 బి–స్కూల్స్ ర్యాంకుల్లో 78వ స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో ఐఐఎం–బెంగళూరు 48వ ర్యాంకుతో టాప్–50లో చోటు సంపాదించగా ఐఐఎం-అహ్మదాబాద్ 53వ ర్యాంకు, ఐఐఎం- కలకత్తా 59వ ర్యాంకు సాధించాయి. గతేడాది విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లోనూ టాప్- 100లో ఈ నాలుగే ఉండటం విశేషం. ఇండోర్, ఉదయ్‌పూర్, లక్నో ఐఐఎంలు 150- 200 ర్యాంకింగ్స్ మధ్య నిలవగా ఢిల్లీ, గుర్గావ్ ఐఐఎంలు 200–250 ర్యాంకుల మధ్య నిలిచాయి. అమెరికాకు చెందిన స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ బిజినెస్ స్కూల్ తొలి స్థానంలో నిలిచింది.

భారీగా డబ్బు, మద్యం పంపిణీ

రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఎంపీ కృష్ణయ్య ఫిర్యాదు



సాక్షి, కాచిగూడ: రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో డబ్బు, మద్యం పెద్దఎత్తున ప్రవహిస్తోందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలతో క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న తనిఖీల్లో నగదు, మద్యం పెద్ద ఎత్తున పట్టుబడుతోందని తెలిపారు. మరోవైపు ఎన్నికల్లో గెలుపు కోసం అభ్యర్థులు ఒక్కొక్క నియోజకవర్గంలో సగటున రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల మేర ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఐఏఎస్ అధికారిని నియమించాలని, అభ్యర్థుల ఇళ్ల వద్ద నిఘా కట్టుదిట్టం చేయాలని, ఎన్నికలు పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు.

28న రాత్రి శ్రీవారి ఆలయ తలుపులు మూసివేత

తిరుమల: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా 28న రాత్రి 7.05 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి 29న తెల్లవారుజామున 3.15 గంటలకు తెరవనున్నట్లు టీటీడీ తెలిపింది. 29న తెల్లవారుజామున 1.05 నుంచి 2.22 గంటల మధ్య చంద్రగ్రహణం పూర్తవుతున్న కారణంగా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని 28న సాయంత్రం 6 గంటలకు మూసివేసి 29న ఉదయం 9 గంటలకు తెరుస్తారు. ఈ సమయంలో అన్నప్రసాదాల పంపిణీ ఉండదు. 28న సహస్ర దీపాలంకారసేవను, వికలాంగులు, వయోవృద్ధుల దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

చండీగఢ్ వర్సిటీకి ఏబీఈటీ అక్రెడిటేషన్

సాక్షి, హైదరాబాద్: చండీగఢ్ యూనివర్సిటీ(సీయూ)కు మరో మైలురాయిని చేరుకుంది. సీయూలో అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఏబీఈటీ) నుంచి తొమ్మిది ఇంజనీరింగ్ కోర్సులకు గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మకమైన ఏబీఈటీ అక్రెడిటేషన్ లభించడం పట్ల చండీగఢ్ వర్సిటీ చాన్సలర్ సత్నాం సింగ్‌సాధు హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రైవేటు వర్సిటీలలో ఏబీ ఈటీ అక్రెడిటేషన్ కోర్సులను అత్యధికంగా అందిస్తున్న వర్సిటీగా సీయూ నిలిచిందన్నారు. ఏబీఈటీ అక్రెడిటేషన్ గుర్తింపు లభించిన కోర్సుల్లో బీఈ నుంచి ఏయిరోస్పేస్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విత్ స్పెషలైజేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకాట్రోనిక్స్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి.

అలా మార్చేస్తే ఎలా?

- సిలబస్ మార్పుతో పోటీ పరీక్షలకు చిక్కులు
- ఎన్‌సీఈఆర్టీ సిఫార్సులపై భిన్నాభిప్రాయాలు
- కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో వేర్వేరు పాఠ్యాంశాలెందుకు?
- పోటీ పరీక్షల్లో అన్ని స్థాయిల్లోనూ సమస్యలు
- సిలబస్ మార్పుపై నిపుణుల అభిప్రాయాలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయి విద్యా విధానంలో మార్పులు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఇండియా పేరును భారత్‌గా మార్చడం పక్కన బెడితే, కొన్ని చాప్టర్లు తీసివేయడం వల్ల అనేక సమస్యలు ఎదురయ్యే వీలుందని విద్యావేత్తలు అంటున్నారు. పురాతన చరిత్ర స్థానంలో క్లాసికల్ హిస్టరీని తేవాలని తాజాగా జాతీయ విద్య, పరిశోధన శిక్షణ మండలి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. దీన్ని తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు స్వాగతించడం లేదు. ఇప్పటికే రాష్ట్రాల పరిధిలో స్థానిక అంశాలతో సిలబస్ ఉంది. వీటిని పరిగణనలోనికి తీసుకుని సిలబస్‌లో మార్పులు చేస్తేనే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.



వేర్వేరు సిలబస్‌లతో ఇబ్బందులు

ప్రపంచీకరణ ప్రభావం విద్యారంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రాష్ట్రాలు, కేంద్రం వేర్వేరు సిలబస్‌లు అమలు చేయడం వల్ల పోటీ పరీక్షల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్న వాదన విద్యావేత్తల నుంచి విన్పిస్తోంది. మారిన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా రాష్ట్రాల్లోని సిలబస్‌లో మార్పులు తేవాలనే అంశంపై భిన్న వాదనలు విన్పిస్తున్నాయి.

పోటీ పరీక్షలు సవాలే..

ఎన్‌సీఈఆర్టీ సూచించిన మార్పుల్లో అనేక అంశాలున్నాయి. క్లాసికల్ హిస్టరీకి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంటోంది. ప్రాచీన చరిత్రను ఎత్తివేయడమే సమంజసమని భావిస్తోంది. ఇప్పటికే కొన్ని సబ్జెక్టులను తీసివేయాలనే ప్రతిపాదన రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. మొఘల్ సామ్రాజ్యం, గాంధీజీ హత్య, ప్రజాస్వామ్యం–రాజకీయ పార్టీలు అనే చాప్టర్స్‌ను ఎన్‌సీఈఆర్టీ అనవసరమైనవిగా చెబుతోంది. పాత చరిత్రలో విజయాలకన్నా, అపజయాల గురించే ఎక్కువగా ఉందనేది ఎన్‌సీఈఆర్టీ అభిప్రాయం. అయితే ఇవి రాష్ట్రాల పరిధిలో ఇప్పటికీ బోధనాంశాలుగా కొనసాగుతున్నాయి. పోటీ పరీక్షల్లోనూ వీటిలోంచి ప్రశ్నలు ఇస్తున్నారు. ఎడ్‌సెట్, లాసెట్, గ్రూప్స్, వివిధ రకాల పోటీ పరీక్షల్లో ఆర్ట్స్' విద్యార్థులు వీటిని చదవాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్ చదివే వాళ్ళకు ఈ చాప్టర్లు చదివే వీలుండదు. దాంతో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీ పరీక్షల్లో విద్యార్థులకు నష్టం కల్గించే వీలుందని నిపుణులు అంటున్నారు.

సైన్స్ నేపథ్యంతో సీబీఎస్ఈ చదివే విద్యార్థులకు...

సైన్స్‌లో డార్విన్ సిద్ధాంతాన్ని కేంద్ర విద్యా సంస్థ ఎత్తివేయాలని ప్రతిపాదించింది. మానవ పరిణామ క్రమాన్ని సహేతుకంగా నిరూపించే సిద్ధాంతాన్ని ఎన్‌సీఈఆర్టీ కమిటీ విభేదించినట్టు తెలుస్తోంది. దీంతో పాటే పైథాగరస్ సిద్ధాంతానికి స్వస్తి పలకాలని సూచి స్తోంది. దీనివల్ల కూడా సైన్స్ నేపథ్యంతో సీబీఎస్ఈ చదివే విద్యార్థులు రాష్ట్రాల్లోని పోటీ పరీక్షలకు హాజరవ్వడం కొంత ఇబ్బందిగా ఉంటుంది. కేంద్ర స్థాయిలో నిర్వహించే పరీక్షలకు సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగానే ప్రశ్నలు ఇస్తారు. రాష్ట్ర బోర్డు పరిధిలో ఉండే విద్యార్థులు కొత్త చాప్టర్స్ చదివే వీలుండదు. వాళ్లు చదివిన పురాతన భారత చరిత్ర వల్ల ఉపయోగం ఉండదు. కాబట్టి అనేక సమస్యలు ఎదురయ్యే వీలుందని పలువురు అంటున్నారు.

అన్ని రాష్ట్రాలనూ పరిగణనలోకి తీసుకోవాలి

ప్రపంచవ్యాప్తంగా విద్యా విధానంలో వస్తున్న మార్పులను ఆకళింపజేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా విద్యార్థి విద్యా విధానంలోనే స్కిల్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ దిశగా పాఠ్యాంశాలు ఉండటం మంచిది. అయితే, మార్పు జరిగేటప్పుడు రాష్ట్రాల పరిధిలోని విద్యా విధానాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. లేనిపక్షంలో అనేక మంది విద్యార్థులు రెండు సిలబస్‌లతో నష్టపోయే ప్రమాదం ఉంటుంది.

–ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి (ఉన్నత విద్యామండలి చైర్మన్)



వక్రీకరణ సరికాదు

చరిత్రను వక్రీకరించే విధానం ఎన్‌సీఈఆర్టీ సిఫార్సుల్లో బోధపడుతోంది. ప్రాచీన చరిత్రను తీసివేయాలనే ధోరణి మంచిది కాదు. చరిత్ర తెలుసుకుంటేనే ప్రతిభ పెరుగుతుంది. ఇది తెలియకుండా ఇష్టానుసారంగా చరిత్రను పాఠ్యాంశాల్లో జోడిస్తే ప్రతికూల ఫలితాలొస్తాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో వేర్వేరు సిలబస్‌లు వల్ల కూడా నష్టం జరుగుతుందనే విషయాన్ని కేంద్రం గుర్తించాల్సిన అవసరం ఉంది.

– చావా రవి (యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

మీ నాన్న చనిపోయాడు

రుణమాఫీ కాలేదని కుమారుడు బ్యాంక్‌కు వెళ్తే మీ తండ్రి చనిపోయాడని చెప్పిన ఉద్యోగులు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుగోడు
- కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో ఘటన



మల్లారెడ్డి

గన్నేరువరం(మానకొండూర్): తన తండ్రికి సంబంధించిన పంట రుణం మాఫీ కాలేదని బ్యాంకుకు వెళ్లిన కొడుక్కు అక్కడి సిబ్బంది షాక్ ఇచ్చారు. 'మీ నాన్న ఎప్పుడో చనిపోయారు' కదా అని సమాధానం చెప్పడంతో ఖంగుతిన్నాడా కొడుకు. బాధితుడి చెప్పిన వివరాల మేరకు.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన రైతు నూనె మల్లారెడ్డి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామంలోని ఇండియన్ బ్యాంకులో క్రాప్ లోన్ తీసుకున్నారు. ఇటీవల రుణమాఫీ చేపట్టిన ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఆ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. రుణ మాఫీ అర్హుల జాబితాలో మల్లారెడ్డి పేరున్నప్పటికీ మాఫీ డబ్బులు రూ.1,60,000 ఖాతాలో పడకపోవడంతో ఆయన కొడుకు నరేందర్‌రెడ్డి తోటపల్లిలోని ఇండియన్ బ్యాంకుకు వెళ్లాడు. తన తండ్రికి ఇంకా రుణమాఫీ కాలేదని బ్యాంకు అధికారులను ఆరా తీయగా... జాబితా పరిశీలించిన అధికారులు మల్లారెడ్డి మృతి చెందినట్లు ధ్రువీకరించి ఉందని చెప్పడంతో ఒక్కసారిగా షాక్ అయ్యాడు. విషయం తెలుసుకున్న మల్లారెడ్డి వెంటనే బెజ్జంకి వ్యవసాయ అధికారులను సంప్రదించగా.. వారూ సరిగ్గా స్పందించలేదని చెబుతున్నాడు. తన భార్య అంజవ్వ పేరిట కూడా ఇదే బ్యాంకులో రూ.1,80,000 క్రాప్ లోన్ ఉందనీ, అది కూడా మాఫీ కాలేదని చెప్పుకొచ్చాడు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని గన్నేరువరంలోని తహసీల్దార్ కార్యాలయంలో తన గోడు వెళ్లబోసుకున్నాడు. కాగా, 8 నెలల క్రితం తమ రేషన్‌కార్డును కూడా సంబంధితశాఖ అధికారులు రద్దు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

హైదరాబాద్‌లో పేలుళ్ల కుట్ర కేసు.. మరో నిందితుడికి 10 ఏళ్ల జైలు

న్యూఢిల్లీ: 2012 నాటి ఉగ్రవాద కుట్ర కేసులో నిషేధిత ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన ఓ సభ్యుడికి 10 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. సయ్యద్ మక్బూల్ అనే వ్యక్తిని చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా)లోని వివిధ సెక్షన్ల కింద దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం గురువారం తీర్పు ప్రకటించింది. ఈ కేసులోని మొత్తం 11 మంది నిందితుల్లో శిక్ష పడిన అయిదో వ్యక్తి సయ్యద్ మక్బూల్. జూలైలో కోర్టు డానిష్ అన్సారీ, అఫ్తాబ్ ఆలం, ఇమ్రాన్ ఖాన్, ఒబైద్ ఉర్ రెహ్మాన్ అనే వారికి 10 ఏళ్ల జైలు శిక్షను ప్రకటించింది. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన మక్బూల్‌ను పోలీసులు 2013లో అరెస్ట్ చేశారు. ఇండియన్ ముజాహిదీన్ సంస్థ తరఫున భారత్, పాకిస్తాన్‌లలో నేర, కుట్ర కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఇతడిపై ఆరోపణలున్నాయి. ఈ సంస్థ దేశంలోని వివిధ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్‌ను లక్ష్యంగా చేసుకుని, ప్రణాళికలు వేసుకున్నట్లు ఎన్ఐఏ తెలిపింది. ఇండియన్ ముజాహిదీన్ సంస్థ సభ్యులు దేశంలో 2006–13 సంవత్సరాల మధ్య పలు ప్రాంతాల్లో బాంబు పేలుళ్లకు పాల్పడినట్లు వెల్లడించింది.

రూ.6.85 కోట్ల నగదు, వస్తువుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు గురువారం రూ.6.85 కోట్ల విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.347.16 కోట్లకు పెరిగింది. ఈ మేరకు గురువారం సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడించారు. (స్వాధీనం చేసుకున్న వాటి వివరాలను పక్క పట్టికలో చూడవచ్చు.) కాగా, ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఎన్ఆర్ఐ కారులో పోలీసులు తనిఖీలు నిర్వహించగా రూ. 1,78,30,000 నగదు పట్టుబడింది.

అంశం	స్వాధీనం చేసుకున్నవి	మొత్తం స్వాధీనం చేసుకున్నవి
నగదు	రూ.3.17 కోట్లు	రూ.122.62 కోట్లు
మద్యం	రూ.1.96 కోట్లు (31,961 లీటర్లు)	రూ.20.70కోట్లు(72,302 లీటర్లు)
డ్రగ్స్	రూ.23.68 లక్షలు (43 కిలోల గంజాయి, 14.8 కిలోల ఎన్డీపీఎస్)	రూ.17.18 కోట్లు (3460 కిలోల గంజాయి+ఇతరాలు)
విలువైన లోహాలు	రూ.15 లక్షలు (19.27 కిలోలు)	రూ.156.22 కోట్లు (230.9 కిలోల బంగారం, 1038 కిలోల వెండి)
ఇతర వస్తువులు	రూ.1.32 కోట్లు (9570 గోడ గడియారాలు, 546 మీటర్ల వస్త్రాలు)	రూ.30.42 కోట్లు (15,626 కిలోల బియ్యం, 8562 కుక్కర్లు, 53287 శారీలు)
మొత్తం జప్తుల విలువ	రూ.6.85 కోట్లు	రూ.347.16 కోట్లు

(ఇతర వస్తువుల్లో ల్యాప్‌టాప్, వాహనాలు, కుక్కర్లు, శారీలు ఉన్నాయి. విలువైన లోహాల్లో బంగారం, వెండి, వజ్రాలు, ప్లాటినం వంటివి ఉన్నాయి)



రాకాసి ఉడుము

కర్ణాటకలోని కుంద గ్రామంలో రాకాసి ఉడుము గురువారం ప్రత్యక్షమైంది. ఆరు అడుగుల పొడవు ఉన్న ఈ ఉడుము కొడెందెర దిలీప్ అనే వ్యక్తి ఇంటి ప్రహరీ వద్ద తిరుగుతుండగా చూసి అటవీశాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే అక్కడకు చేరుకుని ఆ ఉడుమును పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు. దీన్ని జెయింట్ ఇండియన్ మానిటర్ లిజార్డ్ అంటారని, ఇది చాలా అరుదుగా కనిపిస్తుందని జీవశాస్త్ర నిపుణులు తెలిపారు.

పోయిన బుల్లెట్లు దొరికాయి..

- సకాలంలో కేసును పరిష్కరించిన జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది
- అభినందించిన డీజీపీ, అడిషనల్ డీజీ

సాక్షి, హైదరాబాద్: ఓ దొంగచేతిలో పడిన 60 ఇన్‌సాస్ లైవ్ బుల్లెట్లను జీఆర్పీ (గవర్నమెంట్ రైల్వే పోలీస్), ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) సిబ్బంది సకాలంలో స్పందించి స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 24న సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ సిద్ధార్థసింగ్ 60 ఇన్‌సాస్ రౌండ్లు (బుల్లెట్లు), మూడు మ్యాగజైన్లు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 10లో చోరీకి గురైనట్టు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైల్వే, రోడ్డు భద్రత విభాగం అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి, రైల్వేస్ ఎస్పీ షేక్ సలీమా ఆదేశాల మేరకు జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు దర్యాప్తుకోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ నలుదిక్కులా ఉన్న, గాంధీనగర్ మెట్రో స్టేషన్ పరిసరాల్లోని దాదాపు వంద సీసీటీవీ కెమెరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి, చివరకు నిందితుడు నక్కెని ఆనందమూర్తిని అదుపులోకి తీసుకున్నారు. అయితే తానే చోరీ చేసినట్టు అంగీకరించిన ఆనందమూర్తి భయంతో బుల్లెట్లను మెట్రో స్టేషన్ వద్ద వదిలేసినట్టు అంగీకరించాడు. ఆ సమాచారంతో మరికొన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా భోలక్‌పూర్‌కు చెందిన రాచమల్ల సత్యనారాయణ రోడ్డు పక్కన దొరికిన 60 ఇన్‌సాస్ రౌండ్‌లు, మూడు మ్యాగజైన్‌లతో సహా మందుగుండు సామగ్రిని తీసుకున్నట్లు గుర్తించారు. ముషీరాబాద్ ప్రాంతంలో అతన్ని అదుపులోకి తీసుకుని, బుల్లెట్లు, మూడు మ్యాగజైన్లు స్వాధీనం చేసుకున్నారు. బుల్లెట్లను చోరీ చేసిన నిందితుడు నక్కెని ఆనందమూర్తిని అరెస్టు చేశారు. కాగా, చోరీ కేసులో సకాలంలో స్పందించి, కేసును పరిష్కరించిన జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బందిని డీజీపీ అంజనీకుమార్, రైల్వే, రోడ్డు భద్రత విభాగం అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి, ఎస్పీ షేక్ సలీమాతో గురువారం డీజీపీ కార్యాలయంలో సత్కరించారు.



గుడిలో కొలువుదీరిన అతిపురాతన భారీ నంది విగ్రహం



ఐదారు శతాబ్దాల నాటిదిగా భావిస్తున్న అరుదైన భూవరాహమూర్తి శిల్పంతో పరిశోధక బృందం

ఆ రెండూళ్లలో అడుగడుగునా పురాతన మందిరాలు

- తాండూరు సమీపంలోని యాలాల, గోవిందరావు పేటలో ప్రత్యేకతలు
- పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

సాక్షి, హైదరాబాద్: ఐదారు శతాబ్దాల నాటి అరుదైన, అందమైన వరాహమూర్తి శిల్పం.. సాధారణంగా శివాలయాల ముందుండే నందికే ఓ గుడి.. ఊరిలో ఎక్కడికెళ్లినా అతి పురాతన ఆలయాలు, ఎత్తయిన శివలింగాలు.. ఇవి తాండూరు సమీపంలోని యాలాల, గోవిందరావు పేటల్లో కనిపిస్తున్న ప్రత్యేకతలు. ఈ ఊళ్లలో ప్రత్యేకతలపై అధ్యయనానికి కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆసక్తి చూపుతోంది. తాజాగా కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ నేతృత్వంలోని బృందం ఈ ఊళ్లను సందర్శించింది. గోవిందరావుపేట గ్రామంలో బేతాళుడు అని పిలిచే శృంగిని, శివాలయంలోని అతి పురాతన జైన విగ్రహాలను, భూవరాహ స్వామి పురాతన శిల్పాన్ని, మార్కండేయ మందిరం, చౌడేశ్వరి ఆలయం, రామలింగేశ్వరాలయాన్ని సందర్శించింది. యాలాలలోని బసవన్నగుడి, నగరేశ్వరాలయం, వీరభద్రాలయం, హనుమాన్ మందిరాలనూ సందర్శించింది. విష్ణుకుండిన, రాష్ట్రకూట శైలిలకు చెందిన పెద్ద శివలింగాలు, నందులను వారు గుర్తించారు. వీధివీధినా ఏకరీతి నిర్మాణాలు ఆశ్చర్యపరిచాయని వారు చెప్పారు. బసవన్న గుడిలో మీటరు ఎత్తు, అరమీటరు వెడల్పుతో, మెడలో పెద్ద మువ్వలు, గంగడోలుతో ఉన్న నంది విగ్రహం అద్భుతంగా ఉందన్నారు. ఈ గుడిముందు నిర్మాణంలో ఇమిడి ఉన్న 10–11 శతాబ్దాల నాటి కళ్యాణి చాళుక్యుల శాసనాన్ని గుర్తించారు. దాన్ని వెలుపలికి తీస్తే దాని ఆధారంగా చారిత్రక ఆధారాలను గుర్తించే వీలుంటుందని చెప్పారు. గోవిందరావు పేటలో ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న కక్కరవేణి (కాకరవాని) నది ఒడ్డున వాకాటకశైలిలో చెక్కిన భూవరాహమూర్తి విగ్రహం అద్భుతంగా ఉందన్నారు. చతుర్భుజుడైన ఈ శిల్పం పరహస్తాలలో ఎడమచేయి కటిహస్తం, కుడిచేయి సూచీముద్రతో ఉందని తెలిపారు. వేలిపై నిలిపిన భూదేవి, కుడికాలు శేషసర్పంపై ఉంచి మలిచిన తీరు 5–6 శతాబ్దాల శైలి అని పేర్కొన్నారు. ఈ రెండూళ్లలో ఇన్ని అతి పురాతన ఆలయాలు ఉండటానికి కారణాలను ఆధారసహితంగా విశ్లేషించాల్సి ఉందని హరగోపాల్ తెలిపారు. ఈ బృందంలో కో–కన్వీనర్ బీవీ భద్రగిరీశ్, ఘంటా మనోహర్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు ఆధార్ తరహాలో యూనిక్ ఐడీ

స్కూలు స్థాయి దశ నుంచి ఉన్నతవిద్య దాకా ఇదే నంబర్

- తల్లిదండ్రుల సమ్మతి కోరాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం
- అందుకు అనుగుణంగా డీఈవోలకు ఆదేశాలిచ్చిన పాఠశాల విద్య డైరెక్టరేట్



సాక్షి, హైదరాబాద్

దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికీ ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఆర్) గుర్తింపు కార్డు ఇవ్వాలని కేంద్రం ఇటీవల నిర్ణయించింది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రుల సమ్మతి తీసుకో వాలని తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఈ నెల 11న ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో దీనిపై తక్షణమే దృష్టి పెట్టా లని రాష్ట్ర పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం జిల్లా విద్యాశాఖ అధికారులను గురువారం ఆదేశించింది. ఆధార్ తరహాలోనే విద్యార్థులకు యూనిక్ ఐడీ ఇవ్వడం దీని ముఖ్య ఉద్దేశం. ఒక విద్యార్థికి కేటాయించే నంబర్ జీవితాంతం కొనసాగుతుంది. స్కూల్ స్థాయి నుంచి ఉన్నతవిద్య పూర్తి చేసినా ఇదే నంబర్ ఉంటుంది. ఈ నంబర్ ద్వారా ఆన్‌లైన్‌లో విద్యార్థి విద్యాసంబంధ విషయాలను తెలుసుకొనే వీలుంది. విద్యార్థి ఏ స్కూల్, కాలేజీ, యూనివర్సిటీలో చదివాడు? అకడమిక్ మార్కులు ఏమిటి? వంటి వివరాలను కేవలం మౌస్ క్లిక్ ద్వారా తెలుసుకొనే వీలుంది. ఇప్పటికే యూడైస్ ద్వారా విద్యార్థుల డేటాబేస్‌ను పూర్తి చేస్తున్నారు. విద్యార్థుల అకడమిక్ సర్టిఫికెట్లను కూడా ఆన్‌లైన్‌లో భద్రపరిచే డిజి లాకర్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. ప్రతి హెచ్ఎం స్థాయిలో పేరెంట్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి కేంద్రం ఇవ్వబోయే విశిష్ట గుర్తింపు కార్డుకు వారు అనుకూలమా లేదా ప్రతికూలమా? తెలుసుకోవాలంటూ ఓ పత్రాన్ని అన్ని జిల్లాలకు పంపింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.